




మీరు మృదువుగా వేపొరబ్ రాస్తే అది వెంటనే వెచ్చదనాన్నిచ్చి హాయిని గొలుపుతుంది....మీపిల్లవాడు సులభంగా శ్వాసను పీల్చుకొని రాత్రంతా హాయిగా నిద్రపోతాడు.

బాధ నివారణకు మీ పిల్లవాడు మీ మీద ఆధారపడతాడు. అతడు రొంపతో బాధపడుతున్నప్పుడు విక్స్ వేపొరబ్ రాయండి. చాతి గొంతుక వీపు మరియు ముక్కుచుట్టుప్రక్కల మీ ప్రేమపూర్వక చేతులతో విక్స్ వేపొరబ్ మర్దన చేస్తే, మీ కళ్ల ముందే ముక్కు దిబ్బడ పోవడం ప్రారంభమవుతుంది. అతను తిరిగి సులభంగా శ్వాసను పీలుస్తాడు ఎందుకంటే ఔషధ ఆవిరులు ఏడు సెకండ్లలోనే జలుబు భారమున్న చోట్లకి చేరతాయి. అప్పుడు పిల్లవానిని చక్కగా పరుపు మీద పడుకోబెట్టండి అతను బాగా నిద్రపోతూంటే వేపొరబ్ రాత్రంతా పని చేస్తూంటుంది. తెల్లవారేటప్పటికి జలుబు భారమంతా పోయింది అతడు లేచేటప్పటికి హాయిగా, ఆరోగ్యంగా వుంటాడు ఆటలతో మురిపించే మీ ముద్దు బిడ్డ.



విక్స్ వేపొరబ్ జలుబులకు ఈ రాత్రే రాయండి


ఔనౌను,
నేను కేలరీల సంగతి గమనిస్తాను!
నా కుటుంబం ఆరోగ్యం విషయమై సహజంగా నేను శ్రద్ధవహిస్తాను.
హారం, విటమిన్‌లు కలిగి, శక్తినిచ్చే ఆహారం సమపాళంగా వుండేట్టు చూడాలి.
కాగా, కనపడ్డదల్లా వాడి చూడను. కొత్తది, పుష్టికరమైన శక్తి ప్రదాయిని
అయిన ఓవోమాల్ట్ నా కుటుంబీకులందరికీ రోజూ ఇస్తాను. అది సమపాళాలు
కలిగిన పోషకాహార పానీయం.
ఓవోమాల్ట్
NEW FORTIFIED
Ovomalt
FOOD BEVERAGE
ఉత్పత్తిదారులు :
ఫుడ్స్ ఫ్యాట్స్ & ఫెర్టిలైజర్స్ లిమిటెడ్
తాడేపల్లిగూడెం, ఆంధ్ర ప్రదేశ్
సేల్స్ అడ్మినిస్ట్రేషన్ : 115-బి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ రోడ్, మద్రాసు-1
EP-FFP-14 TEL


రెమి
పౌడర్
Remy's

తొలిమాట

కొన్ని కొన్ని సన్మాన సభలు, సంతాప సభలు తమాషాగా జరుగుతాయి. జరపబడే వారికంటే జరిపేవారికే ప్రాముఖ్యం ఎక్కువైతే రసాభాసకాక మరేమిటి? వీటిమీద వ్యంగ్య రచన 'కీ శే కావ్యశ్రీ' (26 వ పేజీ)

*　　　*　　　*

ఆనంద ధామాలుగా వుండవలసిన కొన్ని సంసారాలు విషాద ధూమాలతో నిండిపోతాయి. ఎందుకనో? భార్య భర్తనుంచి కోరేదేమిటి? కుటుంబ సౌఖ్యం దేనిమీద ఆధారపడి వుంటుంది? ఈ ప్రశ్నలకు సమాధానం "తొలకరి (56 వ పేజీ)

*　　　*　　　*

"జ్యోతి" దీపావళి ప్రత్యేక సంచిక తెలుగు సాహిత్యంలో కలకాలం నిలిచిపోదగిన ఉత్తమ రచనలతో, కొత్త ఆకర్షణలతో నవంబరు మొదటి వారంలో వెలువడుతుంది (3 వ పేజీ)

*　　　*　　　*

'జ్యోతి' సంస్థనుంచి జనవరిలో పాఠకులకు ఇంకొక కానుక రాబోతున్నది. (6 వ పేజీ)

వేమూరి రాధాకృష్ణ

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్ పేట పోస్టు
విజయవాడ-2

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
అక్టోబర్ 1966
సంచిక 10

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం
నవజ్యోతి ఫిలిమ్స్‌వారి
"అడుగు జాడలు"లో దృశ్యం

ఉత్తరాలు

ఈ నెల నన్ను అమితంగా ఆకర్షించి నది తల్లావఝ్ఝల పతంజలి గారి 'మనసు చెప్పిన కథ' కథని ఎత్తుకోవటంలోనూ పూలరథం లాగా దానిని చివరంటా నడిపించటంలోనూ చివర్న ఒళ్ళు ఝల్లుమనే ట్విస్ట్' నిచ్చి కథను ముగించటంలోనూ - రచయిత ప్రశంసించదగిన ప్రతిభను కనబరిచారు

—తెన్నేటి రామారావ్,
రూర్కెలా (ఒరిస్సా)

ఈ నెల అన్ని కథలూ చాలా బాగున్నాయి కాని మిస్ శోభాదేవి' కథలో పాతికేళ్ళ అన్నగారికి చెల్లెలు శోభ (ఎంత లేదన్నా 20 ఏళ్ళయినా ఉంటాయి) టెన్నిస్ ఫైనల్స్‌లో గెలిస్తే "స్వీట్ కిస్సెస్ పెడతా ననటం ఏ మాత్రం సబబు అనిపించలేదు మన భారతదేశ సంప్రదాయం ప్రకారం ఇంతమటుకు మన కుటుంబాల్లో అల్లాంటివి జరుగవు పెద్దలు జరుగనీయరు

ఎ. సత్యవతీదేవి
సికింద్రాబాదు

మిస్ శోభాదేవి కథకు ఆ పేరు ఎలా సరిపోయిందో అర్థం కావటం లేదు అసలు కథ కూడా ఏమంత ఉత్సాహకరంగా లేదు పైగా అంత మందిలోనూ ఆమె తన అన్నను అలా కొట్టడం మరీ అసహ్యంగా ఉంది

జి. పార్థసారధి
విజయవాడ

సెప్టెంబరు నెల సంచిక 'రాజకీయాలు' వేడివేడి పకోడీలలా నడిచాయి జ్యోతికి రాజకీయాలు ప్రత్యేక ఆకర్షణ

[కొత్త శీర్షిక 'ప్రపంచ తంత్రం' ఈసప్ కథలు బంగారు బాతు కథ బాలలకు వెన్నముద్ద లాంటివి ఇలాంటివి ప్రచురించు మన్నందుకు నా వందనములు

నిమ్మల వెంకటరెడ్డి,
వీరవాసరం

మిస్ శోభాదేవి కథ మొదటి నుంచి చివరివరకు ఇంట్రెస్టుగా ఉంది ఇందులో ముఖ్యంగా టెన్నిస్ మ్యాచ్ ఒక ప్రత్యేకాకర్షణ నిజంగా మ్యాచ్ చూచినట్టి అనుభూతి కలిగింది రామం ప్రసాద్‌ల గెలుపు ఓటమి కథలోని ప్రేక్షకులేకాక చదువుతున్న పాఠకునిగా చివరివరకు నిర్ణయించలేక పోయాను ఇటువంటి కథను అందించిన పెన్మత్స సూరి గారికి నా అభినందనలు

తమ్మిశెట్టి బాబురావు
కొత్తగూడెం

జ్యోతికి విజేత' సీరియల్ మణి పూసలాంటిది ... అతిశయోక్తి కాదు రచయిత్రికి నా ధన్యవాదములు కాని సెప్టెంబరు సంచిక చదివాక ఇలా ఉత్తరం వ్రాయలేకుండా ఉన్నాను సిస్టర్ నుండి వచ్చిన ఉత్తరం సంధ్య చదివినట్లు వ్రాశారు క్రమే అడ్రసు లేదని ప్రత్యేకంగా పేర్కొన్నారు మరి తిరుగు ఉత్తరం (సిస్టర్‌కి) సంధ్య ఏ అడ్రసుకు వ్రాసిందో సందేహంగా ఉంది మొత్తంమీద సీరియల్ హుషారుగా సాగుతున్నదంటే నమ్మండి

చంద్రాభట్ల
సత్యనారాయణమూర్తి
విజయనగరం

సెప్టెంబరు సంచికలో "రాజకీయాలు" శీర్షికలో వ్రాసిన ఎడిటోరియల్" నిష్పక్షపాతముగా వ్రాసియున్నారు అందుకు చాలా సంతోషం

మండవ రామమోహన్‌రావు,
విజయవాడ

మనసు చెప్పిన కథ "తప్పు వన్ను బాగా ఆకర్షించినవి సదరుకథల రచనా శైలి మెచ్చదగినది

కొత్త సీసాలో పాతసారా" అయినప్పటికి ప్రపంచ తంత్రం ఈసప్ కథలు చదవడానికి చాలా వుత్సాహంగా వున్నవి

జువ్వల నరసింహారావు,
పాలకొల్లు

సెప్టెంబర్ సంచికలో "రాజకీయాలు శీర్షిక నన్నెంతో ఆకర్షించింది ఆంధ్ర రాజకీయాలలో మురా తత్వాలను వర్ణిస్తూ ప్రజలకు కాంగ్రెస్ పరిపాలనపై అసహనం అసంతృప్తి. గత యిరవై ఏళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వంలో గల అవకతవకలు వంటి నగ్న సత్యాలను నిష్పక్షపాతంగా రాసినందుకు ధన్యవాదాలు శ్రీ పెనుమర్తి సూరి రాసిన మిస్ శోభాదేవి కథ (టెన్నిస్ ఆడేవారికి కూడా) తొలి మాటలో రాసినంత ఆసక్తి కలుగక పోవుట సరికదా వాస్తవానికి ఎంతో దూరంగా వుంది

జగన్నాధం.
(ఖర్గపూర్)

సెప్టెంబరు జ్యోతి'లో నన్నుక్షమించరూ' కథ నన్నాకర్షించింది విజేత' సీరియల్ కథ ఉత్సాహంగానడుస్తూంది. పెనుమర్తి సూరిగారి మిస్ శోభాదేవి' కథ చాలా బాగుంది ఇటువంటి కథలు ప్రచురించి మాకు ఆనందం కలుగచేస్తున్నందుకు మీకు నా అభివందనలు

తాటికొండ రంగమోహన్‌రావు,
బరంపురం (గంజాం)

కొత్త ప్రపంచాలో నడచిన మనసు చెప్పిన కథ' ప్రశంసనీయము. ప్రపంచ తంత్రంలోని ఈసప్ కథలు చిన్నలకంటే మాకే రుచికరముగా నున్నవి జ్యోతి కివి ఆణిముత్యాలు.

అనంతలక్ష్మి,
పూనా.

రాజకీయాలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలలో ఒకదానికి ఈ సంచిక మీ కందేసరికి మొహం కందిపోయి వుంటుంది. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీలో ఖాళీ స్థానానికి సెప్టెంబరు 29వ తేదీన ఎన్నిక జరిగినా, రాజీ కుదిరినా ఇది మాత్రం తప్పదు. ఆ వర్గం ఏదో మీకు తెలుసు; మా కిప్పుడు తెలియదు.

అందుచేత మేము ఏం రాసినా మీకు జోస్యా స్పష్టంగానే కనిపించవచ్చు. కాని, ఒకటి చెప్పవచ్చు. చివరికి ఎన్నిక జరగకపోవచ్చు. ఒకవర్గానికి తాము గెలుస్తామనే ధీమా దిటంగా వున్నది. అందుకని ఆ వర్గం బస్తీమే సవాల్ అని మీసాలు లేకపోతే పెంచుకుని మరీ మెలేస్తోంది. ఈ దెబ్బతో మీరో మేమో, తాడోపేడో తేలిపోవా లంటోంది.

రెండో వర్గం ఈ సవాల్‌ను అందుకోవటం లేదు. వెనక్కి వెనక్కి తగ్గుతోంది. రాజీ నా ప్రాణం అంటోంది. రాజీకి రాకపోతే నా తడాఖా చూపిస్తా నన్న ఈ వర్గం నాయకుడు ఇప్పుడు దీర్ఘ మౌనంలో, బహుశా ఆత్మ శోధనలో, పడిపోయారు.

చివరికి రాజీవర్గం కోరుకున్నట్టు రాజీయే జరగవచ్చు. అంటే రాజీ వర్గమే రాజీ పడచ్చు. పోటీయే జరిగితే ఏదో ఒక వర్గం ఓడిపోక తప్పదు గదా. ఇది నిజంగానే రాష్ట్రంలో కాంగ్రెసుకు దెబ్బ. దీని ప్రభావం వచ్చే ఎన్నికలలో కాంగ్రెసు విజయావకాశాలమీద కూడా పడవచ్చు. అందుచేత ఏదో విధంగా రాజీయే జరగచ్చు.

కాని, కాంగ్రెసులో ఐకమత్యం మీదగాఢాభిమానం కొద్దీ ఈ రాజీ జరుగుతుందనుకోవటం పొరబాటు. అందుకోసం కాదు. ఓడిపోతే మళ్ళీ తలెత్తుకు తిరగటం కష్టం. తమబండారం బయట పడిపోతుంది. తమ ప్రతిష్ఠ మట్టిపాలవుతుంది. అందుకని అవతలి వర్గం రాజీకి రావాలంటున్న ఇవతలి వర్గం తనే రాజీకి రావచ్చు.

ఇదంతా ముందే చెప్పినట్టు మీకు ఈ సంచిక చేతి కందేసరికి 'ఔట్ డేటెడ్' కావచ్చు. ఇది రాస్తున్న సమయానికి ఇదీ పరిస్థితి మరి.

ఈ ప్రహసనంలో శ్రీ సంజీవయ్య పాత్ర ఏమిటి? ఆయన ఒక వర్గానికున్న బహు నాయకులలో ఒకరు. కాని, ఆయన గొంతు అట్టే వినబడడం లేదు. ఇంకా సంజీవరెడ్డి, రఘురామయ్య, సుబ్బారెడ్డి గార్లయినా అప్పుడప్పుడు పెదవి విప్పుతున్నారు గాని, ఈయన గప్‌చిప్. ఎందుకనో?

రాజీ జరిగినా, పోటీ జరిగినా ఆయనకి ఒరిగేదీ, తరిగేదీ పెద్దగాలేదు. అయన బలమేదో ఆయన కుంటుంది. ఒకప్పుడు పెద్దగావున్నదీలేదు, ఇప్పుడు పోయేదీలేదు. పోయినా, వచ్చినా సంజీవరెడ్డి గారికే.

* * *

ఇంతకీ ఆయన సంజీవరెడ్డిగారితో ఎందుకు కలిశారన్న ప్రశ్నకే సరైన సమాధానం ఎవరికీ దొరకడంలేదు.

ఒకప్పుడు తనువులు వేరు, మనసు లొకటిగా ఉన్న సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డిగార్లమధ్య స్పర్థలు వచ్చాయి. వారి వర్గం రెండుగా చీలిపోయినా అవి పెద్దవర్గాలే. తనది మొదటినుంచి చిన్నవర్గం. ఇప్పుడది మూడో వర్గమైపోయింది. తనకి ఆలిండియాలో కూడా పెద్దగా బలం లేదని ఆ మధ్య బొంబాయిలో సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి జరిగిన పోటీలో తాను ఓడిపోవటంతో తెలిసిపోయింది. ఈ మూడో వర్గంతో ఏం చేసుకోవాలి? అది బేరమాడ్డానికి తప్ప దేనికీ పనికిరాదు. ఎటో అటు చేరకపోతే దానివల్ల ప్రయోజనం

వుండదు. అటా ఇటా అని ఆయన కొన్నాళ్ళు ఆలోచించారు. తనకి ఇద్దరూ ఒకటే. ఒకప్పుడు ఇద్దరూ ప్రత్యర్థులు: ఇద్దరూ తన్ను వేధించుకు తిన్నవాళ్ళే.

ఏమైతే అదయిందని ఆయన సంజీవరెడ్డిగారితో చేరారు. ఎలాగైనా అయినది పెద్దపెయ్యి కదా? ఇక్కడే సంజీవయ్యగారు తప్పులో కాలేశారని కొందరంటారు: ఆయన బ్రహ్మానంద రెడ్డిగారి వర్గంలో చేరితే ఎలా ఉండేదో; బహుశా ఇంత రగడ జరిగేదే కాదేమో?

నిజానికి సంజీవయ్యగారు రాజకీయాలలో బ్రహ్మాండంగా పైకి రావగినంత వ్యక్తిత్వ బలం, చాతుర్యం, ఎత్తుల మారి తనం కలిగినవారు కాదేమోనని ఆయన్ని బాగా తెలిసినవారు కూడా అంటారు. ఆయనకి సంగీత సాహిత్యాలలో, నాటకాలు హరికథల్లో మంచి అభిరుచి ఉంది. గాంధిగారిని ఎన్నడూ చూసికూడా ఎరగని అప్పర్ డివిజన్ క్లర్కు ఉద్యోగంనుంచి 1950లో తప్పించారి రంగా, ప్రకాశంగార్ల చేయూతతో ఆయన రాజకీయాలలో ప్రవేశించారు. పార్లమెంటు సభ్యులయ్యారు, తరవాత ఎన్నికలలో మద్రాసు శాసనసభ సభ్యులయ్యారు. అక్కడినుంచి అదృష్టాలు ఆయనను ముందుకుతోసుకుపోయాయి.

యువకుడు, ఉత్సాహి, మాటకారి, బ్రహ్మచారి అయిన శ్రీ సంజీవయ్యను రాజాజీ తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 1953 లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డప్పుడు రాజాజీ ప్రకాశంగారికి కూడా ఆయన్ని గురించి సిఫార్సు చేశారు. 1955 ఎన్నికల తర్వాత గోపాలరెడ్డి మంత్రి వర్గంలో కూడా సభ్యులయ్యారు. అప్పటిలో ఆయన శ్రీ సంజీవరెడ్డికి కుడిభుజం లాంటి వాడుమరి:

195 లో ఆంధ్రప్రదేశ్ అవతరించాక, శ్రీ సంజీవరెడ్డి మంత్రివర్గంలో స్థానిక స్వపరిపాలనశాఖ మంత్రిగా చేరారు. 1960లో శ్రీ సంజీవరెడ్డిగారు కాంగ్రెసు అధ్యక్షులుగా వెళ్ళిపోగానే బ్రహ్మానందరెడ్డి, సత్యనారాయణ రాజుగార్లు పోటీ పడ్డారు. ఈ పోటీలో శ్రీ సంజీవయ్య రాజీ అభ్యర్థిగా ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

అలా అవడంతోనే శ్రీ సంజీవరెడ్డి వర్గంతో విభేదాలొచ్చాయి. ఆయనకి వ్యతిరేకంగా ఒక యూనిటీ ఫ్రంట్ ఏర్పడింది. కాని అల్లూరివారి అండవ డలతో ధైర్యంగా నిలబడ్డారు.

చిత్రం ఏమిటంటే ఇప్పటిలాగానే అప్పుడూ ఎలక్షన్ కమిటీ ఎన్నికల దగ్గరే పేచీలు వచ్చాయి. తనను ధిక్కరించి శ్రీ సుబ్బారెడ్డి ఎలక్షన్ కమిటీకి పోటీచేసి గెలిచారు. ఈ స్పర్థలు పెరిగి పెరిగి. సుబ్బారెడ్డిగారివంటి ఉక్కు మనిషిచేత మంత్రివర్గంనుంచిరాజీనామా చేయించేదాకా శ్రీ సంజీవయ్యగారు వూరుకోలేదు.

1962 ఎన్నికలలో సంజీవరెడ్డివర్గం పైకి వచ్చింది, ఆయన మంత్రి పదవి యిస్తానన్నారని, అల్లూరివి కూడా

తీసుకుంటేగాని అంగీకరించనని శ్రీ సంజీవయ్య పట్టుపట్టారు.

వ్యక్తిగా ఆయన అదృష్ట మనండి, అవకాశమనండి, ప్రతిభ అనండి, మంచితనం అనండి_శ్రీ సంజీవయ్యకు శ్రీ సంజీవరెడ్డితో పోటాపోటీగా పదవులు వచ్చాయి ఆయన మంత్రిఅయితే ఈయన మంత్రి. ఆయన ముఖ్యమంత్రి అయితే ఈయనా ముఖ్యమంత్రి. ఆయన కాంగ్రెసు అధ్యక్షుడైతే ఈయనా అదే. చివరికి శ్రీ సంజీవరెడ్డి కంటెముందే కేంద్ర ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. వరసగా నెహ్రూ, శాస్త్రి, ఇందిర మంత్రివర్గాలలో ఆయన సభ్యులు. ఆయన తరవాతే శ్రీ సంజీవరెడ్డి కేంద్రానికి వెళ్ళారు. ఇందిరాగాంధి గారి అండ ఆయనకి ఉందని కూడా కొందరు చెప్పుకుంటారు.

ఇక ముందు ఏం జరుగబోతుందో చెప్పడం కష్టం. ఆంధ్ర కాంగ్రెసు రాజకీయాలలో ఏ వర్గం పైకివస్తుంది? బలాబలాలు ఎలా వుంటాయి? సంజీవయ్యగారు సంజీవరెడ్డివైపే వుంటారా? విడిపోతారా? ఎన్నికల తరవాత కేంద్రంలోనే వుంటారా? రాష్ట్రానికి వస్తారా? రెంటికీ మధ్యగా వుంటారా? ముఖ్యమంత్రి ఎవరవుతారు? ప్రశ్నలు మాత్రం మహాజోరుగా వున్నాయికదూ. కాంగ్రెసు అధ్యక్షుడు, కింగ్‌మేకర్ బిరుదాంకితుడు అయిన శ్రీ కామరాజ్ అన్నట్టు పార్కలాం. లెటజ్‌సీ. చూద్దాం.

★★★

వచ్చే సంచికలో ప్రారంభం

కొత్త సీరియల్

సెలయేటి గలగల

రచన : విహారి & శాలివాహన

ఉద్యోగం చేస్తున్న స్త్రీలను ఎన్నో సమస్య లెదుర్కొంటాయి
అన్నింటిలో ముఖ్యమైనది వివాహ సమస్య:
వివాహమైన తర్వాత సంసారం నిర్వహణ సమస్య.
ఈ సమస్యలను అందరికి అనుకూలంగా, సంతృప్తికరంగా
పరిష్కరించుకోగల ఆదర్శ స్థాయికి ఇంకా పెరగని
మన సమాజ పరిస్థితు లాధారంగా రచించిన నవల.

'నీవు లేవు నీ పాటవుంది'

(తిలక్ రాసిన ఖండికలనే కొద్దిగా మార్చి కూర్చినపుడు కింది విధంగా ఆయన అంతర్బహిరాకృతి రేఖామాత్రంగా ఇట్లా తయారయింది. ఆయన 'ఆర్తగీతం', 'ప్రకటన,' 'నీడలు' అనే మూడు కవితలనుంచి ఈ మాటల్ని తీసుకొన్నాను. ఇది తిలక్ మాటల్లో తిలక్‌పై పాట.)

అతను కన్నీరుగా కరిగిన గీతిక
మంటలో అంతరాంతర దగ్ధమయిన బూడిద
చిత్ర శిల్ప కవితా ప్రసక్తులు
తత్వసూత్ర వాదోక్తులు
సుందర వధూకదుష్ణ పరిరంభములు పట్టనివాడు
మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని
క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని
గచ్ఛత్ శవాకార వికారుల్ని చూసి
ఈ నాగరికతారణ్యావాసం భరించలేక
ఈ మానవత లేని లోకాన్ని స్తుతింపలేక
ఈ కృత్రిమ వేషాన్ని అభినయింపలేక
అతను వెళ్ళిపోయాడు.

2

మన కవిత్వాన్ని కాపాడుకోవాలంటే
ఒక్కటే ఒక్కటే మార్గం
వెతికి తీసుకురండి వెళ్ళిపోయిన మనిషిని
అపార కృపా తరంగితాలైన నయనాంచలాలు

ఆనందం జాలువారె స్నిగ్ధ దరహాస పరిమళాలు
సంస్కారపు కేశపాశంలో తీసిన అనురాగపు పాపిట
సదా ప్రజా హితైషి, సుభాషి, గర్వంలేని గంధర్వుడు
కల్లనీ, క్రౌర్యాన్నీ, కాలుష్యాన్నీ తిరస్కరించినవాడు
తెల్లని గోర్వంకల్ని ఉల్లాసంగా ఎగరేసినవాడు
చల్లనివాడు, చక్కనివాడు
ఆయన పేరు తిలక్

3

చీకటి పడుతోంది
చిటారుకొమ్మలో నక్షత్రం చిక్కుకుంది
శిథిల సంధ్యా గగనం రుధిరాన్ని కక్కుకుంది
దారంతా గోతులు యిల్లేమో దూరం
చేతిలో దీపం లేదు
ధైర్యమే ఒక కవచంగా వెళ్ళిపోయాడాయన
కాళరాత్రివేళ కంకాళాలు చెప్పిన రహస్యం
తెలుసుకోవాలని
దారి పక్క నిలిచిన మోడుచెట్ల బాధని
అనుభవించాలని,
పచ్చికలో దాక్కున్న పాముల్ని
బుట్టలోకి పట్టాలని,
రేపటి ఉదయానికి యీవేళ వెలుగుల్ని
సమకూర్చుకోవాలని.

– వరవరరావు

పారా హుషార్!

స్టేషనులో కళ్ళు మూసి తెరిచేలోగా నోరు ఆవలించేంత విచిత్ర పద్ధతిలో పకడ్బందీగా జరుగుతాయి దొంగతనాలు.

"పాపం విచారించవల్సిన విషయం. పోలీస్ స్టేషన్‌కి రిపోర్టివ్వండి" అని అతనిమీద సానుభూతిని ఆ సలహాలో యిమిడ్చి ముందుకు సాగిపోయారు సుబ్బరామయ్యగారు, తా నెక్కబోయే రైలును రిసెర్వ్ చేసుకుంటూ.



ప్రథమ బహుమతి రూ. 50

గుత్తుల భాస్కరరావు

ఎల్. ఈ. ఈ. రెండవ సంవత్సరం

ఎస్. ఎమ్. వి. ఎమ్. పాలిటెక్నిక్

తణుకు.

విజయవాడ ప్లాట్‌ఫారం మీద బారులు తీర్చిన సైనికుల వరుసల్లా ఉన్నాయి రైళ్ళు పొగలు కక్కుతూ. ఇన్ని రైళ్ళని చూచేటప్పటికి సుబ్బరామయ్య గారి గుండెజారుకుంది. ఏ రైలెక్కాలో పాలుపోలేదు. అంతా అయోమయం అనిపించింది. తవలా పంచెకట్టు, మల్లు లాల్చీ ఉన్న ఒకాయన దగ్గిరకెళ్ళి,

"చూడండి, మద్రాసు వైపు వెళ్ళే రైలు ఎక్కడుందండీ?"

"వల్లకాట్లో" మండిపడ్డా డాయన.

"అన్నట్టు, వల్లకాట్లో రైళ్ళలా ఉంటాయండీ?" అడిగారు సుబ్బ రామయ్యగారు గడుసుగా.

"లేకపోతే ఏవిటండీ? నా డబ్బు పోయి నే నేడుస్తూంటే మధ్య మీ గోలేవిటి?"

సుబ్బరామయ్యగారికి కోపంరాలేదు. సరికదా అతనిమీద జాలేసింది. పాపం. డబ్బు పోగొట్టుకున్న బాపతు కోపంలో అతనలా విసుక్కోవడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

"ఎంతపోయిందండి?"

"ఐదొందలు"

"ఎలా పోయిందండీ?"

"ఎలా పోతే మీ కెందుకండీ? మీ రేమైనా సాధించి పెడతారా? ఇదుగో చూడండి" అంటూ నైసుగా నైపుణ్యంతో కత్తిరించబడ్డ తన లాల్చీ జేబు చూపించాడు. సువర్ణసుందరిలో రాక్షసుడిలా నోరు తెరిచారు సుబ్బరామయ్య గారు. అవును మరి. ఈ బెజవాడ

చివరికి ఎవరి సహాయం అక్కర్లేకుండానే కళ్ళద్దాల్లోంచి నేమ్ బోర్డు చదివి రైల్లో చొరబడి సీటు సంపాయించారాయన.

ఎంత గుంజుకున్నా యిందాకటి వ్యక్తి మనోవీధిలోంచి పోవడంలేదు. సగం నెరిసిన జుట్టుతో, ఉడిగీ ఉడగని బలంతో తెలివైన శాస్త్రిలాగే కనిపించే ఆ బుర్రమీసాల ఆసామీ మోసంలో ఎలా పడ్డాడా అని ఆశ్చర్యం వేసింది. పాపం. బాగా అమాయకు డయ్యుంటాడు.

'మనిషి ఏనుగులాఉంటే ఏం లాభం? చురుకైన బుర్రఉండాలిగాని. అయినా దొంగ జేబు కత్తిరించేటప్పుడు నిద్ర పోయాడా ఏవిటి?' ఈ రకమైన ఆలోచనల్తో కొద్దిగా విజయ గర్వం కలిందాయనకు, అతనికిలేని జాగ్రత్త తనలో నూటికి నూరుపాళ్ళు ఉన్నందుకు.

ప్లాట్‌ఫారం కోళ్ళ ఫారంలా గోలగాఉంది. స్టేషనంతా పోర్టర్ల పొలికేకలతో, చంటిపిల్లల ఏడ్పులతో, అమ్మేవాళ్ళ అరుపులతో, బిచ్చగాళ్ళ ఆక్రందనలతో తెలుగు సినిమాలోని బ్యాటిల్ ఫీల్డులా ఉంది. వచ్చే రైళ్ళు వస్తుంటే వచ్చిన రైళ్ళు పోతున్నాయి. టిక్కెట్లు ఉన్నవాళ్ళు దిగుతున్నారు. అవి లేనివాళ్ళు ఎక్కుతున్నారు.

స్టేషన్‌కి విడాకులిచ్చి రైలు బైలు దేరింది. కృష్ణవేణినిపలకరించి పచ్చటి పొలాల్లోకి దూసుకుపోయింది రైలు.

ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి, తలకాయని కిటికీలోంచి తీసు కున్నే ఆశ్చర్యపోయారాయన. తన కెదురుగా కూర్చున్నవ్యక్తి ఎవరోకాదు. ఆ డబ్బు పోయిన ఆసామీయే. పాపం. వాలిపోయిన పెరుగుతోటకూర కాడలా మొహం వేలాడేసుకూర్చున్నాడు. అవునుమరి ఒకటా? రెండా? ఐదొందలు. పరామర్శించి, ధైర్యం చెప్పకపోతే బావుండదేమోనని—

"మీ డబ్బు దొరకలేదుటండీ?"

"ఇంకెక్కడి డబ్బండీ? పోతే దొరకడంకూడానా?"

"పాపం. దురదృష్టం"

"ఇంకా నయం గిత్తలు కొనడానికి తెచ్చాను, ఐదొందలు. ఐదు వేలు తెచ్చాను కాదు ఇంజను కొనడానికి. అక్కడికి అదృష్టమండి" సుబ్బరామయ్యగారనుకున్నారు. ఈయ నేదో కాస్త గొప్ప కుటుంబీకులని. ఎలాగైనా ధనవంతుల డబ్బే యిలా దొంగల పాలవుతుంది.

"ఇందాక...కోపంలో మిమ్మల్నేవో అన్నాను....ఏవీ అనుకోకండి" అన్నాడాయన.

"అబ్బే దాన్దేంఉందండీ. డబ్బుపోతే ఎవరైనా అంతే ...అన్నట్టు మీరేవూరు వెళ్తున్నారు?" అని అడిగారు సుబ్బరామయ్యగారు.

"గూడూరండి"

"నేనూ అక్కడికే. ఒకరి కొకరు జత"

* * *

ఒకాయన ప్లాట్ ఫారంమీద పిచ్చి కుక్కలా తిరుగుతున్నాడు, ఇంకొకాయన "ఏవండీ మద్రాసు వెళ్ళే రైలెక్కడుందండీ?"

"వల్లకాట్లో"


"ఛ ఛ వల్లకాట్లో రైళ్ళెలా...."

"లేకపోతే ఏమిటయ్యా. నా డబ్బు పోయి నే నేడుస్తుంటే మధ్య నీ గోలేమిటి?"

ఇది బెజవాడ స్టేషన్‌లో జరిగిన సంఘటన కాదు. బిట్రగుంట ప్లాట్ ఫారంమీద జరిగిన సంభాషణ. ఇంతకీ ఆ డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి ఎవరో కాదు, సుబ్బరామయ్యగారు.

తరవాత కనుక్కోగా తెల్సింది. ఆ బొ్రమీసాలాయన రైల్వేలో పాతుకుపోయిన పెద్ద దొంగనీ, సుబ్బరామయ్యగారు అంతలావు నమ్మకస్తుడి మీద అనుమానమనేది పెట్టుకోకుండా బిట్రగుంట స్టేషన్‌లో చేతి సంచీ ఆయనకిచ్చి మరచెంబుతో మంచినీళ్ళు తెచ్చుకుందికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ఖాళీ సీటు పగలబడి నవ్వుతోందని.

***



అమరుడు

ఎక్కుపెట్టి వదలిన బాణంలా దూసుకు పోతున్నది బస్. అయితే ఒకటే తేడా. బాణం సూటిగా వెళ్తుంది. బస్ నైస్‌గా మలుపులు తిరుగుతూ వెళ్తుంది. ఈ భావం స్ఫురించగానే మెల్లిగా నవ్వుకుని తలపైకెత్తాను. చందమామగారు తారమ్మ అత్తగారితో ఫస్ట్‌షో కెళ్ళి మెల్లిగా పదకొండింటికి డ్యూటీ కొస్తున్నాడు. లేటుగాపని కొచ్చినందుకు ఆకాశం బాస్‌గారు తిట్టారు కాబోలు. మొహం కళావిహీనమై చిన్నదై పోయి వుంది.

ఏం చేయడానికీ తోచడం లేదు. మసక వెన్నెల్లో ప్రకృతి సౌందర్యాలో కనం చేయటానికి కష్టంగావుంది. ప్రక్కనున్న ప్రయాణికుని చేతిలోని 'విశాలాంధ్ర' అడిగి తీసుకుంటూ- ప్రక్కవారి పత్రిక చూసిస్తానని తీసుకునే విషయంపై 'బాపు గారు ఎప్పుడో ఎక్కడో వేసిన ఏదో కార్టూను గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకున్నాను.

కళా స్రవంతి, సినిమా పేజీల కోసం కళ్ళతో వెతుకుతూ పేజీలు తిరగేశాను. శ్రీ కాళోజీ గారు రాసిన గేయం కళ్ళబడింది.... చదివాను.

బాలగంగాధర తిలక్........కాళీ పూర్తి చేయలేక పిచ్చిగా రెండుమూడు సార్లు మళ్ళీ ఉచ్చరించుకున్నాను సంశయంగా.

"మల్లెపూవు" కన్పించింది. చదివాను.

ఇంకేముంది! సంశయం నిజమైంది.

తిలక్‌గారు లేరు అని విశాలాంధ్ర గట్టిగా అరచి నట్లనిపించింది నాకు.

మనసంతా ఏదోగా ఐపోయింది. ఆయనగారు రాసిన కథలూ, గేయాలూ వాటి గొప్పతనమూ గుర్తొచ్చేయి.

ఆ కలంనుండి ఇక అలాంటి గొప్ప కథలు రావు. వేరేవాళ్ళు గొప్ప కథలు రాయొచ్చు. కాని... ఏదోలోటు ఆయన కథలు కనబడక పోతే!

ఆప్తులెవరో పోయినట్లు ఫీలయ్యాను.

ఆయన అభిమానులంతా అలాగే ఫీలౌతారు కాబోలు. ఆహా రచయితలే ధన్యులు అనుకున్నాను. రచయిత గొప్పదనమూ, మా బోటి పాఠక లోకంలో వారికున్న విలువా అలా ఆలోచించుకుంటే ఈ పాటున జాయ్ పాతాళభైరవి నాదగ్గరుంటే, అమ్మా నన్నో గొప్పకవిని చెయ్! అనేవాణ్ణి.

అలా ఏదో ఆలోచించుకుంటున్న నేను డ్రైవర్ కోసిన ఓ టర్నింగుతో ఈ లోకంలో వున్న ఈ బస్‌లోని స్పాంజ్ సీట్లోకొచ్చి పడ్డాను.

ద్వితీయ బహుమతి రూ. 25

బి. జె. సంపత్‌రావ్
బి. కాం. రెండవ సంవత్సరం
ఎస్. వి. ఆర్ట్సు కాలేజీ
తిరుపతి, చిత్తూరుజిల్లా.

కొంపదీసి దేనికైనా డాష్ యిస్తాడేమో!

"మా అమ్మకు నేనే పెద్దాణ్ణి బాబాయ్! మెల్లిగా నడుపు!" అందామనుకున్నాను డ్రైవర్‌తో. పిచ్చాణ్ణనుకుంటాడేమోననుకుని, మానేసి. విశాలాంధ్ర తిరిగి యిచ్చేసి నా ప్రాణాన్ని డ్రైవర్ చేతిలో పెట్టి సీట్లో వెనక్కి జారగిల బడ్డాను.


మళ్ళీ ఏవో ఆలోచనలు. ఓడిపోయిన మనిషి సీతాపతికథ, దేవుణ్ణి చూసినవాడు, సుందరీ సుబ్బారావు, ఊరు చివర యిల్లు, కాస్మాపాలిటన్, కఠినోపనిషత్ మొదలైన పేర్లు జ్ఞాపకం వస్తున్నాయి అలవోకగా. అవన్నీ ఆయన రాసిన కథలూ, గేయాలూ.

"ధన్"

దగ్గర్లోనే పెద్ద చప్పుడు. తలమీద ఎవరో బలంగా మోదినట్లయింది. మెదడు బయటికి వచ్చేస్తున్నట్టయి, రెండు చేతుల్తో తల పట్టుకుని గాభరాగా కళ్ళు మూసుకున్నాను.

నా మొహంపై చినుకులు పడి చల్లగా తగలగా కళ్ళు తెరిచాను.

మీతో సర్దాగా ఓసంటు
మాట్లాడే అదృష్టం
ఎన్నాళ్ళకి కలిగింది సార్



ప్రశాంత గంభీర, సుందర వదనం. పెదాలపై చిరుదరహాసం. మల్లెల్లాంటి వలువలు ఆయన మృదువైన తొడమీద నా తల.

లేవ బోయేను.

"పడుకో! విశ్రాంతి తీసుకో!" అన్నారాయన.

ఆయన ఆదరణకూ, ఆప్యాయతకూ ఉబ్బిగ్గు పడ్డాను. అరనిముషమాగి వద్దం టున్నా లేచాను.

నమస్కరించి "మీరెవరండీ?" అన్నాను వినయంగా.

"ఏం? అంత అవసరమా?తిలక్!" అన్నారాయన.

ఆశ్చర్యపోయాను. ఏదో స్ఫురిం చింది.

"బాల గంగధర తిలక్ గారా? రచ యితలా? కరినోటనిషత్తు సీతా . ఉత్సాహంగా అడగబోయాను.

"ఎక్కువగా మాట్లాడకు! నేనే ఆయన్ని! తలపగిలివుంది నీకు. ఉద్రే కం తెచ్చుకోకు" అన్నా "యసవారిస్తూ.

హమ్మయ్య అనుకున్నాను. కాని పేపర్లో వార్తలు ? సందేహం!

"మాస్టారూ! మీరు చనిపోయా రని . "

"లేదబ్బాయ్! నే చనిపోలేదు. చని పోను. నీ ప్రక్కనే వుంటాగా! గాభరా పడక విశ్రాంతి తీసుకో!" అన్నారు మృదువుగా నవ్వుతూ.

కళ్ళుమూసుకుం ....

సడెన్ బ్రేకితూలిపడి, ముందున్న కమ్మికి కొట్టుకుని, కళ్ళు తెరచి నేను క్షేమంగా బస్‌లోనే వుండటంగమనించి, అదంతా కలా? అనుకున్నాను.

యాక్సిడెంటూ - అదీ – అంతా అబద్ధమా?

నమ్మబుద్ధి కాలేదు.

ప్రక్కకి చూశాను.

మల్లెల్లాంటి వలువల్లో నిండైన వ్యక్తి.

ఆశ్చర్యపోయి, ఆత్రుతగా . 'రచ యిత బాల గంగాధర తిలక్ గారు మీరేనా?' అన్నాను గబ గబా.

బలేవాడివయ్యా. ఆయనెక్కడ? నే నెక్కడ? ఆయనిటీవలే పోయారు. ఆయనమీద కాళోజీ, శ్రీశ్రీలు రాసిన గేయాలూ, ఆదివిష్ణు రాసిన స్మృతీ చూడు అన్నా డా వ్యక్తి నవ్వుతూ,విశా లాంధ్ర మళ్ళీ నా కిస్తూ.

మళ్ళీ తీసుకుని కళ్లకు నుకముకుని, అది చదివాను.

'లేదు-చనిపోలేదు. ఆయన అమ రుడు పాఠక హృదయాల్లో నిత్యమూ సజీవుడు' అనుకున్నాను ఏదో సత్యం తెలిసినట్లు.

సత్పాఠక హృదయాధి నేత కీ. శే. శ్రీ బాలగంగా ధర తిలక్ గారికి అంకితం.


***

ఆప్తమిత్రుడు

అద్దంలో ఆరోసారి తన అందాన్ని చూసుకొన్న సత్యం మరోసారి పైమ చూసుకొన్నాడు. తొమ్మిదిన్నరయింది. ఆరు నిమిషాలనుంచి కష్టపడితే ఇప్పటికి తన మేకప్ పూర్తయింది ఇప్పటికే అయిదు నిమిషాలు లేటు. లత కాలేజికి బయలుదేరే వేళయింది. తన స్నేహితుడు ఆనంద్ ఈపాటికి రెడీగానే లతా వాళ్ళ యింటిముందు వుండి వుంటాడు. తను తొందరగా పోయి ఆనంద్‌ని కల్సుకోవాలి. మరోసారి అద్దంలో చూసుకొని బయలుదేరాడు సత్యం.

నేడు రాజకీయాలో ఇద్దరు నాయకులు ఎంత కాలం కలిసివుంటారో చెప్పలేం. ని రోజు ఉదయం తొమ్మిదిన్నరకు సత్యం, ఆనంద్‌లు కలవటం మటుకు ఖాయం. వారిద్దరు కల్సుకునేది లత అనబడే ఒక కాలేజి అమ్మాయి యింటిముందు. అక్కడినుంచి తిన్నగా ఆ అమ్మాయిని కాలేజిదాకా దిగబెట్టటం వారి కలవాటు. ఆ ఇద్దరిలో ఎవరు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నారో చెప్పలేంగాని, ఆ అమ్మాయి మటుకు ఎవర్నీ ప్రేమించడంలేదు. వీళయినంతవరకు ద్వేషిస్తుంది. పెంపుడు కుక్కల్లాగా వెంటబడే వీళ్ళంటే ఆ అమ్మాయి కసహ్యం. లత యింట్లో తను పెంచే తెల్లని బొచ్చుకుక్కంటే ప్రేమకలదు కాని ఆ అమ్మాయి దృష్టిలో వీళ్ళు గజ్జికుక్కలు.

ప్రతీ రోజులాగానే ఆ రోజుకూడా ఆఅమ్మాయి కాలేజికి బయలుదేరింది. వీరూ బయలు దేరారు. మధ్యలో జోక్సు విసురుకొంటూ తమ విట్లకి తామే నవ్వుకొంటూ, ఆ అమ్మాయి కూడా నవ్వుతోందని తలపోస్తూ. అదే చూడరా ఆనంద్ ఆమె కట్టిన చీర. ఆహా రంగుల దోమతెర" సత్యం మాట పూర్తి కాకుండానే ఆనంద్ అందుకొన్నాడు. "ఆమె జరి విలువ రూపాయిబేడ. అంటే నవరం విలువ రూపాయి, పూలు బేడ. వెరసి రూపాయి బేడ." ఈ విధంగా సాగి



ద్వితీయ బహుమతి రూ. 25

యస్. వి. విజయ
సాంబశివరావు
బి. యస్. సి; బి. యి. 2/3
ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్
కళాశాల, వాల్తేరు.

పోయింది వారి వర్ణన. దీనివల్ల వారికీ లాభించిందేమోగాని లతకు మటుకు దుఃఖం తలనొప్పి రెండూ వొచ్చాయి.


రోజులు ఈ విధంగానే గడుస్తున్నాయి. సత్యం ఆనంద్‌ల కార్యక్రమంలో మార్పులేదు. ఒక రోజున సత్యం బాబాయి గారమ్మాయి రాధ పై చదువుల కోసమని ఆవూరొచ్చి సత్యం వాళ్ళింట్లో దిగింది. ఒకనాడు రాధ సినిమాకివెడుతూ సత్యాన్ని పిలిచినా తన కేవో పనులున్నాయని చెప్పి వెళ్ళి పోయాడు సత్యం.

ఆ రాత్రి ఇంటికి తిరిగొచ్చినసత్యం అప్పటికే తిరిగొచ్చిన రాధను చూచి ఆశ్చర్యపోయాడు. విచారంగాకూర్చొని వున్న రాధ దగ్గిరచేరి అసలు సంగతేమిటని లాలించి అడిగాడు. 'అన్నయ్యా ఈవాళ సినిమాకెళ్ళానా ? హాల్లో నా వెనకచేరిన అబ్బాయిలు కొంతమంది నన్నేడిపించారు. అందులో ముఖ్యంగా ఒకబ్బాయి ఇంటర్వెల్లో కావాలని నా కాలు తొక్కాడు' అనీ చెప్పి బావురుమంది రాధ. 'వెధవలు. తమ అక్కా చెల్లెళ్ళు అలాంటి వారనే బుద్ధుండదు గాడిదలకి ఆ సమయానికి. లేదు. నువ్వేం దిగులు పడకమ్మా ! రేపెప్పుడన్నా అతన్ని నాకు చూపు. మంచి గుణపాఠం నేర్పుతాను' అని సత్యం ఓదార్చాడు.


మర్నాడు ఆదివారం కాబట్టి సత్యం ఎనిమిదయినా నిద్ర లేవలేదు. ఇంతలోకే రాధ పరుగు పరుగున వొచ్చి సత్యాన్ని నిద్రలేపి, 'అన్నయ్యా నిన్న చెప్పానే అతను మనింటికే వస్తున్నాడు. త్వరగా రా అన్నయ్యా.'

'ఆ. ఏడీ వెధవ. రానీబుద్ధిచెప్తాను. అని పెద్ద హీరోలాగా బయటకు పరుగెత్తిన సత్యం అలానే స్థాణువులాగా నిల్చుండి పోయాడు. ఆ వొచ్చినవాడు, 'అడుగో అతనే' అని రాధ చూపిన వాడు ఆనంద్.

***







...న్నా చాలా పాతదనిన్నీ, అంచేత ఆ బెంగాలీ నిర్మాత తన కధను కాపీచేశారనే హక్కు వుండదనిన్నీ బోధించాడు___ ఆ నిర్మాతకు ఆప్తుడైన ఒక మిత్రుడు. తెలుగు కథ అయినా, బెంగాలీ సినీమా పోలికలు వున్నాయికదా అవి. నిర్మాత ఆకధను కొన్నాడు. డబ్బు ఎంతయిస్తేనేం? ఒక తెలుగువాడు, ఒక తెలుగు కధను ఒక ఒక తెలుగు నిర్మాతచేత, తెలుగు సినిమాకోసం, తెలుగుదేశంలో కొనిపించాడు. అంతకన్న తెలుగువాడు తెలుగువాడి కేం చెయ్యాలి? తెలుగు వాడికేం కావాలి?

చిత్రనిర్మాణం పూర్తయింది.

"ఆ పత్రిక్కి ఎడ్వర్ టైజ్ మెంట ఆపేసెయ్" అని శాసించాడు.

నిర్మాత అదృష్టమో, తెలుగు జాతి అదృష్టమో - లేక 'కావ్యశ్రీ' అదృష్టమో ఆ చిత్రం వందరోజులు ఆడింది! ఆడ్డం ఏంగొప్ప! ఆడిన అన్ని రోజుల్లోనూ, నిజంగా టిక్కెట్లు కొన్న వాళ్ళు, హాలునిండా నిజంగావుండేవారు.

నేడే శత దినోత్సవం!

తెలుగు కవికి తెలుగుదేశంలో అఖండ గౌరవం!!

తెలుగు కవికి తెలుగుదేశంలో తెలుగువారి అసమాన సన్మానం!!!

శతదినోత్సవంలో జిల్లా కలక్టర్లు



ఆయన రచనల్ని అడగని పత్రిక లేదు. ఇప్పుడు ఆయనకు పేరు వచ్చింది. సంసారం హెచ్చింది. మరో ముగ్గురు వచ్చిచేరారు. కానీ, ఆదాయం అంతంత మాత్రమే. పత్రికల పారితోషికాలు, ఆయన చెప్పే ట్యూషన్లు కలిసి, సంసారాన్ని గుట్టుగా నెట్టుకు వస్తున్నాయి.

ఈ సంవత్సరంలో ఆయన జీవితంలో చిన్న మలుపు వచ్చింది. మూడేళ్ళ క్రితం ప్రచురింపబడిన ఆయన కథకూ, గత సంవత్సరమే విడుదలైన ఒక బెంగాలీ చిత్రానికీ అన్నీ పోలికలేనట! ఆ చిత్రాన్ని అన్ని దక్షిణాది భాషల్లోనూ నిర్మించుకునే అన్ని హక్కుల్నీ కొనడానికి కలకత్తా వెళ్ళి, ఆ వంగ నిర్మాతతో బేరం కుదరక, తిరిగి వచ్చిన ఒక తెలుగు నిర్మాతతో, శ్రీ 'కావ్యశ్రీ' గారివద్ద సరిగ్గాఅదేకథ వుందనీ, ఈకథ ఆ సినిమాకన్నా చాలా పాతదనినీ, అంచేత ఆ బెంగాలీ నిర్మాత తన కథను కాపీచేశారనే హక్కు వుండదనినీ బోధించాడు—ఆ నిర్మాతకు ఆప్తుడైన ఒక మిత్రుడు. తెలుగు కథ అయినా, బెంగాలీ సినిమా పోలికలు వున్నాయికదా అని, నిర్మాత ఆకథను కొన్నాడు. డబ్బు ఎంత యిస్తేనేం? ఒక తెలుగువాడు, ఒక తెలుగు కథను ఒక ఒక తెలుగు నిర్మాతచేత, తెలుగు సినిమాకోసం, తెలుగుదేశంలో కొనిపించాడు. అంతకన్న తెలుగువాడు తెలుగువాడి కేం చెయ్యాలి? తెలుగు వాడికేం కావాలి?

చిత్రనిర్మాణం పూర్తయింది.

నేడె మ్యాటినీతో విడుదల!

జంట నగరాల్లోనూ, విజయవాడ-గుంటూరు పట్టణాల్లో ఉదయం ఆటతో.

బెంగాలీ సినిమా కథే కదా అని తెలుగు కథని, తెలుగు సినిమాగా తీస్తే, తెలుగు జనంకూడా బెంగాలీ కథే అనుకున్నారేమో. ఎగబడి చూస్తున్నారు, తెలిసో, తెలియకో "బాగుంది" అని అంటున్నారు. చాలా పత్రికలు చిత్రాన్ని మెచ్చుకున్నాయి. ఓ పత్రిక చిత్రాన్ని పొగుడుతూ, "బెంగాలీ కథ పోలికలు అక్కడక్కడచిత్రంలోకనుపించకుండా వుండకపోవు" అని రాసింది. దాంతో అపత్రికమీద నిర్మాతకు కోపంవచ్చింది, కాని, ఏం చేస్తాడు? ఆ మాటలూ నాలుగూ అచ్చై, నలుగురి కంటా పడిపోయాయి. మరో నలుగురి చెవుల్లోకి పాకిపోయాయికూడా. అంచేత "ఆ పత్రిక్కి ఎడ్వర్టైజ్‌మెంట్ ఆపేసెయ్" అని శాసించాడు.

నిర్మాత అదృష్టమో, తెలుగు జాతి అదృష్టమో - లేక 'కావ్యశ్రీ' అదృష్టమో ఆ చిత్రం వందరోజులు ఆడింది! అడ్డం ఏంగొప్ప! ఆడిన అన్ని రోజుల్లోనూ, నిజంగా టిక్కెట్లు కొన్నవాళ్ళు, హాలునిండా నిజంగావుండేవారు.

నేడే శత దినోత్సవం!

తెలుగు కవికి తెలుగుదేశంలో అఖండ గౌరవం!!

తెలుగు కవికి తెలుగుదేశంలో తెలుగువారి అసమాన సన్మానం!!!

శతదినోత్సవంలో జిల్లా కలక్టర్లు

తెలుగు చిత్రాన్ని ఇంగ్లీషులో పొగిడారు. మరికొందరు హిందీలోనూ మెచ్చుకున్నారు. మరికొన్ని చోట్ల మంత్రులుకూడా. వుపన్యసించారు. ఒకరు వుపన్యసిస్తూ, తాము చిత్రాన్ని అసలు చూడనే లేదనీ,తాము తప్పక చూస్తామనీ, తాము చూసే వరకూ చిత్రం తప్పక ఆడుతుందనీ, (సభలో కరతాళ ధ్వనులు!) ఇట్టి తెలుగు సినిమాలు, రచయితలూ తెలుగు దేశానికి కావాలనీ, రావాలనీ, వారంతా తెలుగుదేశం తరలివచ్చే శుభసమయం కోసం తెలుగుతల్లి ఎదురు చూస్తోందనీ అలాంటివారికి తమ ప్రభుత్వం సర్వ విధాలా సహకరిస్తుందనీ, అనీ ఇంకా-ఏమో వుపన్యసించబోతుండగా, ఎవరో ఓ చీటీ ఆయనకి అందచేశారు. అది చూసిన మంత్రిగారు—

"క్షమించాలె, వేరే కార్యాభారం వుంటంచేత. నేను నిష్క్రమిస్తున్నాను. ఇంతటి మంచి తెలుగు ఫిలిం సినిమాని చిత్రంగా తెలుగులోతీసి, తెలుగువాండ్లకు అర్పణచేసిన ఈ నిర్మాతగార్లకీ, అందున నటింపించి మన అందరికీ-క్షమించాలె - నాగ్గాదు - ఎందుగనంటే, నేనా సినీమా చిత్రాన్ని చూడలేదు (సభలో చప్పట్లు) మీ అందరికీ ఎంతో ఆనందాన్నీ, ఎంతోవినోదాన్నీ, ఎంతో వికాసాన్నీ, మరి ఎంతో ఎంటర్ టేన్ మెంట్ నీ అందజేసిన, ఈ ఫిలిం సినిమా నిర్మాతగార్లకీ నేను వందనాలు చెప్పుకుంటూ, నే వస్తాను."అని వెళ్ళిపోయారు. ఆయనతో పాటు ఆ టేబిల్ మీద వున్న పూలదండల రాసి కూడా వెళ్ళిపోయింది. అప్పుడే ఆవెనకవున్న 'కావ్యశ్రీ' జనానికి కనుపించారు.

'కావ్యశ్రీ మాట్లాడాలి.'

'వారిని ముందుకు రమ్మనండి!'

'వారు కావ్యపఠనం చెయ్యాలి!'

'కనీసం ఒక్క-గేయమైనా పాడాలి!'

అంటూ జనంలో కేకలు.

ఓ పెద్దమనిషి వేదిక మీదకు వచ్చి, మైకులో మూతి పెట్టి, గొంతు సవరించుకున్నాడు. రెండు సార్లు మైకు ముందు చిటికెలు వేశాడు. ఎడమచేత్తో మైకు స్టాండు పట్టుకుని, కుడిచెయ్యి పైకి ఎత్తి —

"అధ్యక్షా! సోదర సోదరీమణులారా! ఈ కార్యక్రమం, ఈ వంద రోజుల యిది, అదే యిది, ఈ శత దినోత్సవం - అంతా ఒక నిర్ణయ కార్యక్రమం - దానిప్రకారమే అంతా జరుగుతుంది. ఇప్పుడే మన మంత్రిగారు వెళ్ళిపోయారు. ఆ తర్వాత, నటీనటుల ఉపన్యాసం వుంటుంది. ఆ తర్వాత సాంకేతిక బృంద సమాధానం వుంది. అంచేత మీరంతా, సమాధానంగా - కాదు,కాదు - సావధానంగా వుండి, ఈ సభను దిగ్విజయం చెయ్యాలి." అంటూ వుపన్యసించబోతూంటే—

"నువ్వెనక్కెళ్ళు-ఆయన్ని మాట్లాడమను," అని అరిచారు.



గత్యంతరంలేక 'కావ్యశ్రీ' మైకు ముందుకు వచ్చారు.

"మహాశయులారా! నాపైన మీరు చూపుతున్న అభిమానానికి నా కృతజ్ఞత. నేను మాట్లాడవలసింది. మాట్లాడింది అంతా ఈ చిత్రంలోనే చూచారు. అంతకన్న నేనేమీ మాట్లాడలేను. మీ ఆదరాభిమానాలతో, ఈ విజయంతో నేను మీకు సేవచెయ్యగలనని నమ్ముతున్నాను. సెలవ్."

సభలో కరతాళధ్వనులు.

సభ దిగ్విజయంగానే ముగిసింది. పోలీసులు లాఠీ చార్జీలు చెయ్యలేదు. ఎందుకంటే మంత్రిగారితోనే వెళ్ళిపోయారు పోలీసులు'

ఆరాత్రే అంతా బయల్దేరారు. బృందం అంతా కలిసి 28. అందరికీ రిజర్వేషన్స్ దొరికాయి. అందర్నీ తలో పెట్టెలోనూ సర్దారు. ఆడుకున్నంతసేపూ 'రమ్మీ' ఆడుకుని లైట్స్ ఆఫ్‌చేసి నిద్రలు పోయారు. మెయిల్ పోతూనేవుంది.

ఉన్నట్టుండి పెద్ద చప్పుడు. అప్పర్ బెర్త్‌మీద పడుకున్న స్టంట్ మేస్టారు లోయర్ బెర్త్‌మీద నిద్రపోతున్న డ్యాన్స్ మేస్టారిమీద పడ్డారు.

"అయ్యో! చచ్చాన్!" అన్నారు డ్యాన్స్ మేష్టారు. పైనుంచి తనమీద పడ్డ శరీరం స్టంటు మేస్టారిదని గ్రహించి "ఏమిటండి? ఇక్కడకూడా

మీస్తుంట్సు?" అని కోపముద్ర పట్టబోతుంటే, కిటికీలోంచి నీళ్ళు లోపలకు వస్తున్నాయ్,

"అయ్యబాబోయ్! నీళ్ళే! ఏమండీ! ఇదంతా వర్షమే!" అని డ్యాన్స్ మేస్టారు ఆశ్చర్యపోతుంటే, స్టంట్ మేస్టారు—

"కాదండి - రైలు ఏట్లో పడింది!"

"ఏమిటయ్యా! ఆ మాటలు? తథాస్తు దేవతలు 'తథాస్తు' అంటారు."

"మీకేం పర్వాలేదు. నా లంగోటీ పట్టుకోండి. ఒడ్డుకు లాక్కుపోతాను."

"ఏదో నాయనా! నన్ను రక్షించు. రేపు నాకు రోజారాణీ షూటింగుంది కూడాను. ఇన్నేళ్ళకి ఆవిడ కనికరించింది. నా జన్మ తరించింది."

* * *

"తెలుగు చిత్రపరిశ్రమ పునర్జన్మ!"

"ఏటిలోపడ్డ మెయిల్ నుంచి బతికి బయటపడిన అగ్రశ్రేణి తారలు, సాంకేతికవర్గం"

"చిత్ర రచయిత 'కావ్యశ్రీ' అదృశ్యం, మరణించి వుంటారని అపోహ! మృతదేహం కోసం ఎనమండుగురు జాలర్ల పయనం"

"ప్రయాణీకులకు స్థానిక ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు"

అంటూ ఆ వార్త మర్నాడు ఉదయం పత్రికల్లో వచ్చేసింది.

ఇతర ప్రయాణీకులతోపాటు, నిర్మాతలు, సాంకేతిక వర్గమూ, తారాగణమూ అంతా కోలుకుంటున్నారు. స్థానిక సినీమా అభిమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శులూ, మాజీ ఎం. ఎల్. ఏ. మ్యునిసిపల్ చెయిర్మన్ వగైరా అంతావచ్చి అందర్నీ పరామర్శిస్తున్నారు.

"అంతా చరణదాసి సినీమాలోలాగ జరిగిపోయింది" అని అంతా ఆశ్చర్యపోయారు. ఒక్క 'కావ్యశ్రీ' గారు మాత్రం కనబడ్డం లేదంటే మరీ ఆశ్చర్యపోయారు. "ఆయనెవరో - తెలుగు మేస్టారో ఏమో—"రవిగాంచనిచో కవిగాంచును" అని చెప్పేసేసి చీకటైనా కవిగారు తోవ తెల్సుకుని ఒడ్డుకు చేరుకునే వుంటారు. ఆ వెధవ ఏరు ఎప్పుడూ యింతేనండీ—నిన్న రాత్రి అంత పొంగిపోయిందా ఇప్పుడు వెధవది ఒక్కచుక్కలేదు. క॥గారికేం భయం లేదు. నేను చెప్తున్నాను చూడండి."

"ఇదేమన్నా సినీమా కథటయ్యా. ఆయనమాత్రం బతకడానికి?" అని హేళనగా చూశాడు మాజీ ఎం.ఎల్.ఏ.

"సినీమాకథ కాకపోయినా, సినీమా కథకుని కథ - ఏమంటారు?" అని అందరివైపు నవ్వరేం! అన్నట్టు చూశాడాయన.

కాని ఎవ్వరూ నవ్వలేదు.

* * *

"కీ. శే. కావ్యశ్రీ గారి కుటుంబ సహాయనిధి. లక్షరూపాయలు వసూలు కాగల అవకాశం. ఏభై వేల వరకూ వాగ్దానాలు. పదవరోజున సంతాపసభ"

అన్నవార్త పత్రికలో చూచి గబగబా ఆ పత్రికతో లోపలకు పరుగెత్తి—

"బావా! ఈ పేపరు చూశావా!" అని ఆనాటి దినపత్రికను కావ్యశ్రీకి చూపించారు తల్లావఝుల సుబ్రహ్మణ్యం గారు.

"బావా! పేరు మార్చుకుని మమ్మల్ని డబాయించా అనుకున్నావు. కాని, అదేం కుదరదు. మొన్న ఈ ప్రమాదం గురించి విన్నప్పుడే నువ్వు అనుకున్నాను. కాని, నువ్వు కాదంటే కాబోలని వూరుకున్నాను. ఏమైనా నువ్వు అదృష్టవంతుడివి.- నువ్వుకాదు- మా చెల్లెలూ దాని పిల్లలూను. ఇండియాలో ఒక్క పిక్చర్‌తో ఇంత మొత్తంగడించిన రచయిత లేడేమో!... తాటాకు మంటలాగ ఈ ఏరు పొంగుతుందేగాని, ప్రాణాలు తియ్యదు. ఎన్ని సార్లు చూడలేదూ? ఆ రైలు పడింతర్వాత, ఆ వరద వుధృతం తగ్గడం, నువ్వు మెల్లిగా ఒడ్డు చేరడం, మాఇంటికి రావడం ఇదంతా ఆ భగవత్కృప! బావా! రేపే నేను మదరాస్ వెళ్తాను. చెల్లెమ్మనీ పిల్లల్నీ తీసుకు వచ్చేస్తాను. ఆ డబ్బుతో యిక్కడ పొలం కొనుక్కుని, బమ్మెరపోతనలా వ్యవసాయం చేసుకుంటూ, కవిత్వం రాసుకుందువుగాని—"

"బావా! నువ్వుపేపర్లో చదివినంతా జరుగుతుందనుకుంటున్నావు. అదంత సులువుగాదు. ఇదంతా శ్మశాన వైరాగ్యం లాంటిది. నాకో పాతిక చేబదులియ్. మదరాస్ వెళ్ళగానే, మని ఆర్డరు చేస్తాను."

"ఏమిటోనయ్యా, మొదట్నుంచీ నీదంతా అదో తరహా - ఆమేస్టరీకూడా ఇలాగే వదులుకున్నావ్ - ఇప్పుడూ యింతే — పాతిక రూపాయలకేం? ఎంత కావల్సినా యిస్తాను నీకిస్తే ఎక్కడికి పోతుంది? నువ్వు కాబోయే లక్షాధికారివి."

"సర్లే ఇయ్యి-"

* * *

"అమ్మా! ప్రొడ్యూసర్ గారు వచ్చారే!" అని కావ్యశ్రీ గారి పెద్దమ్మాయి తల్లితో చెప్పింది ఆమె ఒక్కసారి కెవ్వుమని ఏడ్చింది.

నిర్మాత వీధి గదిలోనే వుండిపోయి "ఆ ఫొటోవు ఏది?— ఆ మేకు తగిలించు. దండ పట్టుకు రమ్మన్నాను, ఆ మేనేజరేడి?.. మర్చిపోయాడా!.. పోన్లే... ఆరే తగిలించుకుంటారు... అమ్మా! పెద్దమ్మాయీ! ఇయిగోనమ్మ! మొన్న నేపట్టుకెళ్ళిన పుస్తకాలు - అయన్నీ ఏదో చూశాం అంతే! ఆ కదలేం తీసుకోలేదు" అని పుస్తకాల కట్ట తిరిగి యిచ్చేశాడు.

"ఈవేళ డబ్బు యిస్తానన్నారు కదండీ!"

"అదే బ్యాంకికి ఎల్లలేదు, రేపు పంపుతా-ఆ మేనేజరేడీ! నే వస్తాను" అని వెళ్ళిపోయాడు,

"మేనేజరేడి! మేనేజరేడి అంటా వేంటయ్యా. అణ్ని వుద్యోగంలోంచి తీసేశాంగా!" అని నిర్మాత బావమరదీ జ్ఞాపకం చేసి "పోసీ, డబ్బుకావాలంటే నాదగ్గరుంది. ఆరికియ్యి." అన్నాడు.

"ఆ మాత్రం డబ్బు నా దగ్గరా వుంది. నాకు తెలవకనా, నే నివ్వంది. అదంతా ట్రేడు సీక్రెటు- రా నా ఎన కాల."

అరాత్రి 'కావ్యశ్రీ' ఇల్లు చేరుకున్నారు. హాల్లో ఆయన ఫొటోకి పూలమాల! కింద రెండు దీపాలు!! ఆయనకే కళ్ళనీళ్ళు తిరిగాయి. తండ్రిని చూసిన పెద్దమ్మాయి, 'నాన్నా!' అని కౌగలించుకుంది. గబగబ లోపలకు వెళ్ళింది. 'అమ్మా! నాన్న వచ్చారు' అని తల్లితో చెప్పింది. ఆనందం, ఆశ్చర్యం ఒకదాన్ని మించి ఒకటి ముంచెత్తాయి తల్లిని. అడుగు కదలడం లేదు. ఏమీ తోచడం లేదు. 'కావ్యశ్రీ' ఆమె దగ్గరకు వచ్చారు. ఆమె ఒక్కసారిగా ఆయన పాదాలమీద పడింది. 'ఏమండీ!' అని కెవ్వుమంది. పాదాలను కళ్ళకద్దుకుంది. ఆమె కన్నీటితో అవి తడిసిపోయినై. ఆమెను ఓదారుస్తూ ఆమెను పైకి లేవనెత్తారు 'కావ్యశ్రీ.'

★ ★ ★

"ఏమండీ! ఏమండీ!" అని లోపలకు పరుగున వెళ్ళింది. కుంకుమ భరిణె, పసుపుతాడు తెచ్చి, అతని చేతిలో పెట్టింది.

ఆమె నుదుట కుంకుమ పెట్టారు, తాళి గట్టారు. విధివైపరీత్యం! తన భార్యను తానే పునర్వివాహం చేసుకున్నారు! ధనుర్మాసం—దేవుడిగుళ్ళో సన్నాయి వినబడుతోంది. వారి పెళ్ళికి అవే మంగళధ్వనులేమో! మొదటి రాత్రికన్న ఆమె ఎక్కువ ఆనందాన్ని పొందింది.

మర్నాడు పొద్దున్నే—

"ఎవరే రాత్రి మీ యింటికి చుట్టా

లొచ్చారు ?" అని కావ్యశ్రీగారి పెద్ద అమ్మాయిని అడిగింది పక్కవాటాలో వెధవాడ బిడుచు.

"మా నాన్న" అంది కిరికి ఆడు కుంటూ తలైనా ఎత్తకుండా.

"మీ నాన్న ! ఏమిటే నువ్వనేది?" మళ్ళీ రెట్టించి అడిగింది.

"ఏం మా నాన్న రాకూడదా ?"

"రాకూడదని ఎవరన్నారే తల్లీ - ఘోరకలి అలా మండి పోతూంది— మానా దెరగమమ్మా —" అంటూ కిటికీ లోంచి లోపలకు తొంగి చూసింది.

లోపల ఏదో పని చేసుకుంటున్న కావ్యశ్రీగారి శ్రీమతి నుదుటనున్న బొట్టు కనిపించింది. ఆ బొట్టు పెద్దదై, పెద్దదై తన నుదుటమీదకు వస్తున్నట్టు అనిపించింది. ఆమె భయపడిందో ఏమో, 'హా ! శ్రీహరీ !' అని నీళ్ళ బిందెతో సహా కింద పడిపోయింది.

* * *

నేడే సంతాప సభ.

వేదికకు వెనకాల తెల్లటి తెర వేలాడుతోంది. దానిపైన కావ్యశ్రీగారి ఫోటో తగిలించబడివుంది. సంతాప సూచకంగా నల్లటి గుడ్డ ఆ ఫొటోకు చుట్టూరా వుంది. ఆ ఫొటోకు పూల మాల వేయబడి వుంది. ఫొటోకు దిగువన రెండు దీపాలు వెలుగుతున్నాయి. దిగువన ఒక బెంచీ వుంది. దానిమీద కొన్ని పుష్ప గుచ్ఛాలున్నాయి. ఒక వాలంటీరు నిలబడి వున్నాడు. అతని పక్కన ఒక గంపలో పుష్పగుచ్ఛా లున్నాయి.

ఆహూతులందరూ వరుసగా వచ్చి ఫొటోకు నమస్కరించి వెళ్తున్నారు. కొందరు వాలంటీరు యిస్తున్న పుష్ప గుచ్ఛాలు ఆ బెంచీమీద వుంచుతున్నారు. కొందరు కన్నీరు కారుస్తున్నారు. వారిని చూసిన కొందరు కళ్ళు తుడుచు కుంటున్నారు. మరి కొందరు తమలో 'పాపం !' అనుకుంటున్నారు.

ఇంతలో ఓ పెద్ద మనిషి వేదిక మీదవున్న మైకులో—"అయ్యా సభ ప్రారంభించడానికి, ఇంకా వ్యవధి వుంది. అంచేత ఆహూతులందరూ, ఉపాహార విందు సేవించమని మనవి" అని చెప్పాడు.

"హమ్మయ్య ! బతికించాడు. ఆ మంత్రిగారు వచ్చేవరకూ, ఊరికే కూచోమనకుండా, టిఫిన్లు తినమంటు న్నాడు !" అన్నాడు సభలో పెద్దమనిషి.

"అసలు మంత్రిగారు వస్తున్నారా?" అని సందేహించింది ఓ లావు దేహం.

"అదేం అలా అంటున్నారు ?"

"అబ్బే ! ఏం లేదు. కవిగారి మీటింగు— అందులోనూ చచ్చిం తర్వాత—"

"వస్తారెండి. ఆయనకు తిరపతి ప్రోగ్రాం కూడా వుందిట!"

"అయితే, తప్పకుండా వస్తారు."

మరో మూల మరో గుంపు—

"బాదం హల్వా బాగుంది గాని - జీడిపప్పు పకోడీయేనండి. మరీ మెత్త పడి పోయింది."

"పకోడీకేం లెండి! ఫ్రూట్ సాలడ్ బావుంది కదండీ ?"

అని యెవరి యిష్టం వచ్చిన విష యం మీద వారు యిష్టంవచ్చినట్టు మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో ఒక ప్రకటన వినబడింది.

"మహాశయులారా! ఈనాటి ఈ సంతాపసభకి విచ్చేసిన మీరందరూ ఉపాహారవిందు ముగించి వుంటారని మా నమ్మకం. దయచేసి మీమీస్థానాల్లో కూర్చో ప్రార్థన. త్వరలోనే సంతాప సభ ప్రారంభం కానున్నదని తెలియ చేయడానికి సంతోషిస్తున్నాం."

వెనువెంటనే, "తెలియని ఆనందం కలిగెను నాలో ఈ హృదయం" అని పాట మొదలైంది.

★ ★ ★

సభ అంతా కిటకిట లాడుతోంది. అందరికన్నా వెనకాల వచ్చిన అతి ముఖ్యులకు అందరికన్న ముందుగా కుర్చీలు వేస్తున్నారు. దుస్తులు నలగ కుండా ఒయ్యారంగా కూచుని, తమ పక్కనున్న వారిని చిరునవ్వుతో పలక రిస్తున్నారు.

చిత్రనిర్మాత కార్యదర్శి వేదిక మీదకు వచ్చి మైకు ముందు నిలబడి,

"మహాశయులారా! మా ఆహ్వా నాన్ని మన్నించి, ఈ సంతాప సభకు విచ్చేసిన మీ అందరికీ మా స్వాగతం. ఇంతమంది ఈ సభకు రావడం మాకు చాలా ఆనందంగా వుంది. సభను ప్రారంభించ వలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను."

మంత్రిగారు లేచారు. వరసగా దండలు పడ్డాయి. గొంతుక సవరించు కుని, వేదికమీద, వేదిక కిందా అంద రినీ పరికించి వుపక్రమించారు "ఇప్ప టికే చాలా ఆలస్యమై పోయింది, దండలుతీసి ఖండువాతీసి మీ కాలాన్ని వృథాపుచ్చను. అసలు సభల్లోపాల్గొనే చాలామంది - చాలా మందేమిటి ?— నేనుకూడా - సభలో పాల్గొనడానికి గర్వపడుతున్నాను, ఆనందపడు తున్నాను అని అంటారు. కాని, నేను మాత్రం చాలా విచారపడుతున్నాను. సరిగ్గా నేటికి పదిరోజులక్రితం శత దినోత్సవంలో పాల్గొన్న నేను అదే సమస్త జరుపుతూండిన ఈ సంతాప సభలో పాల్గొనడం కాకతాళీయంకాదు, నేను తిరుపతి వెళ్తున్నమాట నిజమే, కాని, ఈమీటింగులో పాల్గొనాలని నేను వూహించలేదు. ఆ శతదినోత్సవంలో వారిని నేను స్వయంగా చూశాను. హార్దికంగా మాట్లాడాను. వారింకా పది కాలాలపాటు వుంటారనీ, పది పది హేను కథలు రాస్తారనీ అనుకున్నాను. కాని సరిగ్గా, పది రోజులైనా కాక ముందే ఈ సంతాపసభ జరపాలనీ ఏ ఒక్కరూ వూహించలేదు. అదే విధి! అదే ఫేట్! నేను అంత్యోపన్యాసం కూడా యిప్పుడే చేసివెళ్ళి పోతాను. ఎందుకంటే లోగడ నుడివినట్లు నాకు తిరుపతి వెళ్ళవలసిన కార్యాభారం వుంది. 'కావ్యశ్రీ'గారు కథ రాసి మరణించారు. వారి కథ ఫిలిం సినిమా గా తీసిన చిత్ర నిర్మాతలు వారి కుటుం బానికి సహాయనిధి ఏర్పాటు చేయడం

ఎంతైనా ముదావహం. అంతటి విశాల హృదయం గలవారు విశాలాంధ్రలో చాలా అరుదు. అందుచేత నేను వారిని మనస్ఫూర్తిగాను, హార్దికంగాను అభివాదిస్తున్నాను. వారియొక్క ఈ మహత్తర ప్రయత్నాన్ని, ఈ ఎగ్నాన్ని దిగ్విజయంచేసి, తెలుగువారి పేరు ప్రతిష్టల్ని నిలపవలసిందిగా తెలుగు వారిని కోరుతున్నాను."

ఇంతలో కార్యదర్శి ఒక జాబితాను తీసుకొచ్చి, మంత్రిగారికి అందించాడు. మంత్రిగారు ఆ జాబితాను తీసుకుని తన పక్కనున్న నిర్మాతకు యిస్తూ, "నేను కార్యాభారంచేత వెళ్ళిపోతున్నాను. నేను అంత్యోపన్యాసం కూడా యిచ్చేశాను. మిగతా కార్యక్రమాన్ని నిర్వహించమని నిర్మాతగారిని కోరుతూ నేవెళ్ళిపోతాను" అని వేదికదిగి వెళ్ళిపోయారు.

ఆ జాబితాను తీసుకుని నిర్మాత చదువుతూ "మహాశయులారా! తారీఖువారీగా అందిన మొత్తాలలో ఈ జాబితా తయారైంది. తక్కువ మొత్తం యిచ్చిన వారి పేర్లు ముందు, ఎక్కువ మొత్తం యిచ్చినవారి పేర్లు వెనకా వుండవచ్చు. అంచేత ఎక్కువ మొత్తం యిచ్చినవారు తమ పేర్లు ఆఖరున చదువుతున్నామని ఆగ్రహించ వద్దని ప్రార్థన."

ఇంతలో అధ్యక్షులు అడ్డుతగిలి, "పేర్లన్నీ చదవాలంటే, చాలా కాలహరణం. అంచేత —"

"కాదు, పేర్లు చదవాలి, చదవాలి." అని కేకలు.

అధ్యక్షులు లేచి, "మహాశయులారా! ఈ సభలో హాజరైన వారిలో కొందరు మాత్రమే విరాళాలు యిచ్చారు. కార్యకర్తలు ఆ జాబితాను మీ వద్దకు తీసుకు వస్తారు. మీకు తోచిన విరాళాలు మీరు రాసియివ్వండి. సభ చివరిలో పేర్లు చదువుదాం. ఈ లోగా నిర్మాతగారు తమ కార్యక్రమం గురించి మాట్లాడతారు"

నిర్మాతగారు లేచి, "సభకు నమస్కారం. తెలుగు కథని, తెలుగువాని వద్ద కొన్న గనత మాకు దక్కడం, మేము తెలుగు వారమై వుండడం, మాకు చాలా గర్వ కారణంగా వుంది. తొలి చిత్రంతోనే 'సెంచరీ' కొట్టిన గనత కావ్యశ్రీగారికి దక్కింది ఆరి కథ యింత ఇజయమై, మాకిన్ని లాబాలు వంచి పెట్టినందుకు ఆరిఫేమలీ అలాగ అనాదాల్లాగా వుంటం మేం చూల్లేం - అంచేత ఈ పిచ్చర్ మీద 'సెకండ్ రన్ను' మీద ఒచ్చే డబ్బంతా ఆరికే- అదే ఆరి కుటుంబానికి ఇస్తాం"

నిర్మాత తాలూకు జనం చప్పట్లు ప్రారంభించారు. వారివెనకాల మిగతా జనంకూడా కొట్టారు.

ఓమూల గుసగుసలు. "డిస్ట్రిబ్యూటర్స్ యింకేం ఆడతారండీ-వాళ్ళడబ్బు కాస్తా వచ్చేసిం తర్వాత?"

"నూర్రోజుల్లోనూ పీల్చి పిప్పిచేసి వసూలుచేస్తే, ఇంకేం వస్తుంది డబ్బు?"

"అందని పువ్వులు దేవుడికి అర్పించాట్ట!"

వేదికమీద వున్న నిర్మాత "నా తరువాత కావ్యశ్రీ గారికి బాగా తెలిసిన స్నేహితులున్నారు. ఆరుమాట్టాడతారు"


"నేను,కావ్యశ్రీగారు ఇరుగుపొరుగు గ్రామస్తులం. వారి వూరికీ మా వూరికీ ఓ పడవల కాలవమాత్రమే అడ్డు. మా చిన్నతనమంతా కల్సి గడిపాం. వారు మాయింటికి రావడం, నేను వారింటికి పోవడం జరుగుతూ వుండేది. మా మార్గాలు వేరైనాయి. నేను ప్రొడక్షన్‌లో పడి దర్శకుడ నయ్యాను. ఆ తర్వాత వారూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. చిన్నప్పుడు మే మిద్దరం వియ్యమండ అని అనుకునేవారం. ఆ వాగ్దానాన్ని నేను నెరవేరుస్తాను. మా అమ్మాయిని వారి అబ్బాయికి యిస్తాను."

సభలో చప్పట్లు.

"నాపేరు పూరిశెట్టి పెదవీరవెంకట సత్యనారాయణ బాలాజీ వరప్రసాద రావు. మా తొలి చిత్రానికి కథను రాసివ్వమని "కావ్యశ్రీ" గారికి అడ్వాన్సు యిచ్చాను. ఆ అడ్వాన్సును వారి కుటుంబానికి సహాయనిధిగా జమకట్ట మని కమిటీవారిని కోరుతున్నాను. వారు మాకు కథ యివ్వకుండానే కాలం చేశారు. అయినా, వారి కుటుంబం కష్ట పడడానికి వీల్లేదు. అందుకే మా అడ్వాన్సును వారికే యిచ్చేస్తున్నాము."

సభలో చప్పట్లు.

"నేను మా నిస్వార్ధ ప్రచురణల తరపున వారి అముద్రిత గ్రంథాలన్నింటినీ, ప్రచురించ దలిచాను. ఆ విషయమై వారితో మాట్లాడానుకూడా. వారు అంగీకరించారు. అడ్వాన్సుగా వారికి నూటొక్క–రూపాయి యిచ్చాను. 'అడ్వాన్సు అన్నతర్వాత ఎంతయినా అడ్వాన్సే' అని నూర్రూపాయలూ



తిరిగి యిచ్చారు. అలాంటి నిస్వార్థజీవి గ్రంథాలు ప్రచురించి మా నిస్వార్థ ప్రచురణలు సార్థకం కావాలి. అందుకు మేమెంతో గర్వపడుతున్నాం".

సభలో చప్పట్లు -

"నేను 'కావ్యశ్రీ' గారిని చాలా కాలంగా ఎరుగుదును. మా పరిచయం ఈనాటిదికాదు. వారితో నేను స్నేహం ప్రారంభించి అచిరకాలం అయింది. మా స్నేహం అపారమైంది. అసలు వారి అసలుపేరు మీలో చాలామందికి తెలియదు. అసలు 'కావ్యశ్రీ' అని వారికి సూచించింది నేనే. అసలు వారి కథను కొనమని నిర్మాతకు సూచించింది నేనే. వారితో,వారికుటుంబంతో, నాకు అవినాభావ సంబంధం వుంది. 'కావ్యశ్రీ'గారు లేని నా బతుకు " అని భోరున ఏడ్వడం మొదలెట్టి, మాట్లాడ్డం మానేశాడు.

"మీరింకా మాట్లాడతారా ?" అని అధ్యక్షులు అడిగారు.

మాట్లాడాలని వున్నా, నోట మాట రావడం లేదని సైగచేశాడు.

ఇంతలో ఎవరో యిద్దరు వచ్చి, ఆయన్ను బయటకు తీసుకెళ్ళి, ఫేన్ దగ్గర కూచో బెట్టి సోడా యిచ్చారు.

ఒట్టి సోడాయేనా? అన్నట్టు మొహం అదోలాపెట్టి తాగుతున్నాడు.

అధ్యక్షులు లేచి, "వీరు మాట్లాడుతూంటే, మన హృదయం కరిగిపోయింది. "కావ్యశ్రీ" గారి జీవితం అంతటి మహత్తరమైనది. వారితో పరిచయంవున్న ప్రతి ఒక్కరూ వారిని మరువలేరు" అని చేతిరుమాలుతో కళ్లు తుడుచుకుంటున్నాడు.

"అధ్యక్షా! ఏమిటీ ఏడ్పులు! ఏమిటీ వుపన్యాసాలు! అని సభలో ఓమూల

నించి కేక వినబడింది. అంతా అటు తిరిగారు. ఓ పెద్దమనిషి వేదిక మీదకు నడిచి వస్తున్నాడు. అంతా ఆయన్ని తేరి పార చూశారు. వేదిక ఎక్కాడు.

"అధ్యక్షా ! నాకు మాట్లాడేందుకు అనుమతి కావాలి."

"మాట్లాడండి. మీరు ?"

"కావ్యశ్రీ"

"కావ్యశ్రీ జూనియరా ?"

"కాదు. కావ్యశ్రీయే-"

"హా !"

"హా !"

"హె హె . హేమిటీ !"

"ఏం కంగారు పడకండి. మీరంతా చచ్చిపోయాడనుకున్న 'కావ్యశ్రీ'ని నేనే. కాని చావలేదు.

"అయితే, మనం చచ్చాం." అనుకున్నారు సభలో కొందరు.

"అసంభవం !" అని ఎవరో అరిచారు.

"ఏది అ స ం భ వ ం ? నేను బతకడమా ? దయచేసి సావధానంగా వినండి. ఆరోజు నేను ఏట్లోపడి. కొట్టుకు పోయాను. కొంత దూరం పోయేసరికి వరద తగ్గిపోయింది. కాలికి నేల తగిలింది. అప్పుడు నడిచివెళ్ళి అగ్రహారం చేరాను. మా బావమరిది గారి యింట్లో వున్నాను."

"ఉండి యిప్పుడు డబ్బు పట్టుకెళ్ళ డానికి వచ్చావా ?" అని ఎవరో అరిచారు.

"అధ్యక్షా! ఇతనెవరో మన మీద కక్షసాధించడానికి పంపబడిన శత్రు పక్షపు మనిషి. ఇతన్ని విడవకూడదు."

"నన్ను విడవవద్దు. అధ్యక్షా! కాని. నేను చెప్పేది దయచేసి వినండి."

"ఏం వినక్కర్లేదు. మేం ఒక బృహత్కార్యం ప్రారంభిస్తే. మధ్య నీ అడ్డేమిటి ?" అంటూ మీదకు రాబోయాడు కార్యదర్శి.

"ఈ బృహత్కార్యానికి ఎవరి అనుమతి తీసుకున్నారు ?" అని రెట్టించారు 'కావ్యశ్రీ'

"మంచి కార్యానికి ఒకరి అనుమతి ఏమిటి ?"

"ఏమిటండీ ! మంచికార్యం ? బతికుండగా, చచ్చిపోతున్నామన్నా, వచ్చి మంచినీళ్ళు పొయ్యవు మీరు. చచ్చిన తర్వాత పంచభక్ష్య పరమాన్నాలూ పెడతామంటారు అంతేనా ?"

"అసలు ఎవరివోయ్ నువ్వు ?"

"'కా వ్య శ్రీ' అని ము ం దే చెప్పానుగా !"

"చెప్పావుసరే-అసలు నువ్వెవరవు? నిన్నెవరు పంపారు ?"

"అదేమిటండీ ! మీరంతా నన్ను బాగా ఎరుగుదుమని వుపన్యాసాలు దంచారుకదా యిప్పటివరకూ-! ఇప్పుడిలా నిర్ఘాంత పోతారేం ?" అని ఒక వుపన్యాసకుడి దగ్గరకు వెళ్ళి, "మహాశయా ! మనిద్దరం బాల్యస్నేహితులం అన్నారు కదండీ ! అ యి తే, మా స్వగ్రామం ఏవూరో చె ప్ప ం డి చూదాం-"

'అవన్నీ యిప్పుడేం జ్ఞాపకం ?" అని మొహం అటు తిప్పేశాడు

ఏమండీ ! పబ్లిషర్ గారూ! వెన కటి పుస్తకాల తాలూకు డబ్బు ఎన్ని సార్లడిగినా యివ్వరేం ? మీకు నా అముద్రిత గ్రంథాల ప్రచురణ హక్కు యిచ్చానా ? మీకు ఒక్కసారి పుస్తకం యిస్తే మళ్ళీ మీ ముఖం చూడగలరా ఎవరైనా ?"

"మాది నిస్వార్థ ప్రచురణలు అది మర్చిపోతున్నారు

"అవును స్వార్థంలేని వారి పుస్త కాలే ప్రచురిస్తారు అని పేద్చిసోడా తాగిన పెద్దమనిషి దగ్గరకు వచ్చారు "కావ్యశ్రీ' ఆయన్ని ఎగాదిగా బాగా చూశారు

పీరెవ్వరో మహా నటులుగా రాణి రాణిస్తారు, ఏడుపు పాత్రలు బాగా పోషిస్తారు ఏమండీ ! నన్ను గుర్తు పట్టారా ? మాట్లాడరేం ?"

ఎమిటోయ్ ! మాట్లాడేది మేం యింతటి ఘనకార్యం చేస్తుంటే, ఓర్వ లేక మా వ్యతిరేకులు దుష్ప్రచారం చేయడానికి "కావ్యశ్రీ గారి పోలిక వున్న నిన్ను పంపారు అయినా ప్రయత్నం ఆగదు అదీ జగన్నాధ రధం ! సాగిపోతుంది అడ్డువచ్చిన వాళ్ళు నలిగి

ఆపండి మీ జగన్నాధ రధాన్ని నన్మ ‹ ంబాన్నీ రచ్చకీడ్చే ఈసభ జరపడానికి మీకు అనుమతి ఎవరిచ్చారు ?'

అనుమతేమిటోయ్ ? ఇది మా ధర్మం సంఘంలో ఓ మహత్తర వ్యక్తి అకాల మరణం పొందితే వారి కుటుంబం అతి నిరాధారమైపోయి, రోడ్డుపాలు అవుతూంటే, చూస్తూ వూరుకుంటామా ?"

ఇదంతా మీకు నామీద వున్న జాలా ? లేక మీ కీర్తి కాంక్ష ? చెప్పండి

సభ అంతా నిశ్శబ్దం

మాట్లాడరేం? ఎమండీ ! నిర్మాత గారూ ! మీరు మా యింటికొచ్చి డబ్బు యిస్తానని ఎందుకివ్వలేదు ?

ఎలాగూ యిక్కడ యిస్తున్నాం గదా అవి_

ఇంట్లో యిస్తే అది ఎవ్వరికీ తెలియదు మీ ధర్మానికి పబ్లిసిటీ వుండదు అంతేనా ?'

"అయితే ఇదంతా మేం పబ్లిసిటీ కోసం చేస్తున్నామా ? ఇందులో పర మార్థం లేదంటారా ?"

"లేదు ఈషన్మాత్రంకూడా లేదు

ఎందుకు లేదూ? అధ్యక్షా ! అతని బయటికి లాగించి సభను సాగ నివ్వండి ఈ ఒక్కమనిషి అడ్డువచ్చి

నంతమాత్రాన ఇందరం తలపెట్టిన ఈ మహాయజ్ఞం ఆగరాదు

లాగండి ఆయన్ని బయటకు లాగండి" అని సభలో కేకలు

స్టంటు మేస్టారూ ఆయన అను చరులూ వేదిక మీదకు దూకారు కావ్యశ్రీగారి రెక్కపుచ్చుకు బయటకు లాగారు ఆయన రానంటే ఆయన డొక్కలో పొడిచారు ఆ దెబ్బకి కావ్యశ్రీ పడిపోయారు అప్పుడు ఆయన్ని అంతా తలో పోటూ పొడి చారు

ఆయనకి మొహం మీద నీళ్ళు చల్లండి అన్నా రెవరో ఓ మహాత్ముడు

ఏమీ అక్కర్లేదు సభకానివ్వండి

అధ్యక్షులు లేచి జాబితాను పుచ్చుకుని మంచి పనులకి మంచి మనుషులకి యిలాంటి అడ్డు తగులుతూనే వుంటుంది అలాగని మంచి వారు మంచి పని చేయకుండా వూరుకోరు ఇంతవరకూ రు 98 723-00 తో జాబితా తయారైంది నేను మాత్రం 1,277-00 నా విరాళంగావేసి లక్ష పూర్తిచేస్తున్నాను

"ఆపండి - మీలక్షమీరూను - బతి అంటూ ఒక స్త్రీ కంఠం ఏడుస్తూ వినబడింది

"అమ్మా! ఎవరమ్మా మీరు! ఆయనకూ మీకూ ఏమిటి సంబంధం ?"

వారు మా వారే!

నిజమా ?

ఆమె నోట మాట రాక అవునన్నట్టు తలవూపి కింద పడిపోయింది.

హా!

నిజమే ! ఎంత ఘోరం బాపై పోయింది ?


అనవసరంగా తొందరపడి చెయ్యి చేసుకున్నారు

నిష్కారణంగా లక్ష వృధా చేశారు "

"లక్ష పోవడం ఏమిటండీ ! కీ శే. 'కావ్యశ్రీ'గారి కుటుంబానికి సహాయం చేయాలను కున్నాం చేశాం మన కోరిక నెరవేరింది భగవంతుడు మనయందే వున్నాడు !

కార్యదర్శి వేదిక మీదకు వచ్చి—

"మహాశయులారా ! కీ శే కావ్యశ్రీ గారి కుటుంబ సహాయనిధికి వాగ్దానాలు చేసిన పెద్దలు త్వరలోనే విరాళాలు యిచ్చి మా మహాయజ్ఞాన్ని విజయవంతం చేయ వలసిందని ।సాగర



కుందేలు, వేటకుక్క

కుందేలు సరదాగా ఈలపాట పాడుకుంటూ పోతోంది. ఇంతలో దూరంనుంచి భౌభౌ అని అరుపు వినబడింది. పాటఆపేసి కుందేలు పరుగెత్తసాగింది.

వెనకనుంచి వేటకుక్క తరుముకువస్తోంది. పెద్దపెద్ద అంగలతో సమీపిస్తోంది. కుందేలు ప్రాణభయంతో ఇంకా వేగంగా పరుగెత్తింది. కాని కొంతసేపటిలో వేటకుక్క దాన్ని పట్టేసుకుంది.

అది కుందేలును క్రింద పడేసిందిగాని, చంపలేదు. దానితో ఆడుకోడం మొదలెట్టింది. కుందేలు గజగజ వణికి పోతోంది. ఇలా అయిదు నిమిషాలు గడిచాయి. కుందేలు ఇక ఓర్వలేక అంది: "అయ్యా! తమరు నాకు స్నేహితులైతే ఎందుకలా కరుస్తారు? పోనీ శత్రువులైతే ఎందుకలా మధ్య మధ్య ముద్దెట్టుకుంటారు?"

ఇదే కొందరితో చిక్కు. వారిని స్నేహితులని నమ్మాలో, శత్రువులని నమ్మకూడదో తెలియదు పిల్లి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటమంటూ ఇందుకే

మారిన జీవితం

కొడవటిగంటి కుటుంబరావు

(గత సంచిక తరువాయి)

"నువు చెప్పబోయే విషయం కొంత వరకు నాకు తెలుసనే అనుకుంటాను. అయినా చెప్పదలచుకున్న దేమిటో నువు చెప్పు" అన్నాను.

"నన్ను పదిహేడోఏట దత్తుచేసుకున్నారు. నేను బస్తీలో పెరిగినవాణ్ణి. ఆస్తికోసం మావాళ్ళు నన్ను పరమ పల్లెటూరిచ్చారు. ఇవ్వటమనేది తప్పు మాట కాదనుకుంటా. నన్ను పెంచుకున్న వాళ్ళకు ఆరుగు రాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు పుట్టారుగాని దక్కలేదు. ఒక పిల్లవాడు పుట్టిన నెలకు పోయాడు. రెండోవాడు పుట్టిన గంటలోనే పోయాడు. ఆ దంపతులకు పుట్టే మగపిల్లలు దక్కక పోవటానికి శాస్త్రీయమైన కారణాలుంటాయనుకోండి, కాని మావాళ్లు రెండు శతాబ్దాలు వెనక ఉండటంచేత, వాళ్ళకు క్రిందటి జన్మలో చేసిన పాపం ఏదోకట్టి కుడుపుతున్నదని నమ్మకం ఉండేది. వాళ్ళ మూఢత్వం ఆధారంగా మాబంధువొకాయన నన్ను వాళ్ళకు దత్తు ఇప్పించాడు" అన్నాడు కోటీశ్వర్రావు.

"అదెట్లా?" అన్నాను.

"కిందటి జన్మలో వాళ్ళు ఒకపేద దంపతుల కున్న ఒక్క కొడుకునూ విషంపెట్టి చంపారనీ, అందుచేతనే ఈ జన్మలో వాళ్ళకుమగపిల్లలు దక్కటం లేదనీ, వాళ్ళు చంపిన పిల్లవాణ్ణి ఈ జన్మలో నేనే ననీ ఒక దైవజ్ఞుడి చేత యుక్తిగా చెప్పించి, వాళ్ళను నమ్మించాడు."

"వాళ్ళు అంత తేలిగ్గా నమ్మారా?"

"మా వాళ్ళసంగతి మీకు తెలీదు... నేను పెంపుడొచ్చేనాటికి నాకొక పెళ్లాం రెడీగాఉంది. దానికప్పుడు ఏడేళ్ళో, ఎనిమిదేళ్ళో ఉంటాయి. మరి రెండేళ్లాగి దాన్ని నాకు పెళ్ళిచేశారు."

"బాల్య వివాహమే?"

"ఖచ్చితంగా. పెద్దమనిషి అయిన మూడు నెల్లకు గర్భాధానం చేసేశారు. ఆ తరవాత ఏడాదికల్లా అదిపోయింది. బాబుగారూ, పోయిన భార్యనుగురించి చెబితే మీరు నమ్మలేరు. నరరూప పశువు, చదువూ సంధ్యా లేదు. ప్రపంచ జ్ఞానం లేదు. పెంపుడు రావటమంచే అటువంటి పెళ్ళాన్ని కట్టుకొనటమని నేను కలలోకూడా అనుకోలేదు. అనరాదుగాని, అది చచ్చిపోతే నాకు విమోచనం అయినట్టు అనిపించింది. బ్రహ్మచారిగా బతకటమైనా సుఖమే

అనిపించింది. కాని నా విడుదల తాత్కాలికమే అయింది. పోయిన నా భార్యకొక చెల్లెలు ఎదిగి వస్తున్నది. దానికిప్పుడు ఏడేళ్ళుంటాయి. దాన్ని నాకిచ్చే విషయం ఆలోచనలు ప్రారంభమయాయి. నాకు దడ పుట్టుకొచ్చింది. నన్ను ఈ నరకంలో దింపిన బంధువు బదికే ఉన్నాడు. చక్రం అడ్డెయ్యమని ఆయన కాళ్ళు పట్టుకున్నాను. ఆయన మరొక జ్యోతిష్కుణ్ణి పంపకం చేశాడు. ఆ జ్యోతిష్కుడొక చక్రంవేసి, అది నా చక్రమనీ, అందులో కుజదోషం బలంగా ఉన్నదనీ, ఎంత మందిని చేసుకున్నా చచ్చిపోతారనీ మా వాళ్ళకు చెప్పాడు. మా అత్తవారు తారెత్తిపోయి నా మరదలును నా కివ్వమనేశారు. మావాళ్ళకేం చెయ్యాలో తెలియలేదు. అప్పుడు నేనొక దొంగవేషం వేశాను. నాడీ గ్రంథంలో నా జాతకం చూపించుకుని అందులో నాకు రాసిపెట్టి ఉన్న భార్య పేరు తెలుసుకుని, సంబంధం మాట్లాడతానన్నాను. నాడీ గ్రంథం అద్భుతాలను గురించి వాళ్ళకు నేను విన్నవీ, విననివీకూడా చెప్పాను. వాళ్ళు సరేనన్నారు. అప్పటికే నాకు లీల సంగతి తెలిసిఉంది. నేను బయలుదేరి వచ్చి మామగారితో మాట్లాడాను. ఇంటికివెళ్ళి మా వాళ్ళతో నాడీ గ్రంథంలో అంతా వచ్చేసిందనీ, అందులోనూ అసలు తల్లిదండ్రుల పేర్లూ, పెంచుకున్నవాళ్ళ పేర్లూ, పోయిన నా భార్యపేరూ, కాబోయే నా భార్యపేరు కూడా వచ్చిందని చెప్పాను. లీల అనే పేరుగల పెళ్ళిగాని పిల్లకోసం పత్రికల్లో ప్రకటన వేశానని కూడా చెప్పాను. మామగారు నాకు రాసిన ఉత్తరాలు ఆ ప్రకటనలకు వచ్చిన జవాబులని బొంకాను. పెళ్ళికి వచ్చేటప్పుడు మా వాళ్ళతో, నేను చూడవలసిన పిల్లలు ముగ్గురున్నారనీ, వాళ్ళు వేరు వేరు ఊళ్ళలో ఉన్నారనీ, వాళ్ళను చూసి, వాళ్ళలో కుజదోషం ఎవతెకున్నదో జాతకాలు చూపించి, అటువంటి సంబంధమే కుదుర్చుకొస్తాననీ, ఇదంతా రెండు మూడు వారాలు పట్టవచ్చుననీ చెప్పి వచ్చేశాను. అప్పుడే మా పెళ్ళి అయిందనుకోండి. నేను తిరిగి వెళ్ళి మా వాళ్ళతో సంబంధం కుదిరిందని చెప్పానుగాని పెళ్ళి అయిందని చెప్పలేదు. పిల్ల దిక్కులేనిదనీ ఎవరో పెంచుతున్నారనీ అన్నాను. ఎందుకు చెప్పానో మీపేరు చెప్పాను. అందుచేత ఇప్పుడు మా వెంట తీసుకుపోతే మిమ్మల్ని తీసుకుపోవాలి. అత్తగారేమో వస్తామంటున్నారు...."

అతను మాట్లాడటం మానేశాక చాలాసేపు నేనేమీ అనలేదు. అతని కథ నాకు చాలా జుగుప్సాకరంగా తోచింది. రేచుక్క, పగటి చుక్కల కథలోకూడా ఏదో ఒక ఉదాత్తమైన అంశం ఉంది. కోటీశ్వర్రావు కథలో మచ్చుకైనా అది లేదు. అతని మీద తీర్పు చెప్పటం నా ఉద్దేశం కాదు. అతనికన్న జుగుప్సా

పెద్ద కథ

కరమైన వ్యక్తులు రాజకీయ రంగంలో ఉన్నారని నాకు తెలుసు.

"జరిగిన సంగతి మీకు దాపకుండా చెప్పేశాను. లీల దిక్కులేని మనిషని మా వాళ్ళతో చెప్పమని మామగా రన్నప్పుడు నాకు వచ్చే భయం వేసింది— మీ కంటికి నా నాటకమంతా తెలిసి పోయిందేమోనని. లీలతో అంతా చెప్పాను. నా విషయాలేవీ మీకు తెలియదన్నది లీల. నే నాడిన నాటకాన్ని గురించి తను అర్థం చేసుకున్నది. మీవంటి పెద్దలుకూడా అర్థం చేసుకుంటే నాకు ఇంకొంచెం తృప్తిగా ఉంటుంది." అన్నాడు కోటీశ్వరరావు.

"లీల ఏమర్థం చేసుకున్నదో నాకు తెలీదు. నన్నడిగితే దానికింకా ఆవగింజలో అరభాగం కూడా అర్థం కాలేదంటాను. నామాటంటావా? నేను మొదటి నుంచీ అర్థం చేసుకుంటూనే ఉన్నాను, అంతో యింతో. అర్థం చేసుకోవటమంటే ఆమోదించటం కాదు" అన్నాను.

నాకు మటుకు అతనిమీద చాలా కోపంగా ఉంది. ఆ కోపాన్ని అణచి పెట్టుకుని మాట్లాడాను.

"అంటే మీరు నన్ను క్షమించరే దన్నమాట" అన్నాడతను.

"నీ జీవితాన్ని చక్కదిద్దుకునేటందుకు నువ్వేం చేసుకున్నా నా కొకటే. నువుచేసిన పనుల మంచి ఫలితాలన్నీ నీకు దక్కాయి. మీవాళ్ళ కళ్ళలో దుమ్ముకొట్టి, నీకక్కర్లేని పెళ్ళి తప్పించుకున్నావు. కావలసిన పిల్లను చేసుకున్నావు, నువుచేసిన పనికి అనుభవించబోతున్నమనిషి లీల. ఆ అనుభవం ఇంకా ఆరంభం కాలేదు. ముందుగానే నువు క్షమాపణ కోరడంలో అర్థంలేదు. క్షమిస్తే నిన్ను లీలే క్షమించాలి. తాను ఊబిలో దిగబడ్డానని తెలుసుకున్నాక అది క్షమిస్తుందను కోను....చాలా పొద్దుపోయినట్టుంది. వస్తా. ఇక నువు తిరిగిపో. గుడ్ నైట్" అని నేనింటికి వెళ్ళిపోయాను.

6

ఎవరూ తోడులేకుండానే లీల తన భర్తవెంట అత్తవారూరు వెళ్ళాక దాదాపు నెల రోజులకు నాకో ఉత్తరం వచ్చింది. ఆ రోజే లీల వాళ్ళ అమ్మ కూడా రాసిందిట. రెండు ఉత్తరాల లోనూ అత్తవారింటి వివరాలు ఇంచుమించు సమంగానే రాసింది. నాకు తన భర్త విషయం హెచ్చు వివరాలు రాసింది. రెండు ఉత్తరాలలోనూ కలిపి చెప్పుకోదగిన విశేషాలేవంటే—

కానూరు అగ్రహారం పరమ "చచ్చు" పల్లెటూరు. రైలుమీదా, బస్సుమీదా. కాలినడకనా (లేక రెండెడ్ల బండిలో) వెళితేగాని ఆ ఊరు రాదు.

ఊరి కంతకీ లీల అత్తవారిదే ఘరానా కుటుంబం. ఆ కుటుంబానికి హిట్లరులాంటిది లీల అత్తగారు కామేశ్వరమ్మ. ఆవిడకు చదువురాదు. కాని బంధుబలగాన్ని అవసరం వచ్చినప్పుడు దాదుకుంటూ, అందర్నీ తన గుప్పిట్లో ఉంచుకున్నది. ఆవిడ వాసను ఎండ

అంటే, వాళ్ళూ అనేస్తారు. ఆవిడ పెద్ద వ్యవహర్తగా ఊళ్ళో కొందరి దగ్గర చలామణీ అవుతున్నది. ఊళ్ళో ఆవిడకు "శత్రువర్గం" లేకపోలేదు. కాని వాళ్ళింకా ఆవిడపైన చెప్పుకోదగిన "విజయం" సాధించినట్టు కనబడదు.

ఆవిడ కూతుళ్ళలో ముగ్గురు వితంతువులు. అందులో ఒకావిడకి ఇద్దరు పిల్లలున్నారు. మిగిలిన ఇద్దరికీ పిల్లలు లేరు. పైపెచ్చు బాలవితంతువులు. అందరూ తల్లిని ప్రతిధ్వనిస్తారు.

ఈ ఆడ ముఖాలు ఒక్కరికూడా చదువురాదు. ప్రపంచ జ్ఞానం లేదు. వాళ్ళ ప్రపంచం గురించి వాళ్ళకు మంచి జ్ఞానమే ఉన్నదిగాని, అది బొత్తిగా చిన్న ప్రపంచం .... (నేనెప్పుడో అన్నానుట, కంకర రోడ్డు పడితే చాలు, పూర్తిగా మారిపోయే గ్రామాలు దేశంలో ఉన్నాయని. ఈ కానూరు అలాంటిదేననీ, ఆ తరవాత తమ అత్తగారూ, ఆడబిడ్డలూ ఎండిన చెరువులో చేపల్లాగా అయిపోతారనీ లీల నాకు రాసింది.)

లీల భర్త కోటీశ్వర్రావు సాలీడు గూట్లో చిక్కిన ఈగలాగా ఉన్నాట్ట. అందరాడవాళ్ళూ అతన్ని భయపెడతారుట. అతను తన ఇష్ట ప్రకారం ఏం చెయ్యదలచినా వాళ్ళను విధిగా మోసం చెయ్యవలిసిందేట!

లీలను చూస్తూనే అత్తవారింటి వాళ్ళంతా "ఎబ్బె! పిల్ల తల్లల్లే ఉంది!" అన్నారుట. "నీకిదే మొదటి పెళ్ళా?" అని బాలవితంతువాడబిడ్డ అడిగిందిట లీలని.

లీల "రెండో" పెళ్ళి గుళ్ళోపెళ్ళిలాగా జరిగిందిట. లీల అత్తగారు "ఇదేం పెళ్ళి? నా బొందపెళ్ళి!" అని వెయ్యిసార్లు అన్నదిట. ఒక్క ముచ్చటా లేదన్నదిట.

పెళ్ళయిననాడే గర్భాధానం కూడా ఏర్పాటు చేశారుట. ఆ రోజు ఆడవాళ్ళ ప్రవర్తనా, సంభాషణా పరమ అసహ్యంగా ఉన్నట్టు లీల తల్లికి రాసింది.

పెళ్ళి అయిన మర్నాడే ఆడవాళ్ళు "నీకు నెల ఎప్పుడు?" అని అడిగి చెప్పినదాకా వదిలిపెట్టలేదుట. లీలకు తారీకులు తెలుసుగాని తిథులు తెలీవు. వాళ్ళకు తిథులు తప్ప తారీకులు తెలీవు. చివరకు కోటేశ్వర్రావు సహాయంతో వాళ్ళు శుద్ధ పాడ్యమి ప్రాంతాల లీల బయట ఉంటుందని తేల్చారుట.

తన ఆడబిడ్డలు చాపా, చెంబూ తీసుకుని ఎడంగా కూర్చోవటం చూడగానే లీలకు కంపరం ఎత్తుకొచ్చిందట — తానుకూడా అలాగే కూర్చోవాలని. మొగుణ్ణడిగితే, "ముట్టు మైల ఇంట్లో కలపటమే? చంపెయ్యరూ?" అన్నాట్ట.

బయట కూర్చోవటంతో పోతే బాగుండిపోనేమో, పేడతో తిన్నచోట అలకటమూ, ముట్టు శుద్ధికి ఆవు పంచితం కలిపిన నీళ్ళతో స్నానం చెయ్యటమూ అన్నీ రెగ్యులేషన్లో ఉన్నట్టు తెలిసి లీల బేజారైపోయింది.

తనవాళ్ళు వింటుండగా కోటేశ్వ:

శ్రీరావు పెళ్ళాన్ని పేరుపెట్టి పిలవటానికి లేదు తప్పనిసరిగా అయితేనే మాట్లాడాలి అదైనా ఏ గోడకో చెప్పినట్టు చెప్పాలి రాత్రి అందరూ పడుకుని, ఇల్లుబాగా మాటుమణిగే దాకా లీలపడక గదిలో మొగుడు దగ్గిరికి పోరాదు. అందుకు వీలుగా ఉండేటట్టు ఇంటి చాకిరిలో ఆఖరు పనులు లీలకు చెబుతారుట

మొత్తంమీద సంసార సుఖం చాలా పరిమితంగా ఉండాలిట ఆ ఇంట్లో పండగలూ పర్వాలూ ఏకాదశీ అమావాస్యలూ వర్జ్య దినాలు!

లీలకు ఆ మనుషులూ వాళ్ళ తిండీ, వాళ్ళ మాటల ధోరణీ వాళ్ళ నిత్యకృత్యాలూ, బట్టలూ సహవాసమూ పరమ హీనంగా కనబడ్డాయి ఆ భావాన్ని ఎంత దాచుకుందామన్నా దాగ లేదు లాగుంది. అత్తగారు, "ఏం మరీ నాజూకులు పోతున్నావు? దిక్కూ మొక్కూ లేని నీకే ఇంత గీర్వాణం ఉంటే మాకెంతఉండాలి?" అన్నదిట.

మొదట లీలకు అత్తగారినిచూసీ, ఆడబిడ్డలను చూసీ భయపడాలని కూడా తట్టలేదుట. వాళ్ళేదన్నా అంటే, ఇటువంటి మనుషులు కూడా ప్రపంచంలో ఉంటారా అన్నట్టు ఆశ్చర్యంగా చూసేదిట. కాని త్వరలోనే అది వాళ్ళంటే భయపడటం నేర్చుకున్నదిట.

లీలకు కోటీశ్వరరావు ఒక పాత్ర

నిర్దేశించాడు. దాన్ని అభినయించటానికి లీల ఏపాటి శ్రమ తీసుకున్నదీ చెప్పటం కష్టం, కాని అడుగడుగునా తప్పటడుగు వేసినమాట నిజం. లీల పుట్టింటినుంచి తెచ్చుకున్న చీరెల దగ్గిరే కష్టాలారంభమయాయి.

“అబ్బో, ఏం నాజూకు చీరెలు. మానాడు మేం కూడా ఎరగమే!” అన్నది ఒక వితంతు వాడబడుచు.

“భోగంవాళ్ళు కట్టుకునే చీరలే!... ఇదేందబ్బా?....పౌడరా?....ఏం చేస్తారీ పౌడరూ?.... మొహానికి పూసుకుంటారా? నాటకాల్లో వాళ్ళల్లేనా?.. నువ్వు మొహానికీ పౌడరు పూసుకుంటావా? ఛీ! ఛీ!” అన్నది బాల వితంతువు.

లీలకు వాళ్ళు ఒక్కొక్క పనే నేర్పారు. పేడతో లంకంత ఇల్లు అలకటమూ, వెన్న తియ్యటమూ, పాలు తియ్యటమూ, గొడ్లకు మేత వెయ్యటమూ, పాలేగాళ్ళ పనులు చెప్పటమూ. అన్నీ వాళ్ళుచేసే పనులే. లీల చెయ్యనని ఎట్లా అంటుందీ? అందుకు మడి గట్టుకుని వంట చెయ్యటం కూడా నేర్పారు.

మొదట్లో లీల తీరిక చూసుకుని పుస్తకాలు - తనతో తెచ్చుకున్నవి___ చదవాలని ప్రయత్నించింది. ముక్కు గోక్కుంటే కోతులకెంత రోషమో పుస్తకం చేతపట్టుకున్న ఆడదాన్ని చూస్తే లీల అత్తవారింటి వాళ్ళకంత రోషం. లీల పుస్తకాలను అత్తగారు పొయిలో పెట్టేసింది.

“ఎలెక్ట్రిక్ దీపం చూసి ఒక యుగమైనట్టుంది. ఇప్పటికీ కూడా చీకటి పడుతున్నదంటే చెప్పరాని గుబులు పుట్టుకొస్తుంది, లంకంత ఇల్లు, కిరసనాయిలు బుడ్డి దీపాల వెలుతురులో భయం భయంగా ఉంటుంది.... నిన్న నట్టింట ఇంత పెద్ద మండ్రగబ్బను చంపారు నేను వచ్చేముందరే వాములకాడ్లో తాచుపామును చంపారుట. నేను మసక వెలుతురులో అక్కడికి పోయి రోజూ పాలు పితకాలి,” అని నాకు రాసింది

అంధకారంలో ఆశారేఖలాగా లీలకు భర్త ఒకడు కనిపించాట్ట. అతను ఆమె కష్టాలన్నిటినీ అర్థంచేసుకున్నాట్ట. మిగిలిన జంతువుల మధ్య లీలకు తను ఒక చిన్న దేవుడల్లే కనబడితే కనబడ్డాడేమో. కాని తనను ఆ నరకంలో ప్రవేశపెట్టినది ఆ దేవుడేనని గ్రహించిననాడు లీలకు అతను ఎలా కనిపిస్తాడో అని నేనాశ్చర్యపడ్డాను.

తరవాత లీల వాళ్ళమ్మకు మరొక ఉత్తరం రాసింది.

“ఈ జీవితం ఎలా గడపటం?

ఎంతకాలం? ఏదో పీడకలలాగా ఇది కొంత కాలానికి అయిపోతుందన్నట్టుగా ఇన్నాళ్ళు ఉన్నాను. ఇది ఎప్పటికీ తీరేదని అకస్మాత్తుగా తెలిసి చెప్పరాని భయం కలిగింది.... పెళ్ళయి మూడు నెల్లయినా ఇంకా కడుపూ గడ్డలూ లేదుట. నన్ను గొడ్డుమోతునంటున్నారు! వీళ్ళు మనుషులు కాదు. పశువులు— అంతకన్న కూడా హీనం. 'అయ్యో, పాపం' అన్నమాటలు వీళ్ళ నోట నేనింతవరకు వినలేదు. నేను తిండికి మొహంవాచి, దిక్కులేని దాన్నిగా పెరిగాననీ, వీళ్ళ ఇంటి తిండి వంట బట్టి నాకు పొగరెక్కుతున్నదనీ అంటున్నారు. నేను మన ఇంట ఎట్లా పెరిగానో తెలిస్తే వీళ్ళేమంటారో! నాకు ఎప్పుడు కల వచ్చినా మన ఇంట్లో ఉన్నట్టే వస్తుంది. ఆకలితో నిజంగానూ, మేలుకుని ఉన్నప్పుడు చూసేదంతా కల అనీ అనిపిస్తుంది. మన ఇల్లు కలలో వచ్చినప్పుడు, నేనెంత పిచ్చిదాన్ని? నా జీవితం మారిందని ఎందుకు దిగులు పడుతున్నాను. ఏమీ మారలేదు. ఎప్పటిలాగే ఉంది_ అనుకుంటాను ఏ మహాపాపంచేసి నేనీ నరకం అనుభవిస్తున్నానో తెలీకుండా ఉంది.... ఈవిషయాలన్నీ నాన్నకు చెప్పి ఆయనను బాధించకు...."

కాని కూతురి ఉత్తరాలను ప్రకాశం ... వాడు

అంచేత ముందు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి. జరిగినది ఎలా జరిగింది? దానికెవరు బాధ్యులు? అది తేల్చుకునేదాకా ఏం చెయ్యాలో తెలదు" అన్నాను.

"అతి తెలివిగా మాట్లాడకు," అన్నాడు ప్రకాశం.

"ఇందులో అతి తెలివేమీలేదు. ఆడదై పుట్టినందుకు లీల అనుభవిస్తున్నదనుకునే పక్షంలో లీలను మగవాడుగా మార్చటం మినహాగా పరిష్కారం లేదు. నువ్వూ, నేనూ అలా అంటామని కాదు — మాటవరసకు చెప్పాను. మనం ఆడవాళ్ళనుద్ధరించే వాళ్ళం కనక, ఆడజన్మ ఎత్తిన కారణంచేత అగచాట్లు పడుతున్నదంటే ఒప్పుకోలేం. అందుచేత లీల కష్టాలకు మరో కారణం ఏదో ఉండాలి."

"నువ్వు ఈ పూట మరీ పైత్యాన పడి ఉన్నావు" అంటూ ప్రకాశం లేచి వెళ్ళిపోయాడు. వాడు ఆరోజే అల్లుడికి రాంబాణంలాంటి ఉత్తరం ఒకటి రాసి పడేశాడు. దాని తాత్పర్యమేమంటే: "లీల మీ యింట కుక్కకన్న అన్యాయమైన బతుకు బతుకున్నదిట. దాన్ని మనిషిలాగా బతకనివ్వలేని పక్షంలో తీసుకువచ్చి ఇక్కడ దిగవిడు."

ఈ ఉత్తరానికి కో...

ఇంట్లో ఉంచుకోవటానికేనా పెళ్ళి చేశారు? ఆ ఉత్తరం చూసి ఆయన చాలా బాధపడ్డారు. కావలిస్తే నన్ను పుట్టింట ఇష్టంవచ్చినంత కాలం ఉండమని, తనవాళ్ళతో ఏదో ఒక బొంకు బొంకుతాననీ అన్నారు. నేను పుట్టింటికి వెళ్ళాలని ఉన్నదని ఒప్పుకోలేదు. మనిషి అన్నాక చాలా కోరికలు తల్లో పుడతాయి. వాటన్నిటినీ చేసేస్తామా? నాకు పట్నంలో వచ్చి వాలాలని ఉన్నదనే అనుకున్నా. మొగుడికి విడాకులిచ్చేసి లేచి వచ్చెయ్యగలనా?." ఈ ధోరణిలో రాసింది లీల.

తెమలని సమస్యలలో సతమతమయ్యే మన స్త్రీత్వం ప్రకాశంలోఏ కోశానా లేదు. వాడు లీల ఉత్తరం చూసి, "దానికి లేని దుగ్ధ నాకా? అదేదో కష్టపడిపోతున్నదంటే చాతనయినంతలో సుఖపెడదామని ఆ ఉత్తరం రాశాను. లేకపోతే సంసారం తెంచేసుకుని దాన్ని ఎందుకు రమ్మంటానూ?" అన్నాడు.

"అన్నీ, దాని సుఖం గోరే చేశారు. మన కోరికలు దాని కెందునా పనికిరాలేదు. దాని ప్రారబ్ధం" అన్నది ప్రకాశం భార్య.

7

తరవాత ఆరేడు నెలలపాటు లీల నుంచి నాకుగాని, వాళ్ళ అమ్మకుగాని ఉత్తరం ముక్క లేదు!

ఆ తరువాత కోటేశ్వరరావు నా కొక ఉత్తరం రాశాడు లీలకు నెల తప్పిందిట. అది ఇప్పుడు వెనకటి కన్నా చాలా సుఖంగా ఉంటున్నదిట. పై మాసం పదో తారీకు తమ వాళ్ళంతా తిరుపతి పోదామనుకుంటున్నారుట.

ఆ ఉత్తరం చూసిన మీదట నేనొక చిన్న నాటకం ఆడాలని ప్లాను వేశాను. నా స్నేహితుడు కొండారెడ్డికి పుష్పక విమానంలాటి కారున్నది. లీలా వాళ్ళు తిరుపతి చేరే రోజుకు రెడ్డిని తిరుపతి తీసుకు పోవాలని ప్రయత్నించాను. పదో తారీకు ప్రాంతాల తనకు ఇతర ఎంగేజిమెంట్లేవో ఉన్నాయన్నాడు.

'నీ మీద ప్రేమకొద్దీ అడగటం లేదోయ్ నీ కారు కోసం_"అన్నాను.

"కారు కావాలిస్తే పట్టుకుపో. మేలా యుధన్ ఇథియోపియా డెలిగేషన్‌లో పోతూ తన కారు నావగ్గిరే ఉంచాడు" అన్నాడు రెడ్డి

ప్లాను సగంపూర్తి అయింది. ప్రకాశం కుటుంబాన్ని ప్రయాణం కట్టించడమే తరువాయి

ప్రకాశం మొరాయించాడు. దేవుడి మీద లెక్చరు ప్రారంభించాడు

"నేను మాత్రం దేవుణ్ణి చూడబోతున్నాననుకున్నావా? సీనరీ. ఈ రోజుల్లో తిరుపతి కొండల సీనరీ చూడనివాళ్ళ జన్మ ఏం జన్మ?" అన్నాను

ప్రయాణానికి బ్రహ్మాండమైన కారు సప్లై చేస్తానని తెలిసిన మీదట ప్రకాశం కొడుకులు "పోదాం, మామయ్యా" అన్నారు.

"వెళ్ళి తీరాలిప్పుడే. అన్నయ్య గారూ" అన్నది ప్రకాశం భార్య

ఎందుకైనా మంచిదని తొమ్మిది నాటికే మేమంతా తిరపతి చేరేటట్టుగా ఏర్పాటు చేశాను. కాటేజీ సులువుగానే దొరికింది

అన్న ప్రకారం పదోతేదీన కోటేశ్వరరావు లీలతోనూ, నలుగురు వితంతువులతోను కనిపించాడు. కొత్తగా స్వర్గానికి చేరిన పుణ్యాత్ముల బృందంలాగా వాళ్ళు ఒక కట్టగా దారిపక్క నిలబడి చూడదగినదీ, చూడదగనిదీ ఒకే రకమైన ఆసక్తితో చూస్తూ, ఎటువెళ్ళాలో నిర్ణయించలేని స్థితిలో ఉన్నట్టు కనబడ్డారు.

వాళ్ళ ప్రక్కన కారు ఆపి అందరమూ దిగాం. లీలతల్లినిచూసి అమ్మా" అని కేకపెట్టి, వచ్చిమీద పడిపోయింది. వితంతువులు విస్తుపోయారు.

కోటేశ్వరరావు తల్లిని అందరమూ పోల్చగలిగాం. నేనావిడను సమీపించి, మీరు మా లీల అత్తగారనుకుంటాను. ఇడుగో మీ వియ్యంకుడు, ఈవిడ మీ వియ్యపరాలు, వీళ్ళిద్దరూ లీల అన్నలు, వాడు తమ్ముడు. నేను వాళ్ళ క్షేమం కోరిన స్నేహితుణ్ణి. ఈకారు మద్రాసులో ఉండే మంత్రిగారిది. ఆ మంత్రి గారు మీ వియ్యంకుడి బాల్య స్నేహితుడు" అన్నాను. కారు మంత్రిగారిదన్నప్పుడు కోటేశ్వరరావు కన్ను మలిపాడు. వితంతువులు అబద్ధం పోల్చలేరని నాకు తెలుసు

వితంతువులు దిమ్మెరపోయారు

కోటీశ్వర్రావు చేదుమింగిన మొహం పెట్టాడు. అతనాడిన అబద్ధాలు బయట పడ్డాయి. నేనతన్ని చూసి జాలిపడలేదు. అతను లీలకు చేసిన అన్యాయంలో ఇది ఎన్నోవంతు ?

వాళ్లను కూడా మా కాటేజీకి చేర్చాను. వాళ్లువింటుండగా ప్రకాశంతో మా "మిత్రు" లైన రాజాలను గురించీ, మహారాజులను గురించీ మాట్లాడాను. ప్రకాశం నాకేసి రోషంగా చూశాడు. కాని తన కూతురి మేలు కోరి కాబోలు నాకు అడ్డంరాలేదు

ప్రకాశం భార్య వితంతువులతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. వాళ్లను తనయింటికొచ్చి పదిరోజు లుండమన్నది వాళ్లనోట ఇంచుమించు మాట లేదనే చెప్పవచ్చు. బాల వితం తువు మాత్రం, "మీ అమ్మాయి పెళ్ళికి మీరు రాకపోవటమేమిటి అత్తయ్య గారూ ! ఎప్పుడన్నా మీరు కూడా మా వూరు రావాలి " అన్నది.

లీలలోనే ఏదోమార్పు గమనిం చాను. తన వాళ్లను చూసిన మొదటి పావుగంటలో పాతలీలగానే కనబడింది. కాని క్రమంగా అసలు స్వరూపం వస్తు న్నట్టు నాకనిపించింది. నాకూ, వాళ్లమ్మ కు ఉత్తరాలు రాసిన లీల కాదీ లీల. కోటీశ్వర్రావును ఒంటరిగా పట్టుకొని లీలలో మార్పు గురించి అడిగాను.

"మీరు బాగానే కనిపెట్టారు. లీల మారుతున్నది. ఇంకా మారుతుంది."

అతను చెప్పినదాన్ని బట్టి నేను గ్రహించిన దేమంటే కానూరు అగ్ర హారం వాళ్ళు మొదట్లో లీలనొక వింత మృగంలాగా చూసినా, అది తమకన్న ఎక్కువ సంస్కారం గలదనేది తమకే తెలియకుండా గుర్తించి, గౌరవించ సాగారు. నిజానికి వాళ్ళు మొదట్లో నిరసించినది లీలలో కనిపించిన నాగరిక సంస్కారాల చిహ్నాలే. నాగరిక సంస్కారాల చిహ్నాలను ద్వేషించటం తేలికేగాని, నాగరికతనూ, సంస్కా రాన్ని తృణీకరించటం తేలిక కాదు. ఈ సంగతి మనచరిత్ర రుజువుచేస్తూనే ఉందనుకుంటాను.

లీల తమకు సహజ శత్రువు కాదని తెలిసి వచ్చినకొద్దీ అత్తవారింటివాళ్ళూ వాళ్ళ వెనకనే ఊళ్ళోవాళ్ళూ, దానికి సన్నిహితులై, దానిలో కొత్తకొత్త గుణాలు కనిపెట్ట సాగారు. పుట్టిననాటి నుంచీ ఎవ్వరికీ దానిలో, కనిపించని గొప్పగుణాలు వాళ్ళకు లీలలో కనిపించి ఉంటాయనటానికి సందేహం లేదు. తన చుట్టూ ఉండేవాళ్ళ గౌరవం—అంతకుముందు తనను అగౌరవంగా చూసే హక్కున్న వాళ్ళనుంచి— పొందటంలో లీలకు ఏదో ఆనందం కనిపించిందన్నాడు కోటీశ్వర్రావు. నిజంఅయి ఉండవచ్చు

రెండు రోజులు కొండమీద ఉండి లీలావాళ్లు బయలుదేరేటప్పుడే మేమూ బయలుదేరాం, వాళ్ళు మాతో బాటు పట్నం రావటానికి లేదు మా కారులో చోటులేదు. వితంతువులకు ఈ మహా లోకంనుంచి ఎప్పుడు తమ సొంత రాజ్యంలో పడదామా అని ఉన్నది. ఒక మాసంలోపల లీలా తమా కలిసి పట్నంవస్తామని కోటీశ్వర్రావు మాట ఇచ్చాడు

కనీసం లీలనైనా మావెంట పంపమని అతన్ని అడిగాం. కోటీశ్వర్రావుకు అభ్యంతరం లేదు. లీలే, "ఇప్పుడు కాదులే. ఇది పనుల తరుణం" అన్నది.

వితంతువుల మొహాలలో కలిగిన వికాసం చూసి తీరాలి.

లీలా, దాని మొగుడూ మరి రెండు నెలలు పోయాక పట్నం వచ్చారు. ఈ సారి లీలలో మార్పు మరింత స్ఫుటంగా కనబడింది. అదంతా గర్భిణీ లక్షణమనటానికి వీల్లేదు. పెళ్లికాక పూర్వం జీవించినట్టుగా అది జీవించి ఉండవచ్చు. అభ్యంతరం చెప్పేవాళ్లెవరూ లేరు. కాని అప్పటి పద్ధతులన్నిటినీ అది మార్చుకున్నది.

తల్లి సహజంగా తన కూతురు అత్తవారింట పడుతున్న కష్టాలను గురించి వివరించగా తెలుసుకుందామని ప్రయత్నించింది. లీల మొదట్లో రాసిన విషయాలన్నీ తప్పింది. కాని ఆ విషయాలు తల్లితో సైతం చెప్పటానికి ఆసక్తి ఉన్నట్టు కనపడలేదు; ఎంతసేపూ తమ గ్రామంలో ఒక్కొక్క కుటుంబం గురించీ ఎవరికీ అక్కర్లేని వివరాలు చెప్పింది. అదంతా ఇప్పుడు లీల జీవితం, అందులో లీల తల్లికి గాని, మిగిలిన వాళ్లకు గాని కాస్తయినా ఆసక్తి లేదు.

లీలకు సూడిదలు చేశారు. లీల నెరిగిన వాళ్లూ, స్నేహితురాళ్లూ చాలామంది వచ్చారు. వాళ్లతో ఆప్యాయంగా మాట్లాడటానికి లీల చాలా ప్రయాస పడింది. "మొహం తేరేవు," అన్నారు కొందరు. లీల పల్లెటూరు చేరినందుకు కొందరు సానుభూతి కూడా చూప యత్నించారు. లీల మొహం మాడ్చుకున్నది.

వాళ్ళిద్దరూ గట్టిగా పదిహేను రోజులు కూడా ఉండలేదు. ఇంకా రెండుమూడు రోజులకు బయల్దేరుతారనగా లీల ప్రయాణం గురించే ప్రస్తావనంగా మాట్లాడించి అది తన మొగుడి చేత ఏవో యాంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్లూ, కళ్ళకలిక ఆయింట్‌మెంట్లూ, టించర్ బెంజాయిన్, ప్లాస్టర్లూ, దూదీ ఇత్యాదులు కొనిపించింది. ఊళ్ళోవాళ్ళకు.

చిన్న చిన్న చికిత్సలూ, ప్రథమ చికిత్సలూ చెయ్యటానికట. అది పెళ్ళి కాక పూర్వం తనసంగతి తప్ప ఇంకె వరి సంగతీ చూసుకునేది కాదు. ఇదీ కాస్త నయమేనని అనుకున్నాను. కాని వెధవమనసు—ఇదీ తన స్వవిషయం చూసుకోవట మేనేమో నన్న అనుమానం వచ్చి, ఆ కాస్త సద్భావమూ మలినమైపోయింది.

* * *

అదీ లీల కథ. ఇటీవలనే నేను వాళ్ళ వూరు వెళ్ళాను. లీల ఇప్పుడు ముగ్గురు పిల్లల తల్లి. అత్తగారు పక్ష వాతంతో మంచాన పడి తీసుకుంటు న్నది. ఆడబిడ్డ వితంతువులు లీల ఆడపడు గులకు మడుగు లొత్తుతారు. ఊళ్ళో ఆడవాళ్ళు చాలాభాగం లీలకు భక్తు రాళ్ళు. మగవాళ్ళలో తిరుగుబాటు భావాలు తల ఎత్తుతున్నాయి. నాట్ల ప్పుడూ, కోతలప్పుడూ కూలీలు చాలా పేచీలు పెడుతున్నారు.

వాళ్ళ భాషా, భావాలు చూచి లీల చాలా అసహ్య పడుతుంది. ఒకసారి తిండికిలేని వెధవలకే ఇంత ధీమా ఉంటే పై మెట్టుమీద ఉన్నవాళ్ళు కింకెంత ఉండాలి?" అంటుంది. మరుక్షణమే,

---

ఒక ఆసామి రెండోఆట సినిమా నుంచి తిరిగి వస్తున్నాడు. సందులో చీకటిగా వుంది. ఉన్నట్టుండి ఇద్దరు మనుషులు ఆసామీని ఆపుజేశారు. "అయ్యా! దయవేసి మీ దగ్గిరొక పైసావుంటే ఇస్తారా?" అని అడిగారు.

ఆసామీ ముందు కంగారుపడి, మళ్ళీ తమాయించుకుని "ఇస్తాము గాని, ఏం చేస్తారు దాంతో?" అన్నాడు.

"మరేం లేదండి. మాలోమాకు తగాదా వచ్చింది. ఏ దెవరు తీసుకోవా లని. పైసా ఎగరేస్తాము. బొమ్మ పడితే మీ గడియారం వాడిది, ఉంగ రం నాది. బొరుసుపడితే ఉంగరం వాడిది, గడియారంనాది. మీ డబ్బు సరే, ఇద్దరం సమానంగా పంచుకుంటా మనుకోండి" అన్నాడు వారిల్లో ఒకడు.



"ఈ వెధవలకు తిన్నది సరిగా హరాయింపు కావటం లేదు. ఒక డొక్కమాడితేగాని చెప్పినట్టు వినరు" అంటుంది.

చిక్కేమిటంటే కూలిజనానికి లీల వంటివాళ్ళ జీవితం గురించి తెలిసినట్టుగా లీలవంటివాళ్ళకు కూలీలను గురించి తెలీదు. తెలీదనికూడా తెలీదు. కర్మ. లీలకు తెలిసిందల్లా, ప్రభుత్వమూ, పోలీసులూ తన పక్షమే ఉంటారని.

వాళ్ళ ఊళ్ళో కూలిజనాన్ని కూడ గట్టే నరసయ్య అనేవాణ్ణి రౌడీలు చావ చితక గొట్టారు. ఆపని జరుగుతుందని లీలకు ముందే తెలుసు. రౌడీల ప్రతి విధికి కోటేశ్వరరావు డబ్బిచ్చేటప్పుడు లీల అక్కడే ఉన్నదని వాళ్ళ ఊళ్లో చెప్పుకుంటారు.

అయితేనేం? లీల చాలా పుణ్యం సంపాదించు కుంటున్నది. కార్తీక స్నానాలు చేస్తుంది. ఏకాదశి ఉపోషా లుంటుంది. బ్రాహ్మలకు సంతర్పణలు చేస్తుంది. ఏడాదికి రెండు సార్లు సత్యనారాయణవ్రతం చేస్తుంది. లీలజీవితం పూర్తిగా మారిపోయింది,

(సమాప్తం)



నీటిలో బాలుడు

ఒక రోజున ఒక బాలుడు నదిలో స్నానానికి వెళ్ళాడు. చాలాసేపు ఒడ్డుకు దగ్గిరగా, అంత లోతులేని నీటిలోనే ఈదులాడాడు.

కొంత సేపైన తర్వాత మరికొంచెం లోతుకుపోయి ఈతకొడదామనుకున్నాడు. పది గజాలు లోపలికి వెళ్ళాడు. కాళ్ళకి నేల అందలేదు. భయం వేసింది. కాళ్ళూ చేతులూ ఆడలేదు. కంగారుపడి "బాబోయ్, బాబోయ్ మునిగిపోతున్నా రక్షించండర్రోయ్" అని కేకలు వేశాడు.

ఆ కేకలు విని ఒక పెద్దమనిషి అటు వచ్చాడు. వచ్చి రాగానే "నీకేమన్నా బుద్ధుందా లేదా? ఎవరెళ్ళమన్నారు అంత లోతుకి?...." అని తిట్టడం మొదలెట్టాడు.

కుర్రాడు చేతులు తపతపకొట్టుకుంటూ "ముందు నన్ను ఒడ్డుకు చేర్చండి. తరవాత తీరిగ్గా తిట్టండి. మునిగిపోతున్నా." అని అరిచాడు.

తొలకరి

జానకి కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది బయట సన్నగా చినుకులు పడుతున్నాయి. నేల పూర్తిగా తడవలేదు. చల్లనిగాలి వీస్తోంది,

వీధిలో సందడిగా ఉంది. వర్షం పెరుగుతుందనే భయంతో కొందరు తొందరగా నడుస్తున్నారు. కొంచెం వర్షం ఎక్కువ కాగానే జనం షాపుల లోను, హోటళ్ళలోను చేరుతున్నారు.

జానకి వీళ్ళ నెవర్నీ చూడటంలేదు. ఊరికే బయటికి చూస్తోంది.

రాజారావు కూడా పక్క కిటికీ లోంచి చూస్తున్నాడు స్నేహితులకోసం. వాళ్ళు వస్తున్నట్లులేదు. విసుగ్గా చేతి వాచీ చూసుకున్నాడు తొమ్మిదయింది.

'ఇదుగో, ఇలారా. ఇక్కడంతా శుభ్రం చెయ్యి' అన్నాడు.

జానకి మాట్లాడకుండా చీపురు తీసుకువచ్చి ఊడ్చింది. చీపురు తలుపు చాటునపెట్టి ఇంకా ఏం చెబుతాడో అని ఎదురు చూస్తూ నిలుచుంది.

'సిగరెట్లు తెప్పించావా?' అని అడిగాడతను. ఆమె తలవూపింది. 'సరే టిఫిను ప్రయత్నం కానియ్యి' అన్నాడతను. ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

బర్కిలీ సిగరెట్టు వెలిగించాడతను. సిగరెట్టు నోట్లోనే వుంచుకుని చౌక్కాస్టాండు దగ్గరికి వెళ్ళి చేతికందిన చిల్లర తీసుకుని తివాసీమీద ఒక పక్కన పోశాడు. చౌక్కాలోనోట్లు ఉన్నాయి గాని వాటిని తియ్యలేదు. అది వాళ్ళ సెంటిమెంటు. ఎక్కువ డబ్బు ముందు పెట్టుకుని ఎవరూ ఆడరు.

నాలుగు సిగరెట్లు కాల్చేసరికి వచ్చాడు రాజు, 'వీళ్ళు ఇంకా రాలేదా?'

'రా, కూర్చో, ఇంకో పావుగంటలో వస్తానన్నాడు సీతాపతి. అవధాని వచ్చేటప్పటికి ఆలస్యం అవుతుంది. ముగ్గురం వెయ్యొచ్చు ఈ లోగా' అన్నాడు రాజారావు.

మాటలోనే సీతాపతి వచ్చాడు. 'అవధాని రాలేదా' అంటూ. ముగ్గురూ ఆట మొదలుపెట్టి ఒక అరగంట ఆడే సరికి అవధాని వచ్చాడు, 'రారా నాయనా. నీ కోసమే చూస్తున్నాం.

కాశీనాథుని రామచంద్రరావు

నువ్వులేకపోతే ఆటలో రంజు లేదు.' అన్నాడు సీతాపతి.

సిగరెట్ పేకెట్ అవధాని వైపు తోశాడు రాజారావు.

'ఇవాళ మంచి హుషారు మీద ఉన్నాను. షోలన్నీ నావి' అన్నాడు అవధాని.

'షోలేం ఖర్మ. నువ్వు కార్డుషోలే చెయ్యగలవు' అన్నాడు సీతాపతి.

'ఒరేయి నువ్వు చచ్చు విట్లు మానెయ్యి. నీవిట్లు నీకు తప్ప ఇంకెవ్వరికీ నవ్వురావు' అన్నాడు రాజు.

ఆట ముమ్మరంగా సాగిపోతోంది, నిజంగా అవధాని మంచి 'రైజు'లో ఉన్నాడు. ముట్టుకున్న ప్రతిముక్కా 'ఎక్కుతోంది.' మొదటి ఆట డీల్. రెండుకౌంట్లు దొరికాయి.రెండు బతుకులకి ఆడినా, ఒక్క బతుక్కి ఆడినా నాలుగయిదు రౌండ్లు తిరిగేసరికల్లా రకీమని షో కొడుతున్నాడు. పేకలోకి వెడితే జోకరో, మిడిల్‌కార్డో తగుల్తున్నాయి.

సీతాపతి రెండాటలు కొట్టాడు. రాజారావు ఒకటి. రాజు అసలు ఒకటి కూడా కొట్టలేదు. రాజుది స్వతహాగా విన్నింగ్ హేండు. ఇవాళ కలిసి రావటంలేదు. ముక్కలు కలవటం లేదు. కలిసినా ముక్కలు ఎక్కటం లేదు. ఒక్క బతుక్కికూడా ఆడే ధైర్యం లేదు. సగం ఆటలు డ్రాప్ చేశాడు. నాలుగు మిడిల్ డ్రాపులు చేశాడు. ఎనిమిది రూపాయిలు పోయింది.

రాజు పంచాడు. పదమూడు ముక్కలు పంచి ఇస్పేటు మూడు తిరగేసి ముక్కకోశాడు. ఖర్మ. ఓపెన్. "ఓపెన్ తిప్పాను' అన్నాడు. ఆ ఆట సీతాపతి 'కొట్టాడు'.

రాజు 'కట్ ఫర్ షఫ్లింగ్' వేయించాడు, అవధాని సీటు రాజుకి వచ్చింది. రాజారావు ఉన్నచోటే ఉన్నాడు. సీతాపతి రాజు సీట్లోకి వచ్చాడు. సీట్లతో పాటు అదృష్టాలూ మారిపోయాయి.

ఆట జోరుగా సాగుతోంది. డబ్బు చేతులు మారుతోంది నలుగురూ కలిసి ఏకబిగిని కాలుస్తోంటే సిగరెట్లు అయిపోయాయి. 'జానకీ. ఇవేనా సిగరెట్లు? ఇంకా ఉన్నాయా?' అన్నాడు.

'తెప్పించాలా' అంది జానకి తలుపు దగ్గరకి వచ్చి. 'నాలుగు పేకెట్లు తెప్పించు' అన్నాడు.

జానకి కుర్రాడిని పంపి లోపలికి వెళ్ళిపోయింది. వెళ్ళి మంచం మీద కూర్చుంది. కాసేపు కూర్చుని వెనక్కివాలింది. ఏమీ చెయ్యాలనిపించడం లేదు. ఏమీ చెయ్యకపోతే తోచడంలేదు. అదోరకం పరిస్థితి. సుఖంగాలేదని తెలుస్తుంది. కాని ఏ విషయంలో సుఖం లేదో, సుఖం ఎలా తెచ్చుకోవాలో తెలియదు.

కాసేపు గదిగోడలని, కాసేపు పైకప్పునీ, మంచాన్నీ గదిలో వస్తువుల్నీ చూస్తూ కూర్చుంది. తర్వాత ఏమీ తోచక దుప్పటి డిజైను పరీక్షచేస్తూ కూర్చుంది. ఆమె చూపులు శూన్యంగా

నిర్లిప్తంగా ఉన్నాయి. ఆ చూపుల చివర ఏమీ ఉన్నట్లు లేదు.

'అంట్లు వెయ్యండమ్మగారూ' అంటూ పని మనిషి కేక వినిపించింది. 'ఇదొకర్తి' అంటూ దానిమీద విసుక్కుంది జానకి అకారణంగా. లేచి వెళ్ళడం తప్పనిసరి కాబట్టి లేచింది. 'అంట్లా? చెంబులు తోమావా అప్పుడే అంట్లకి? ఇదిగో చూడు. దీనికింకా మచ్చలు పోలేదే. మళ్ళీతోము. కాస్త పొట్టు తీసుకో. అయినా నుకు మారంగా తోమితే ఏం వదుల్తాయి?' అంది కోపంగా. పనిమనిషి మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ఇంతలో బుజ్జిగాడు వచ్చాడు. 'అమ్మా, డ్రాయింగుపుస్తకంకొనుక్కోమన్నారు స్కూల్లో. పావలా కావాలి' అంటూ. నాన్నగారిని అడుగు అంటూ పంపించేసింది జానకి.

నిమిషంలోనే గట్టిగా మాటలు వినిపించాయి. "వీడిని ఇక్కడి కెందుకు పంపించావు? డబ్బులు నువ్వివ్వలేవా?" అని అరుస్తున్నారాయన. జానకికి ఒళ్ళు చచ్చిపోయి నట్లనిపించింది. ఆ తిట్టేదేదో లోపలికివచ్చి తిట్టరాదా అనుకుంది. తిట్టడానికి లోపలికి రావాల్సిన అవసరం ఉందని అతను అనుకోడు. అసలు అక్కడనుంచి కదలడానికి మనసొప్పదు. ఆట రంజుపోతుంది.

"నీది కౌంచేనా? ఇచ్చుకో రూపాయి. నీది ముప్పైఅరా? ఒరేయ్. నువ్వు ముక్క దాచెయ్యకు. నాకు ఎలాగూ తెలుస్తుంది. నీ దెంత. ఏమీ లేదా? రెండా? నువ్వు రూపాయి చిల్లరియ్యి" అంటూ హడావిడి చేస్తున్నాడు రాజారావు.

"ఆట నెగ్గిఉంటారు" అనుకుంది జానకి. సంవత్సరాల తరబడి వినగా వినగా ఆమెకి కొన్ని మాటలు పట్టుబడ్డాయి. వద్దన్నా మనసులోకి దూరి కూర్చున్నాయి. అవి వినటం కన్నా ఆమెకి మరేపనీ కనిపించ లేదు. 'ఆల్‌కౌంటు' అంటే చాలా డబ్బు ఇస్తారు. 'డ్రాప్' అన్నవాళ్ళు ఆడరు. ఇంకా 'సీక్వెన్స్' అనీ 'ట్రిప్లెట్' అనీ రెండు మాటలు వింది. వాటి అర్థాలు తెలియలేదు. షో అన్నప్పుడుఆటఆఖరవుతుందని తెలిసింది. కాని 'కార్డుషో' అంటే ఏమిటో తెలియలేదు, ఇంకా 'ఎక్స్టెన్షన్' అన్నమాట కూడా వింది.

'తోమేశానమ్మగారూ! అంట్లు వెయ్యండి' అందిపనిమనిషిజానకివాటిని పరీక్షించి చూసింది. ఈమాటుఏ వంకా దొరకలేదు. నిజానికి ఇందాక కూడా మచ్చలు లేవు. అప్పుడు తనవళ్ళు ఉడికి పోతోంది.

జానకికి పని మనిషిమీద జాలి వేసింది. ఎవరిమీదో తెలియని కోపాన్ని నిష్కారణంగా దీనిమీద చూపిస్తోంది. తనకి నిజంగా ఎవరిమీద కోపమోనని చాలాసార్లు ఆలోచించుకుంది జానకి ఆమెకేమీ సమాధానం దొరకలేదు.

బుజ్జిగాడు మళ్ళీవచ్చాడు. "సర్కస్ వచ్చిందిటమ్మా వెళ్ళనా" అని అడిగాడు. "నాన్నగారిని అడిగి వెడుదువు



గానితే" అందిజానకి మృదువుగా. బాబు ధైర్యంగా ఈ మధ్యనే అమ్మనిఏదైనా అడగగగలుగుతున్నాడు. ఇదివరకు జానకి ఏకారణం లేకుండానే వాడిని కొట్టేది. "నీళ్ళుపోసుకోనా అమ్మా"అన్నప్పుడు, "స్కూలుకి టైమవుతోంది అన్నం పెట్టమ్మా"అన్నప్పుడు కూడావిసుక్కునేది. తనకి బాబు మీద ఏమీ కోపం లేదని తెలుసుకున్నాక ఇప్పుడు వాడి మీద చిరాకు పడటం మానేసింది.

వాడు ముందు గదిలోకి వెళ్ళబో తోంటే చెయ్యి పుచ్చుకుని ఆపింది

జానకి. 'ఇప్పుడు కాదు. వాళ్ళ ఆట అయిపోయాక అడుగు'అంది.

'కాసేపు పుస్తకం తీసి చదువుకో. అప్పుడు పంపిస్తారు. లేకపోతే చదవటం లేదని తిడతారు' అంది. వాడు సరేనని చదువుకోవటం మొదలు పెట్టాడు. మంచంమీద అలాగేకూర్చుని ఉండిపోయింది జానకి. మళ్ళీలేచి చేతికి దొరికిన దారపుఉండ చిక్కు తీసింది.

పనిమనిషి అంట్లు తోమేసినట్లుంది. అన్నీ అక్కడ పెట్టింది. 'పని అయిపోయిందండమ్మగారూ' అంది.

"అయిపోయింది" అంది జానకి. పనిమనిషి వెళ్ళలేదు.

"ఏమే? ఇంకా ఉన్నావు?"

"కాస్త చింతకాయ పచ్చడి ఉంటే పెట్టించండమ్మగారూ"

"ఏమే ఉన్నట్టుండి దాని మీద మనసు పోయిందేమిటీ" అంది జానకి కొంచెం కుతూహలాన్ని ప్రదర్శిస్తూ.

"నాక్కాదు. ఆడికండి" అంది పనిమనిషి సిగ్గుపడుతూ.

"వాడెవడు?" అంది జానకి తెలిసీ కూడా.

"ఆడే, మావోడండీ" అంది సుబ్బి సిగ్గుతో కలిసిన చిరునవ్వుతో.

అదీ వాడూ చాలా కులాసాగా తిరుగుతారని జానకికి తెలుసు. ఆ వివరాలు తెలుసుకోవాలని చాలా కుతూహలపడేది. మొదట్లో "కాస్త పచ్చడి మిగిలింది. తీసికెళ్ళు" అని దాన్ని మాటల్లోకి దించి వివరాలడిగేది.దానిఆనందం పంచుకునేవాళ్ళు దొరికేసరికి అది అన్ని వివరాలతో సహా చెప్పేది.మంచి నీళ్ళు తెమ్మని చెయ్యిపుచ్చుకుంటాడనీ, సాయంత్రం పూట "ఇవాళ పనిమానెయ్యి. సరదాగా తిరుగుదాం" అంటాడనీ, తను పనికి బయలుదేరే సమయానికి తలుపులు మూసేసి నవ్వుతూ పోజు కొడుతూ కూర్చుంటాడనీ, తను అంటిస్తేతప్ప బీడీ తాగడనీ ఇలా చాలా వివరాలు చెప్పేది. జానకికి వినడానికి చాలా కుతూహలం ఉండేది. కాని పనిమనిషి దగ్గర లోకువయిపోకుండా "సర్లేవే. ఇప్పుడివన్నీ నిన్నెవడు చెప్పమన్నాడు. ఆ పచ్చడి తీసుకుపో" అనేది. వినాలని జానకికీ, చెప్పాలని సుబ్బికీ విపరీతమైన ఉత్సాహం ఉండేది. మధ్యలో సంభాషణ ఆగిపోవటం ఇద్దరికీ బాధాకరంగా ఉండేది.

కొన్నాళ్ళు జానకే సుబ్బిని మాటల్లోకి దించేది. కొన్నాళ్ళుఅదే కల్పించుకుని చెప్పేది. జానకి తనకిష్టంలేనట్లు మొహం పెట్టివినేది. కొన్నాళ్ళు లోకువయిపోతానేమోనన్న భయంతో సంభాషణ తుంచేసేది. కొన్నాళ్ళు నిజంగానే కోపంవచ్చి తిట్టేది. ఎందుకో తెలియని కోపం అది. మనసులో తొక్కివేయబడిన వికారం ఏదో బయటికి వచ్చి ఆమెని ఆవరించేది. పనిమనిషిమీద కోపంతో చిందులు తొక్కేది అప్పుడు. దాన్నితిట్టి పంపేశాక నిస్సహాయంగా మంచంమీద వాలి కళ్ళు తుడుచుకునేది.

ఇవాళకూడా జానకి తనంతట తను

అడగటం లేదు. దానంతట అదే చెప్పే టట్లు సంభాషణ సాగిస్తోంది. దానికీ ఉత్సాహం ఆగటం లేదు.అడగకుండానే చెప్పాలని చూస్తోంది.

'ఎంతసిగ్గే నీకు, వాడిపేరెత్తితేను' అంది జానకి.

'అమ్మో అలాగే అంటాడండి. ఎందుకే అంత సిగ్గూఅని. నాకుమాత్రం అడిని చూస్తేనే చచ్చే సిగ్గండి.' అంది.

'అంత సిగ్గయితే వాడితో ఎలా మాట్లాడతావే? ఇదెక్కడ చోద్యం! వాడి దగ్గరకే వెళ్ళవా ఏమిటి?' అంది జానకి.

కొంచెం సిగ్గుతో 'దగ్గరకెడితే బుగ్గ గిల్లుతాడండి' అంది సుబ్బి.

జానకి ఒళ్లు ఝల్లుమంది.

వెంటనే హఠాత్తుగా దానిమీద కోపం వచ్చింది. 'బావుందే మీ వరసలూ మీరూనూ. ఇదిగో పచ్చడి పట్టి కెళ్ళు' అంది విసురుగా. పని మనిషి చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. ఎందుకో పనిమనిషి అక్కడ ఉండటం జానకికి ఏమాత్రం నచ్చలేదు. దాని ఉనికినే సహించలేక పోయింది.

అప్రయత్నంగా ఒక ఊహ మనసులో మెదిలింది. అది వాడికి చింతకాయ పచ్చడి పెడుతుంటే ఏం జరుగుతుందా అని. ఒక రకం సంఘటన ఊహాలోకి వచ్చింది. నిజానికి అది ఆమె ఊహాలోనిది కాదు. ఆమెకిప్పుడు ఊహించే శక్తిగాని, ఆలోచించే శక్తి గాని లేవు. ఒక ప్రేక్షకురాలిగా ఏం జరిగితే అది చూడగలదు. మంచిగానీ, చెడుగానీ తలవంచ గలదు. ఇంతకీ ఆ సంఘటన ఇదివరలో సుబ్బి ఆమెకి చెప్పినదే.

"నాకేసి అలా చూస్తావేం? మంచి నీళ్ళు తాగు" అందిట అది, చెంబు పట్టుకుని తనకేసేచూస్తున్న మగడితో.

"మంచి నీళ్ళు ఎక్కటంలేదు. నీ నీ అందాన్ని తాగుదామని ఉంది" అన్నాట్టవాడు. వెధవ! వాడికి అంత లేసి మాటలెలా వచ్చాయో?

జానకి గుండెల్లో ఏదో చిన్నపోటు ప్రారంభమయింది. ఉన్నట్టుండి కళ్ళల్లోకి నీళ్లు వచ్చాయి. నిస్సహాయంగా మంచంమీదవాలి వెక్కి వెక్కి ఏడిచింది.

* * *

మధ్యాన్నం మళ్ళీ పనిమనిషి వచ్చింది. అప్పుడు టిఫిను చేస్తోంది జానకి. ఇది ఆమె నిత్యకృత్యాలలో ఒకటి. పేకాట ఆడేగది శుభ్రంగా

---

* "అదేమిటోయ్, నీ జుట్టంతా అలా వూడిపోయింది?"

"ఆందోళనవల్ల."

"ఎందుకాందోళన?"

"జుట్టూడిపోతోందన్ని."

ఊదవటం, సిగరెట్లు తెప్పించటం, రోజుకి రెండు సార్లు కాఫీ టిఫిన్లుచేసి అందించటం.

నాలుగు ప్లేట్లలో టిఫిను పెట్టి, వాటిని గుమ్మం దగ్గర టేబులుమీద పెట్టి భర్తని పిలిచింది. అతను వచ్చి టిఫిన్లు పట్టికెళ్ళాడు. తర్వాత రెండు గ్లాసులు, మరిచెంబు నిండా నీళ్ళు ఇచ్చింది. కాఫీకూడా కలిపింది. తర్వాత ఎంగిలి కంచాలు పని మనిషికి వెయ్యటానికి పెరట్లోకి వెళ్ళింది జానకి.

'పచ్చడి చాలా బావుందన్నాడమ్మా ఆడు' అంది పనిమనిషి.

జానకి ముఖం వికసించింది. 'ఇంకా ఏమన్నాడే' అని అడగాలని ఉన్నా అడగలేదు. అదే చెప్పింది. 'మీ చేత్తో చేస్తే అమృతం లాగుంటా యన్నాడండి' అంది.

జానకి ఏదో తోచి పేకాటగది దగ్గరగా వెళ్ళి తలుపు చాటున నుంచుంది. అంతా కజ్జికాయలు తింటూ ఆడుతున్నారు. ఆయన ముక్కలు కింద పడేస్తూ 'ఎందుకొచ్చిన ఆట [illegible] ఇది. కలుపులోనే రెండు ట్రిప్లెట్లు, ఒక సీక్వెన్సు పడ్డాయి. నీకు షో అయ్యే సరికి నాకు ఆట బతకనుకూడా లేదు. ఇదిగో క్రౌంటు' అంటూ డబ్బుతోశాడు.

'ఆడుకోవటంలో ఉంటుంది. సెట్లు మారుస్తూ ఉండాలి. నీకు ఆరీన్ రాణీ కావాలని నాకుతెలుసు. అందుకే తొక్కిపట్టాను చివరిదాకా' అంటున్నారు ఇంకొకాయన.

'నాకు కార్డుషో కాస్తలో మిస్సయ్యాను. నువ్వు స్పేడ్స్త్రీ వేసిఉంటే నాకుషోయే ఆహా! కజ్జికాయలు మజాగా ఉన్నాయిలే' అంటున్నారెవరో. జానకి చెవులు రిక్కించుకుని వింది. భర్త కాదు. గొంతు వేరుగా ఉంది.

"ఏదో ఉన్నాయి" అంటున్నారాయన చప్పరించేసి. కాసేపాగి "వాళ్ళకే ముంది. ఇంట్లోనే ఉంటారుగా. తీరిగ్గా కూర్చుని చేస్తారు. అయినా సంవత్సరాల తరబడీ చేస్తున్నారుగా. ఈమాత్రం రాదా" అన్నాడు క్షమాపణ చెప్పుకుంటున్నట్లు. జానకి లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళు రాత్రి తొమ్మిదింటికి లేచారు. "తొందరగా అన్నంపెట్టు. సినిమాకి పోవాలి" అన్నాడు అతను. అన్నంపెట్టి పంపేసింది.


ఆ రాత్రి జానకికి నిద్రపట్టలేదు. అలాగని పెద్దగా ఆలోచనలు లేవు ఆమెకి. అసలు జానకికి ఆలోచనలు రావటం మానేసి చాలా కాలంఅయింది. రోజులు గడిచిపోతే చాలునన్నట్లుంది. చెప్పినపనులు చెయ్యటం, ఏం జరుగు

తుందో చూడటం_ఇంతేఆమెకితెలిసినది. ఆయితే పక్కింటి మొగుడూ పెళ్ళాలు కలిసి సరదాగా సినిమాకి వెళ్ళినప్పుడూ, తలుపులు వెయ్యకుండానే ఆయన పెళ్ళాన్ని ముద్దుపెట్టుకున్నప్పుడు, బాబాయి పిన్నికి కొత్తచీర కొనిచ్చి అప్పుడే కట్టుకోవాలని బలవంత పెట్టినప్పుడు, చెల్లితో మరిది "నీకళ్ళల్లో ఏదో అందం ఉంది. అందరూ వేరు నువ్వువేరు" అన్నప్పుడు, సుబ్బి పుట్టిన రోజున దాని మొగుడు యజమానిని బ్రతిమాలి మరీ సెలవడిగి పుచ్చుకున్నాడని తెలిసినప్పుడు, ఆయన గారి స్నేహితుడి వివాహ వార్షికోత్సవానికి తనకీ భర్తకీ ఆహ్వానం వచ్చినప్పుడు జానకిలో ఏదో సంచలనం, ఏదో చైతన్యం కలిగేవి. తనకి కావలసిన దేదో ఉందనిపించేది. తనకి అసౌఖ్యంగా వుందని తెలిసేది. ఒక రకమైన బాధ. ఏమిటో తెలిసేది కాదు. గుండెల్లో పోటు. నరాల నీరసం, ఒంట్లో నిస్సత్తువ।

వివాహిత కాకపూర్వం, అయిన కొత్తలోనూ జానకి చలాకీ పిల్ల అని, ముగ్ధమోహన రూప అనీ ఆమె మనస్సు బంగారు కలలతో-నిండిఉండే దనీ అంటే ఇప్పు డెవరూ నమ్మరు.

వానలేక ఎండిపోయిన చెట్లని చూస్తే వాటికీ తనకీ భేదం లేదనిపించేది ఆమెకి.

అయితే అతను దేనిలోనూ లోటు చేసేవాడుకాదు ఆమెకి. ప్రతీ పండగకీ కొత్తచీర కొనుక్కోమని డబ్బు ఇచ్చేవాడు. ప్రతివారం పక్కింటావిడతో



సినిమాకి వెళ్దామనేవాడు. ఆమెకి వంట్లో జ్వరంగా ఉన్నరోజున కేరియర్ తెప్పించేవాడు. కుర్రాడికి చదువు చెప్ప డానికి ట్యూషన్ మాస్టర్ని పెట్టాడు. బజారు సరుకులు తేవడానికి జవాను ఉన్నాడు. తను నిర్వహించవలసిన బాధ్యతలు అతని కింకేవీ కనిపించ లేదు. నిశ్చింతగా పేకాటలో కూర్చునే వాడు. పేకాటకి అంతరాయం కలిగితే తప్ప ఇంకదేనికీ భార్యమీద విసుక్కునే వాడు కాదు. పిల్లవాడి మీదచెయ్యి వేసి, చంటిదాన్ని కడుపులో దూర్చుకుని అలాగే నిద్రపోయింది జానకి.

* * *

మర్నాడు సుబ్బి ఆలస్యంగా వచ్చింది. దాని బుగ్గమీద గాట్లుపరీక్షగా చూసింది జానకి. అంతే, ఏమీమాట్లాడ లేదు. విసుగ్గా అంట్లు వేసింది. అనుకో కుండా కోపం వచ్చింది ఆమెకి.

సుబ్బి చాలా ఉత్సాహంగా ఉంది. దానికి రాత్రి మధుర ఘట్టాలు గుర్తుకు వచ్చి మనస్సు ఉరకలువేస్తోంది. రాత్రి జరిగినవన్నీ జానకమ్మగారికి చెప్పి ఆనందం పంచుకోవాలని సుబ్బి ఉబ లాటం. అమ్మగారు సుముఖంగా ఉన్నట్టులేదు. అయినా ఎలాగైనా సందర్భం కల్పించుకునిచెప్పెయ్యాలను కుంది. ముసిముసి నవ్వులు వద్దన్నా బయటికి వచ్చేస్తున్నాయి.

'ఏమిటే ఆ నవ్వులు. పనిచేసేదాని తరహాయేనా అది ! అంట్లు తోము తీసి కెళ్ళి' అని కసిరింది జానకి.

సుబ్బి మొహంలో నవ్వు మాయ మైంది. మనస్సు కష్టపెట్టుకుంది. మాట్లాడకుండా అంట్లు తీసుకుని వెళ్ళి పోయింది. అవి అయిపోయాక ఇల్లు ఊడ్చింది. జానకి అంతసేపూ కోపం గానే ఉంది. సాయంత్రం చెప్పొచ్చులే అని పని చూసుకుని వెళ్ళిపోయింది.

"నా కివాళ తొమ్మిదింటికే బడి. తొందరగా అన్నం వండాలి" అన్నాడు బాబు. వంట పనిలో మునిగిపోయింది జానకి. ఆయనింకా లేవలేదు. రాత్రి రెండింటికో మూడింటికో వచ్చినట్లు న్నారు. కాఫీకాచి ఫ్లాస్కులో పోసింది. ఈ పూటకి ఏం చెయ్యాలో కనుక్కో వాలి. గుమ్మంలోనే కూర్చుంది అతను లేచేదాకా నిరీక్షిస్తూ.

అతను తొమ్మిదింటికి కూడా లేవ లేదు. ఆఫీసుకి ఆలస్యం అవుతుందని తనకి తోచినదేదో చేసేసింది. అతను లేచి తినేసి వెళ్ళిపోయాడు. ఇలా చేశావేం అనిగాని, ఉప్పెక్కువ అయింది అనిగాని అనడు. ఆమె వండి పెడుతుంది. అతను తినేసి వెళ్ళి పోతాడు.

సాయంత్రం పక్కింటావిడ వచ్చింది. "సినిమాకి వస్తారా" అంటూ.

"ఏమిటి విశేషం ?"

"ఏంలేదు. మా పాప సినిమాకి తీసికెళ్ళమని పోరుతోంది. నా కొక్కర్తికీ అక్కడ తోచదు. మా వారికి పీల్లేదట" అందావిడ.

జానకి మాట్లాడలేదు.

"మీ ఆయన పర్మిషన్ కావాలా ?"

"అందుకోసం కాదనుకోండి గానీ ..."

"పోనీ, నేనడుగుతాను అన్నగారిని ."

"మీరా" అంది జానకి.

ఇంతలోనే అతని పిలుపు వినబడింది.

"ఏమిటంటుంది ఆవిడ ?"


"సినిమాకి రమ్మంటుంది."

"వెళ్ళు. జేబులో అయిదు నోటుంది. తీసుకెళ్ళు"

జానకికి వెళ్ళాలని లేదు. ఆమాటే చెప్పింది. 'నీ యిష్టం' అనివూరుకున్నాడతను. కడుపులో నెప్పిగా ఉందని చెప్పి మానేసింది.

ఆ మర్నాడుకూడా సుబ్బి ఉత్సాహంగా వచ్చింది. కాని అమ్మగారు ఇవాళకూడా వినే పరిస్థితిలో లేదు. ఎంత ప్రయత్నించినా కుదర లేదు. అప్పటికీ "తొందరగా గిన్నెలు వెయ్యండి. ఆదీ పాటికి వచ్చేసి ఉంటాడు" అందికూడా. అమ్మగారు కోపంతో చిటపట లాడుతోంది.

మర్నాడు అరగంట ఆలస్యం అయ్యేసరికి పట్టుకు దులిపేసింది. నీకు బుద్ధీ జ్ఞానంలేదా ? మేముఅన్నం వండుకోవాలని తెలీదా? అంటూ. అంత కోపం దేనికో సుబ్బికి అర్థం కాలేదు. తలొంచుకుని పని చూసుకుని వెళ్ళిపోయింది. వెళ్ళిపోయేటప్పుడు ఆఖరి ప్రయత్నంగా "కొంచెం ఆవకాయ ముక్క పెట్టించండి" అంది. "ఇప్పుడు



చెయ్యి ఖాళీగా లేదు!" అంటూ పంపించేసింది జానకి.

మర్నాడు పొద్దున్న సుబ్బి రాలేదు. సాయంత్రం ఆలస్యంగా వచ్చింది. "తిరపతి కొండకి వెళ్ళామండి" అని ఏదో చెప్పబోయింది. జానకి విసుక్కుంది.

మర్నాడు సుబ్బిని పనిలోనుంచి మానిపించేసింది జానకి. మానిపించడానికి కారణం ఏదీ చెప్పలేదు. ఇలా నాగాలుపెడితే లాభంలేదని దెబ్బలాడింది. రావలసినది సరిగ్గా లెక్కకట్టి ఇచ్చి పంపించేసింది. తనకింకో ఇంట్లో పనిలేదన్నా వినలేదు. సాయంత్రం అంట్లూ, చెంబులు, ఇంటి పనులు అన్నీ తనే చూసుకుంది. కొంత అలసట కలిగినా అంత బాధనిపించలేదు. కొత్త పనిదాన్ని పెట్టుకోలేదు.

ఆ రోజు పేకాట ముమ్మరంగా సాగింది. దాదాపు రోజల్లా ఆడారు. ఆ రోజున రెండు సార్లు వేడి టిఫిన్లు చేసి ఇచ్చింది. మూడోసారికి గిన్నెలో మాగాణ్ని...

పోయించుకున్నాడు అతను. తెల్లారి అయిదయ్యేదాకా ఆడారు.

మర్నాడు ఆదివారమైనా ఎవరూ రాలేదు అతను ఆ రోజంతా కాళీగానే ఉన్నాడు. ఏమీతోచక అటూ ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరిగాడు రోజంతా.

మర్నాడుకూడా పేకాటజట్టురాలేదు. తొమ్మిదింటిదాకా పేపర్లో అడ్డమైన చెత్తా చదివి అప్పుడు వచ్చి గుమ్మం మీద కూర్చున్నాడు. వంట అయిందా అని అడిగాడు. అయింది అందామె పీట వెయ్యడానికి లేస్తూ.

'ఇంకా స్నానం చెయ్యలేదు'అన్నాడతను.

"నీళ్ళు తీసుకు వస్తాను" అటూ దొడ్లోకి వెళ్ళింది. పెద్ద బిందెనిండా తోడింది. గట్టుమీద పెట్టడానికి ఎత్తింది. కాని కష్టం అయింది. బిందె చాలా బరువుగా ఉంది. కొంగు నడుముకి చుట్టుకుని నెమ్మదిగా ఈడ్చింది.

"ఎందుకంత బరువు మోస్తావు? నేను వస్తున్నాను ఆగు" అంటూ అతను వచ్చాడు. 'పరవాలేదు. రోజూ పెడుతున్నాగా' అందామె.

... సాయం పట్టాడు. ఆమె ... చెయ్యి అతని

భుజంమీదవేసి నడిచింది. కొత్తగా ఉంది ఆమెకి.

నీళ్ళు పోసుకుంటూ "తువ్వాలు వట్రా" అన్నాడు. ఉతికిన తువ్వాలు చెట్టు కొమ్మకి తగిలించింది.

అతను వొళ్ళు రుద్దుకున్నాడు. వీపు రుదుకోవటం కష్టం అయ్యింది. జానకి వైపు చూచాడు. "నేను రుద్దనా" అంది. అతను తలవూపాడు. సబ్బుతో రుద్దింది. అతను తువ్వాలుతో వళ్ళంతా తుడుచుకున్నాడు. ఈలోగా ఆమె చక చకా పీట, కంచం, మంచినీళ్ళు సిద్ధం చేసింది.

చాలాకాలం తర్వాత అతను ఇవాళ తీరిగ్గా పనులు చేస్తున్నాడు. తీరికగా స్నానం చేసిన తర్వాతఇప్పుడు తీరికగా భోజనం చేస్తున్నాడు. భోజనం చాలా బావున్నట్లనిపించిందతనికి మొదటి సారిగా. "ఇంకొంచెం కూరవెయ్యి" అన్నాడు. అది తిన్నాక మళ్ళీ కొంత వేయించుకున్నాడు. తర్వాత మజ్జిగ లోకి మరికొంత వేయించుకున్నాడు.

అతను భోజనంచేసి వెళ్ళిపోయాక వంటింటి పనిముగించుకుని ఆమెనడుం వాల్చింది. ఆమెకి నిద్రపట్టలేదు లని ప్రయతి.ం రో.-

క్లాత్ కుట్టడం పూర్తిచేసింది. అది వేశాక టేబులుకి మంచి కళ వచ్చింది.

సాయంత్రం ఆయన వస్తున్నారేమో నని చూసింది. ఆరింటికివచ్చా డతను. "టిఫినుచేస్తావా" అని అడిగాడు. పావు గంటలో వేసింది పెసరట్లు. ఇంకో రెండు వెయ్యమని అడిగి మరీతిన్నాడు. "అల్లంముక్కలు వేస్తే మంచి రుచి వచ్చింది" అన్నాడు.

బయటికి వెళ్ళిపోబోతూ టేబులు కేసి చూశాడు కొత్తగా కనిపించింది. "ఎప్పుడు అల్లావు?" అని అడిగాడు. "ఇవాళే పూర్తిచేశాను" అంది. 'గుడ్' అని వెళ్ళిపోయాడు.

అతను తిరిగి వచ్చేసరికి ఎనిమి దయింది. ఈలోగా ఇల్లు చాలాభాగం సర్దింది. ఎనిమిదిన్నరకి ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

భోజనం చేశాక "కాసేపు వెన్నెల్లో కూర్చుందాం" అన్నాడు. ఎందుకో వెన్నెల్లో కూర్చోవాలనిపించింది. ఇల్లు పరిశుభ్రత కారణం కావచ్చు.

జానకి అతని వెనకాలే నడిచింది.

వాతావరణం మనోహరంగా ఉంది.

సరిసరాలు,

చాలాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. తర్వాత "చాలాబాగుంది కదూ" అన్నాడు అతను. తలవూపింది జానకి. ఆమె వంట్లో విద్యుత్తు ప్రవహిస్తోంది. మనస్సు ఉరకలు వేస్తోంది.

"ఆ మల్లెపొదలూ, ఆ పచ్చటి ఆకులూ, ఆ వేపచెట్టూ, ఇవన్నీ వెన్నెల్లో అందంగా లేవూ" అన్నాడు విస్మయంతో అటుచూస్తూ.

జానకి కళ్ళు వెలుగుతున్నాయి తలవూపి ఇంకా ఏమంటారో అని చూస్తోంది.

"రోజూ మనం వీటిని చూస్తూనే ఉన్నాం. వెన్నెల్లో ఇవింత అందంగా ఉంటాయని ఎప్పుడూ అనుకోలేదు." అన్నాడు.


"అవును" అంది జానకి మొదటి సారిగా మాట్లాడుతూ.

ఆ తర్వాత ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు. అనిర్వచనీయమైన ఆనందం ఇద్దరి మనస్సులలోనూ వుంది. మాటలలో చెప్ప లేని ఒక అనుభూతిని అనుభవిస్తున్నారు.

రాజారావు తదేకంగా జానకికేసి చూస్తున్నాడు. జానకి అప్పుడప్పుడు పైకిచూస్తూ తలదించుకుంటోంది.

అతని కళ్ళల్లో బాధ కనిపించింది. ఆమె కనుబొమలు ముడిచి పైకి చూసింది ఏమిటన్నట్లు.

"నువ్వు బాగా చిక్కిపోయావు" అన్నాడు అలాగే చూస్తూ. "నేనేం చిక్కాను?" అంది జానకి తలవంచుకుని. తర్వాత అతనికేసి "మీరుమాత్రం ఇదివరకటిలా ఉన్నారా?" అంది. "అవును" అన్నాడు రాజారావు ఏదో



ఆలోచిస్తూ. తిండీ, డబ్బు పుష్కలంగా ఉండి ఇద్దరూ ఇలా అయిపోవటానికి కారణాలు వెతుకున్నాడతను.

ఉన్నట్టుండి, చల్లటిగాలి వీచింది. "రండి. లోపలికి పోదాం. చలిగాలి మంచిది కాదు" అంది. ఇద్దరూ లేచి లోపలికి వెళ్ళారు.

"ఇవాళ అయిదు రూపాయలు లాభం" అన్నాడు రాజారావు.

"ఎలా వచ్చింది ?"

"ఆటలలో. పేకలు పెన్ని పందెం కాశాడు మా సత్యన్నారాయణ. ఆ కా ఆట వచ్చునని వాడికి తెలీదు. అయిదు రూపాయలు పందెం కాసి ఓడి పోయాడు."

"అది మీరు బాగా ఆడతారని బాబాయి చెప్పాడు" అంది జానకి.

అతను హృదయంనిండా గాలిపీల్చి పని "ఎప్పుడు చెప్పాడు ?" అని అడిగాడు.

"చంటిది పుట్టినప్పుడు"

"అప్పుడు బాబాయి వచ్చాడా ? నే చూడలేదే"

"అప్పుడు మీరు .." అని ఏదో అనబోయి ఆగి, మీరు పనిమీదవెళ్ళినట్లున్నారు" అంది.

అతనికి గుర్తు వచ్చింది, తనా రోజున ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంట్లో పేకాట ఆడుతున్నాడు. అతనిలో ఏదో బాధావీచిక హృదయ మంతటాపాకింది.

"అవునుగానీ నీకు వీణ వచ్చునని చెప్పావుకదూ ?"

"ఎప్పుడు చెప్పాను ?"

"పెళ్ళిచూపులరోజున.

ఇద్దరికీ ఆనాటి మధురస్మృతులు గుర్తుకు వచ్చాయి. జానకి దొంగతనంగా పైకి చూస్తున్నప్పుడు అతనూ అలాగే చూస్తున్నాడు. ఇద్దరి కళ్ళూ కలిసి దిగిపోయాయి.

జానకికీ, రాజారావుకీ కూడా వళ్ళు ఝల్లుమంది. మనసు ఉరకలువేస్తోంది. ఊహలు పరవళ్ళు తొక్కుతున్నాయి.

"అప్పుడు నువ్వు దొంగతనంగా చూశావు కూడాను" అన్నాడు. ఆమె సిగ్గుతో తలదించేసుకుంది. "పొండి మీరు చూడందే నేను చూశానని ఎలా తెలిసింది ?" అంది.

"నేను నీలా దొంగతనంగా చూడలేదే. ధైర్యంగా నీకేసి చూశాను"

బయట పరచుకున్న వెన్నెల ఇద్దరి హృదయాలలోకీ పాకుతోంది. తియ్యటి కొత్త అనుభవం కలుగుతున్నట్లుగా ఒళ్ళు పులకరిస్తోంది.

ఆమె నడుంచుట్టూ చెయ్యివేశాడు అతను. ఇంతలో చంటిది లేచి ఏడుపు మొదలుపెట్టింది. దాన్ని ఊరుకోబెట్టడానికి జానకి లేచి లోపలికి వెళ్ళింది.

* * *

మర్నాడు ఆఫీసు పని చాలా ఉందని తొందరగా వంటచెయ్యమని, తిని వెళ్ళిపోయాడు. ఆ మధ్యాహ్నం కూడా ఆమెకి నిద్ర పట్టలేదు. అంతా కొత్తగా వుంది. ఇల్లు నందనవనం

జానకి పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటుంటే 'ఛ. ఏడవకు. జ్వరం తగ్గకేం జేస్తుంది' అన్నాడు. జానకికి మాత్రం భయంగానే వుంది.

అతను ఒకందుకు మాత్రం సంతోషించాడు. పేకాటకి రానటానికి పక్కాని కారణం దొరికింది. సీతాపతి, రాజు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొగలడు.

వాళ్ళిద్దరూ సాయంత్రం వచ్చారు. విషయం తెలుసుకుని పరామర్శించి వెళ్ళిపోయారు. మర్నాడు కూడా వచ్చారు. ఆ తర్వాత రాలేదు. ఇక పేకాట ఆడదలుచుకోలేదని చెప్పేశాడు.

నాలుగు లంకణాలు చేసిన తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. నార్మల్‌కి వచ్చేసరికి మరో రెండురోజులు పట్టింది. పథ్యం తిన్నాక మూడు రోజులకి మామూలు మనిషి అయ్యాడు.

జానకి కళ్ళల్లో నిండుగా తృప్తి కనిపిస్తూంది. మొహం పీక్కుపోయినా, మనిషి చిక్కిపోయినా ఏదో సంతోషం మొహంలో కనిపిస్తూంది.

ఈ పదిరోజుల్లోనూ హాయిలో బాధ, బాధలో హాయి అనుభవించారు ఇద్దరూ. తనకోసం, తనపక్క, తనతో కూర్చున్న జానకికోసం ప్రాణంకూడా ఒడ్డగలడు అతను. తనకోసం, తన పక్క, తనతో ఉన్న అతని కోసం సర్వమూ అర్పించగలదు ఆమె.

☆ ✱ ★

ఆరోజు అతను అడిగి మరీ ఆమె చేత వీణ పాట పాడించుకున్నాడు.

సాయంత్రం అయ్యేసరికి సినిమాకి బయలు దేరారు. చిన్నాడినీ, చంటిదాన్నీ వాళ్ళ నాయనమ్మ తీసికెళ్ళింది.

హాలు దగ్గరే కాబట్టి నడిచే బయలుదేరారు. బయట మబ్బులు పట్టాయి.

మూడునెలలు తీక్షణంగా ఎండ కాసిన తర్వాత మొదటిసారిగా వర్షం పడింది. పన్నీటి జల్లులా ఉంది వారి ప్రాణానికి.


"ఈ వర్షంలో తడవాలని ఉంది" అంది జానకి.

"భలేదానివే. ఇలా రా" అన్నాడతను.

అతను ఒక కొట్టు మెట్లమీద నుంచుని రిక్షా కోసం చూస్తున్నాడు. ఆమె అతని పక్కనే నుంచుని వర్షంలోకి చేతులు పెడుతోంది."

"ఏం పనులవి? చిన్న పిల్లల లాగా" అన్నాడతను నవ్వుతూ. "నేను చిన్నపిల్లనే. మీరూ చిన్నపిల్లాళ్ళే" అంది జానకి.

తన వయస్సు ముప్పై దాటలేదని



అతనికి తెలుసు. జానకి వయసుకూడా ఇరవై అయిదు దాటలేదని తెలుసు. ఇద్దరూ చిన్నపిల్లాళ్ళే. -అతమా వర్షం లోకి చేతులు పెట్టాడు.

జానకి పక్కకి చూస్తే మొగుడితో వానలో తడుస్తూ పోతున్న సుబ్బి కని పించింది. దాన్ని పిలిచి "రేపటినించీ పనిలో జేరు. ఇంకో రూపాయి ఎక్కువ ఇస్తాలే" అంది. "అలాగేనమ్మా" అంది అది కృతజ్ఞతగా చూస్తూ, దాని మొగుడు కూడా జానకికి దణ్ణం పెట్టాడు. తర్వాత సంతోషంగా వెళ్ళి పోయారు.

రిక్షా వచ్చింది. జానకీ, రాజారావు ఇద్దరూ అందులో కూర్చున్నారు. "వెంకటేశ్వరా టాకీసుకి పోనీ" అన్నా డతడు.

బయట హోరున వర్షం పడు తోంది.


"చలేస్తోంది" అన్నాడతను.

"మరేపాపం" అంది జానకి.

"పాపం కాదు పుణ్యమే! పురు షార్థం కూడను" అంటూ దగ్గరికి తీసు కున్నాడు. -ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగి అతుక్కు పోయింది.

రిక్షా వరవళ్ళు తొక్కుతూ ముందుకు సాగింది.

***



సింహం, మొసలి

ఒకనాడు సింహం సముద్రతీరాన పచార్లు చేస్తోంది. ఇంతలో దానికి ఒడ్డున నీటిలో తేలియాడుతున్న మొసలి కనబడింది. దాన్ని ఆశ్చర్యంగా చూసి "ఎవరోయ్ నువ్వు?" అని అడిగింది సింహం.

"నన్ను మొసలి అంటారు. ఈ సముద్రానికి నేనే రాజును," అంది మొసలి.

"చాలా బావుంది. నేనేమో అరణ్యానికి రాజును. నువ్వేమో సముద్రానికి రాజువు. మనిద్దరం స్నేహం చేద్దాము. మనిద్దరం కలిస్తే మన్ని జయించేవాడు లోకంలో వుండడు" అంది సింహం.

"దానికేముంది, అలాగే స్నేహం చేద్దాం" అంది మొసలి.

నాటి నుంచి సింహం రోజూ ఒకసారి మొసలిని చూడ్డానికి వచ్చి, కుశలప్రశ్నలు వేసి, కబుర్లు చెప్పి పోతూ వుండేది.

ఒకనాడు సముద్రతీరానికి ఒక ఏనుగు వచ్చింది. అరణ్యానికి నేను రాజునంటే నేను రాజునని సింహానికి, ఏనుగుకీ మాటా మాటా వచ్చి దెబ్బలాటలోకి దిగింది. చాలాసేపు పోరాటం జరిగింది. సింహం అలిసి పోయింది.

ఒడ్డున నీటిలోనుంచి ఈ యుద్ధమంతా చూస్తున్న మొసలితో "అలా చూస్తూ వూరుకోకపోతే నాకు కాస్త సహాయం చేయరాదా? మనం స్నేహితులం కదా?" అని అడిగింది సింహం.

"నీకు సాయం చేయాలనేవుందిగాని, చేయలేను. నా ప్రతాపమంతా నీటిలోనే; నేలమీద కాదు," అని లోపలికి పోయింది మొసలి.

అందుచేతే, స్నేహితులను ఎంచుకునేటప్పుడు వారి మంచితనాన్నే కాదు, అర్హతలను కూడా చూసి మరీ ఎంచుకోవా లంటారు.

(గత సంచిక తరువాయి)



యద్దనపూడి సులోచనారాణి

49

ఆ రోజే సిస్టరు వచ్చేది. సంధ్య బాబుకి బట్టలవీ వేసి సిద్ధంచేసింది. హాల్లో కూర్చుని రాబోయే సం యెదురు చూస్తున్నారు. ం అయింది. పొద్దు పూరిగా ంతో యిల్లంతా సంధ్యా చుకున్నాయి.

రాక్రేమెందుకో!" అంది ఆయా ఆ గారుగా కాస్త పైకే అనేసుకుంది.

"రావద్దూ! మరీ అంత తొందర అయితే ఎలా?" పరధ్యానగా ఆలోచిస్తూనే అంది సంధ్య. అంటుండగానే వాకిట్లో కారు హారన్ వినిపించింది.

"అదుగో! వచ్చేసినట్టున్నారు." ఆయా తొంగిచూస్తూ అంది.

సంధ్య కూడా బాబునెత్తుకుని బైట వరండాలోకి వచ్చింది. నల్లటి కారు లోంచి దబ్బపండులాటి ఛాయలో, పాదాలవరకూ జీరాడుతున్న తెల్లటి యూనిఫాంమ్‌తో, మెళ్లో వ్రేళ్ళాడుతున్న పెద్ద క్రాస్‌తో సిస్టరు దిగింది. సంధ్యచెప్పగానే బాబు చెయ్యివూపాడు. ఆవిడకూడా ఎడంచెయ్యి వూపుతూ నవ్వుతూ మెట్లెక్కి వస్తోంది. సంధ్య చిరునవ్వుతో బాబుని ఎదురు తీసుకెళ్ళింది.

"అయ్యో! ఖర్మ!" వున్నట్టుండి సంధ్య చేతుల్లోంచి బాబుని అందుకుంటున్న సిస్టర్ సంధ్యవైపు చూస్తూ 'నిన్నెక్కడో చూశాను' అంది.

సిస్టర్ని అప్పటికే పరీక్షగా చూసి గుర్తుపట్టిన సంధ్య ముఖం వెంటనే పాలిపోయింది.

సిస్టర్‌కికూడా గుర్తు వచ్చేసింది. నమ్మలేనట్టుగా "అరే! నువ్విక్కడున్నావా?" అంది ఆశ్చర్యంగా.

సంధ్య మాట్లాడలేదు. ఆవిడవైపు అలాగే చూస్తోంది. సిస్టర్ ముఖంమీద పాత జ్ఞాపకాలు ఎన్నెన్నో నాట్యం చేయసాగాయి. ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్న సాయంత్రం హఠాత్తుగా భయంకరమైన స్మృతులతో వడిలి వాడిపోయింది.

"నువ్విక్కడే వున్నావా? మాధవ్ చెప్పనేలేదునాకు?" ఆవిడ బాబునెత్తుకుని మెట్లెక్కి లోపలికివస్తూ అంది.

యాంత్రికంగా ఆవిడ వెంటే లోపలికి వచ్చింది సంధ్య.

"అదేమిటమ్మా! నాకు మాట మాత్రంగానైనా తెలియనీయకుండా దాచుకున్నారు." నిష్ఠూరంగా అంది సిస్టర్. అవెంటనే ఏదో అర్థమైనట్టుగా "ఓహో! తెలిసిందిలే. హఠాత్తుగా నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాలని భార్యాభర్తలిద్దరూ పథకం వేసుకున్నారన్నమాట. అంతేనా?" అంది నవ్వుతూ.

"సిస్టర్! మీరు...మీరనేదేమిటో నాకు తెలియటం లేదు." విషాదం నిండిన కళ్ళతో చూసింది సంధ్య.

"తెలియదా [illegible]! [illegible] చూపించి నీ కొడుకు అని చెప్పినప్పుడన్నా వాడిని ఎవరు పెంచి పెద్ద చేశారో మాధవ్ నీకు చెప్పనేలేదా?"

"సిస్టర్?"

"ఇంతచక్కని రత్నాన్ని మీరంతా అప్పుడలా వదిలేస్తే ధూళిలో కలిసిపోకుండా అంత జాగ్రత్తగా పెంచి పెద్ద జేశానే నేను! నువ్వు కనిపిస్తే నాకు వెంటనే తెలియజేయమని మరీ మరీ అతనికి చెప్పానే! ఒక్కచిన్న."

"సిస్టర్!"

"ఇంతకీ మీ యిద్దరూ ఎలా కలుసుకున్నారు? ఎప్పుడు కలుసుకున్నారు?" సరిగ్గా సంధ్యవైపు చూడకుండానే బాణిని పలకరిం[illegible] ప్రశ్న పెట్టింది.

జరిగిన కథ

పుణ్యానికిపోతే పాప మెదురవుతుందట. ఒకానొక భయంకర రాత్రి ఆపదలో చిక్కుకున్న సంధ్య అనే యువతికి సహాయపడబోయిన మాధవ్‌ను ఆమె అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ దర్పాన్ని కొన్నేళ్ళకి ఆమె అందిన హైట్లో ఒంటరిగా తారసిల్లుతుంది. అతనిలో ఆమెపై పగ పెల్లుబికి ఆమెను మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఆ సంధ్యే అతడు నివసిస్తున్న వూరిలో తటస్థపడుతుంది. తన జీవితంలోకి మళ్ళీ మళ్ళీ ప్రవేశిస్తూ, తనపై విపరీతమైన ద్వేషం చూపుతున్న ఆమెను తనదిగా చేసుకోవాలని యత్నిస్తాడు. కుంటివాడైన ఆమె తమ్ముడు వాసుకు, కాలు నయంచేస్తాడు. తనవల్ల ఆమెకు జన్మించిన కుమారుడు ఎవరివద్దనో పెరుగుతున్నట్టు తెలుసుకుని వాడిని ఇంటికి తీసుకువస్తాడు కాని ఆ పిల్లడు తన వాడేనని సంధ్యకు తెలియదు

వాడి బుగ్గ గిల్లుతూ "చూశావా బాబూ! మీ అమ్మా నాన్న చేసినపని. నా అంతట నేను రాకపోతే నాకీ సంగతి తెలిసేదే కాదేమో కదూ! నా బంగారు బాబు స్వంత తల్లీ తండ్రి దగ్గర వాళ్ళకంటి వెలుగుగా పెరుగుతున్నాడంటే-"

"సిస్టర్." అసహనంగా అరిచింది సంధ్య. "మీరనేదేమిటో నాకు తెలియదు. బాబు మాధవ్ కొడుకు కావచ్చు. వాడి కన్నతల్లిని నేను కాను-కాను." సంధ్య ఆవేశంగా అంటున్న ఆధోరణి చూసి సిస్టర్ తెల్లబోయింది. బాబుని ఒళ్ళోంచి దింపుతూ "ఏమిటి నువ్వనేది?" అంది.

"వాడు మాధవ్ కొడుకు. నా తిండీ బట్టా జరుగుబాటు కోసం వాడికి చాకిరీ చేసే నౌకరుని మాత్రమే. మీరు ఎందుకో ఎలాగో పొరపాటు పడుతున్నారు. నేను వాడికి ఆయాని. అంతకంటే మా ఇద్దరి మధ్యా ఎలాటి బంధం గాని, మమత గాని లేవు."

సిస్టర్ "ఏమిటేమిటి" అన్నంత ఆశ్చర్యంగా చూసింది.

తన ఆవేశానికి తనే క్షణంసేపు సిగ్గుపడిన సంధ్య కళ్ళు దించుకుని మెల్లగా "మీ హాస్పిటల్‌కి వచ్చే ముందుగా ప్రారంభమైన నా దురదృష్టం రోజు రోజుకీ పెరిగింది. మా పరిస్థితులు చాలా తారుమారయినాయి. నేనిప్పుడు ఇక్కడ జీతంకోసం పనిచేస్తున్నాను."

"అంటే- వీడు నీ కొడుకని నీకింత వరకూ తెలియనే తెలియదా?"

"సిస్టర్!" సంధ్య కొరడా దెబ్బ తిన్నదానిలా చివ్వున ముఖం ఎత్తింది.

సిస్టర్ సంధ్య కళ్ళలోకి లోతుగా చూసి దేనికోసమో వెతుకుతున్నట్టుగా "మాధవ్ చెప్పనేలేదా? కన్నతల్లిని కొడుక్కి ఆయాగా వుంచే ఘనుడా అతను! అతన్ని చూస్తే నాకసలు అలాటి అనుమానమే రాలేదే?-" అంది.

సంధ్య ముఖం జేవురించింది. "ఇప్పటికి కనీసం నాలుగు సార్లన్నా చెప్పాను. వాడికి- నాకు-" వాక్యం పూర్తి కానేలేదు. సిస్టర్ అంది. "సంధ్యా! బాబుకి మాధవ్ తండ్రి అవునో కాదో నాకు తెలియదు. కాని వాడు నీ కొడుకే-" అంటుండగానే ఆవిడకేదో అనుమానం వచ్చినట్టుంది.

"అసలు ఆ టైమ్‌లో నీకు పుట్టిన శిశువు బ్రతికున్నట్టు నీకు తెలుసా?" అంది.

"సిస్టర్ ప్లీజ్-" సంధ్య ఒంట్లో వున్న రక్తం అంతా ఒక్కసారి ముఖంలోకి పొంగింది.

"మీ పని మనిషికి తెలుసే." సిస్టర్ ఆయాకోసం చూసింది.

"ఆయాకి తెలుసా?" సంధ్య ప్రాణం అంతా చిక్కబట్టుకుంటూ ఆయాకోసం వెతికింది. కాని ఆయా ఆ చుట్టు ప్రక్కల ఎక్కడా వున్న సవ్వడిలేదు. సిస్టర్ని చూడగానే లోపలికి పారిపోయినట్టుంది.

"ఇలా కూర్చో. మొదట నాకిది చెప్పు. మాధవ్, నువ్వు పెళ్ళి చేసుకోలేదా?

లేదులేదన్నట్లు కంపరంగా చూస్తూ తల తిప్పింది.

"బాబెవరో నీకిన్నాళ్ళనుంచి అతను చెప్పనేలేదా?"

చెప్పలేదన్నట్లు చూసింది.

"నువ్వీయింట్లో నిజంగానే ఆయాగా వుంటున్నావా? నాకు ఆయానంటూ వుత్తరం వ్రాసింది నువ్వే!"

"అవును."

సిస్టర్ రెండునిముషాలు రెప్పవాల్చకుండా సంధ్యవైపు చూసింది.

గదిలో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది.

పాలిపోయి నిర్జీవంగా అయిపోయిన సంధ్య ముఖం చూడగానే సిస్టర్ హృదయం దయతో సానుభూతితో కరిగిపోయింది. కంఠం తగ్గించి మెల్లగా అతి మృదువుగా. "వాట్ ఎ పిటీ మై చైల్డ్! నేనిక్కడికి వచ్చేముందు యిన్నాళ్ళ తర్వాత నిన్ను చూస్తానని గాని, యిదంతా మళ్ళీ గుర్తుకు తెచ్చి బాధ కలిగిస్తానని కల్లోకూడా అనుకోలేదు. ఎంత చిత్రం! అసలు జీవితంలో భయంకరమైన అనుభవాలు రానే కూడదు. ఒకవేళ వచ్చినా వాటిప్రసక్తి అంతటితో అంతమైపోవాలి. మళ్ళీ మళ్ళీ తలుచుకునే స్థితి వస్తే మనిషి మానసికంగా ఎంత ఆవేదనకి గురి కావల్సివస్తుందో నాకు తెలుసు. బాబు యింత ఆరోగ్యంగా, ముద్దుముచ్చటతో పెరగకపోయినా, నువ్విక్కడ లేకపోయినా ఇదంతా నీకు తెలిపే అవకాశం వచ్చేది కాదేమో!" సిస్టర్ చెప్పటం ప్రారంభించింది.

అప్పుడు నీకు పుట్టినశిశువు బ్రతుకుతాడని మేమెవరం అనుకోలేదు. కొన వూపిరి ఎక్కడో రెపరెపలాడుతోంది. బ్రతికేఆశ లేదు కాబట్టి అసలే అనారోగ్యంతోవున్న నీకు యీ విషయం చెప్పద్దని మీ నాన్న కోరారు. నేను ఒప్పుకున్నాను. ప్రసవించిన మరునటి రోజునే మీ వాళ్ళు నిన్ను యింటికి తీసుకెళ్ళారు. పూర్తిగా ప్రాణం పోని పిల్లాడిని చూస్తూ చూస్తూ ఎలా వదిలేస్తాం? ఆక్సిజను అదీ యిచ్చి రెండు రోజులు మేం చేయగలిగినదంతా మా ధర్మం నెరవేరుస్తున్నట్లు చేశాం. మూడు రోజులు గడిచేసరికి బిడ్డ వూపిరి తీసుకోవటం నార్మల్ కి వచ్చింది. మరిరెండు రోజులుపోయేసరికి అందరి పిల్లల్లాగే పాలు తాగడం ప్రారంభించాడు. నేను ఎంతో ఆనందంగా మీనాన్నకి ఫోన్ చేశాను. ఆయన మొదట నన్ను చాలాసేపటి వరకూ గుర్తుపట్టనట్టే మాట్లాడారు. ఓపిగ్గా ఫలానా అని చెప్పుకున్నాను.

"బిడ్డ మామూలుగానే వున్నాడు. వచ్చి తీసుకువెడ్తారా" అని అడిగాను.

"తీసుకెళ్ళను." అన్నారాయన ఖచ్చితంగా.

"తీసుకెళ్ళరా? మేమేంచెయ్యాలి?" తెల్లబోయి అడిగానేను.

"ఏంచేద్దామని బ్రతికించారు? అసలు ఆపిల్లవాడు నాకూతురుకన్నవాడే అని నమ్మకం ఏమిటి?"

"సార్ -"

"మాకు సంబంధంలేని పిల్లని

మేమెందుకు తీసుకుంటాం ? ఏంచెయ్యమంటారా అని సలహా అడుగుతున్నారా ?– తీసుకెళ్ళి మూసీనదిలో గిరాటు పెట్టండి" కర్కశంగా అని ఫోన్ పెట్టేశారాయన. నేను అవమానంతో అసహనంతో దహించుకుపోయాను. ఎంత కష్టమైనా సరే పిల్లాడిని తీసుకెళ్ళి నీ మనవడే అని రుజువు చేయాలనే పిచ్చి పట్టుదల వచ్చేసింది. కానీ ఆధారం ఏమిటి ? ఏం చూపిస్తాను. రికార్డ్స్‌లో సంధ్యకి బదులు మారుపేరు చూపారు. దిక్కులేనిఅనాధఅని అక్కడపేర్కొన్నారు. ఆవేశం తగ్గించుకుని ఆ రాత్రంతా నిదానంగా ఆలోచించాను. జాతిమత భేదం గాని, గొప్ప బీద తారతమ్యం గాని, నీతి అవినీతి ప్రసక్తికాని చూడకుండా యీ లోకంలోకి రావాలని తహతహలాడే ప్రాణులకి జీవితం ప్రసాదించటమే కర్తవ్యంగా గల పవిత్రమైన వృత్తిమాది. నేను చిన్నప్పటినుంచి నేర్చుకున్న సత్యాలు, అనుభవంలో పొందిన మానవత్వం గుర్తుకువచ్చాయి. ఆ పిల్లాడిని ఎవరికైనా మంచి దంపతు–





లను చూసి పెంపకోటానికి ఇవ్వాలని నిశ్చయించుకున్నాను. నెల తిరగక ముందే ఒళ్ళు చేశాడు. రెండో నెల వెళ్ళేసరికి మమ్మల్ని చూసి బోసినవ్వులు నవ్వుతూ మా అందరి హృదయాలు ఆకట్టుకోసాగాడు. మూడు నెలలు నిండేసరికి ముఖంలో రూపురేఖలు స్పష్టంగా కన్పించసాగాయి. మరో నాలుగు నెలలు గడిచిం తర్వాత ఒక పని మీద నేను మెడ్రాసు వెళ్ళవలసి వచ్చింది. వెంట బాబునికూడా తీసుకు వెళ్ళాను. అక్కడ నాకు బాగా పరిచితమైన ఒక కుటుంబం వుండి. దంపతులిద్దరికీ పిల్లలు లేరు. ఒకప్పుడు బలవంతంగా గర్భస్రావం చేయాల్సి రావటంతో ఆవిడకి శాశ్వతంగా మాతృత్వం పొందే అర్హత పోయింది. "మంచి

పిల్లాడిని చూడు. మేం పెంచుకుంటాం" అనిభార్యాభర్త లిద్దరూ నాతో స్వయంగా చాలాసార్లు చెప్పారు. బాబుని వాళ్ళ కిద్దామని తీసుకెళ్ళాను. నేను వెళ్ళే సరికి వాళ్ళు యిల్లు ఖాళీచేసి మరో చోటుకి మారారు. ఎంతోకష్టంమీద ఆ అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాను. ఆయన యింట్లో లేరు, ఆవిడ నన్ను చూడగానే ఆనందంగా ఆప్యాయంగా ఆహ్వానించింది. నా వెంట వున్న బాబుని చూసి ఎవరని అడిగింది. నేను వచ్చిన పని చెప్పాను, నేను చెప్పు తుండగానే 'మమ్మీ!' అంటూ రబ్బరు బంతిలావున్న ఓ పిల్లగెంతుతూ పలికి వచ్చింది. ఆవిడ ఆ అమ్మాయిని దగ్గ రకుతీసుకుంటూ 'ఏడాదినుంచి పెంచు కుంటున్నాం. మా స్నేహితురాలి కూతురు.' అంది. నేను నీళ్ళుకారి పోయాను. నేను వచ్చేటప్పుడు బాబు వెంటే తీసుకెళ్ళటానికి సిద్ధమవు తుండగా "సిస్టర్! పిల్లాడు ముద్దుగా వున్నాడు. పోనీ వుండనీ కూడదూ! వాడినికూడా పెంచుకుంటాను. ఒక కూతురు, ఒక కొడుకు అవుతారు" అంది. కాని నేనే యిష్టపడలేదు.

"కన్నతల్లిప్రేమ పుష్పకవిమానం లాటిది. అందులో ఎంతమంది ఎక్కినా మరొకరికి చోటువుంటుంది. పెంచిన ప్రేమ అలాకాదు శారదా! ఒరలాటిది. ఒక ఒరలో రెండు కత్తులు ఎప్పుడూ యిమడవు అన్న సంగతి మన అందరికీ తెలుసు" అన్నాను.

బాబు నా వెంటే వచ్చేశాడు. ఈ కొద్ది నెలల్లోనే వాడు నాకు బాగా అల వాటయిపోయాడు. నన్ను గుర్తుపట్టటం నేర్చుకున్నాడు. ఎవరిచేతుల్లో వున్నా నన్ను చూడగానే ఎగిరి నా చేతుల్లోకి దూకేవాడు. బాబుని నేనే పెంచుకోవా లని నిశ్చయించుకున్నాను. జాగ్రత్తగా మంచి క్రమశిక్షణతో పెంచి పెద్దజేసి "క్రైస్తవ మతబోధకుడిగా తీర్చిదిద్దుతా నని అందరికీ చెప్పేదాన్ని. తర్వాత కొద్దిరోజులకే రజాకార్ మూమెంట్ జరిగింది. ఆ భయంకరమైన వాతా వరణం మారి ప్రశాంతత నెలకొన్న తర్వాత యీ మధ్య కొన్ని మార్పులు వచ్చాయి. బాబు పూర్తిగా నా వాడు అయిపోయాడనే అనుకున్నాను. తీరా ఓ రోజు హఠాత్తుగా ఆ జ్యోతన్న పిల్ల వచ్చి—"

"జ్యోతీ?—"

"అవును. ఆ రెండుజెడల ఎర్రటి పిల్లలేదూ! ప్రసాద్ చెల్లెలు."

సంధ్య యాంత్రికంగా తలూపింది.

"ఆ అమ్మాయి మాధవ్‌ని వెంట పెట్టుకుని వచ్చి ఆసమయంలో మాధవ్ లేకపోవడం వల్ల జరిగిపోయిందని. దీని కంతటికి అతను చాలా బాధ పడ్తున్నా డని చెప్పింది. బాబు యిక్కడ పెరుగు తున్నట్టు ఆమెకి తెలిసిందని ఒక్క సారి చూడాలని కోరుతున్నాడని అంది. మొదట నేను ఏ సంగతి చెప్పలేదు. లక్ష ప్రశ్నలు వేశాను. అన్నింటికి అతికినట్లు జవాబులు చెప్పారిద్దరు. బాబుని చూపించే వరకూ ఆ అమ్మాయి నన్ను వదల్లేదు. బాబుకి మాధవ్ తండ్రి అవటానికి నాకేమంత సందేహం అన్పించలేదు. బాబు పోలికలుఅతనిలో

అంత స్పష్టంగా చూసీ చూడగానే తెలుస్తున్నాయి. బాబుని తీసుకువచ్చి చూపించాను. బాబుని చూడగానే కళ్ళలో తళుకుమన్న కాంతి, వాడిని స్పర్శిస్తున్నప్పుడు అతని ఒళ్ళు గగుర్పొడవడం నేను గమనించక పోలేదు. నీగురించి అడిగితే వివరాలు తెలియవన్నారు. రజాకార్ మూమెంటు జరిగిన తర్వాత మీ కుటుంబం కన్పించలేదంది జ్యోతి. మీ నాన్నగారిని కాల్చేసినట్టు నేను అంత క్రితమే విన్నాను.

కొద్దిసేపు బాబుతో గడిపి యిద్దరూ వెళ్ళి పోయారు. గాపీ గంట దాటకముందే మాధవ్ మళ్ళీ తిరిగి వచ్చాడు. బాబుని తీసుకెళ్తాను యివ్వమన్నాడు. నేను ఒప్పుకోలేదు. వాడిమీద నేను పెంచుకున్న ఆశలన గతి చెప్తూ ఖచ్చితంగా తిరస్కరించాను. చాలాసేపటి వరకూ మాధవ్ ఏం మాట్లాడలేదు. చివరికి లేచి వెళ్ళబోతూ "బాబుని దగ్గరకు తీసుకుని తండ్రిగా యిప్పటికైనా నా కర్తవ్యం నిర్వర్తించుకుని సంధ్యకి జరిగిన అన్యాయం సరిచేసుకోవా లనుకున్నాను. మీరు యివ్వనంటే నేనేం చెయ్యలేను. కానీ ఈ క్షణంనుంచి నా ఆస్తికి వాడే వారసుడు. వాడి చదువు సంధ్యలు. తిండి బట్టా అన్నీ నేనే భరిస్తాను" అన్నాడు. అలా అంటున్న అతని ముఖంలోకి పరీక్షగా చూస్తే నాకెలాగో అన్పించింది. ఎంతయినా వాళ్ళిద్దరూ తండ్రికొడుకులు. వాళ్ళని దూరంచేసే హక్కు నాకులేదేమో! మాధవ్ ముందు అప్పుడప్పుడూ వచ్చి బాబుని అలవాటు చేసుకుంటే తర్వాత చూస్తాను అన్నాను. ఈ లోపల అతని ప్రవర్తన ఎలాటిదో? బాబుకి తండ్రిగా వుండే అర్హత అతనికి వ్యక్తిగతంగా వుందో లేదో నేను కూడా పరీక్ష చేయవచ్చు అనుకున్నాను. మాధవ్ ఒప్పుకున్నాడు. అప్పుడప్పుడు వచ్చేవాడు. బాబుని కార్లో కూర్చోపెట్టుకుని వూరంతాతిప్పి, బొమ్మలు, బిస్కట్లు అవి కొనిచ్చి తిరిగి నాదగ్గరకు తీసుకొచ్చి దింపి వెళ్ళేవాడు. బాబు నేను అనుకున్నదానికంటే త్వరగానే అతని దగ్గర అలవాటయి పోయాడు. మాధవ్ ప్రవర్తన కూడా నచ్చింది. అప్పుడప్పుడు నాదగ్గరకి తీసుకొచ్చి వాడిని చూపించే పద్ధతి మీద చివరికి మాధవ్‌కి యిచ్చేశాను— ఎప్పుడో ఒకసారి మాటలమధ్య నీ ప్రసక్తి వస్తే నీ ఆచూకి తెలియలేదని, నిన్ను భార్యగా పొందలేక పోతే జీవితంలో పెళ్ళి అనేదే లేదని చెప్పాడు." సిస్టర్ చెప్పటం ముగిస్తూ చివరికి "నువ్వు దగ్గరుండి కూడా అతను నీ గురించి చెప్పలేక పోవటానికి కారణం ఏమిటి? అదే నాకర్థం కావటంలేదు" అంది.

సంధ్య సిస్టర్ మాటలు చివరి చివరికి వినటమే మానేసింది. కళ్ళముందు ఎన్నెన్నో దృశ్యాలు కదులుతున్నాయి. బాబుకి అమ్మా అని పిలవమని అతను నేర్పటం, వాడిని కొట్టే హక్కు నీకుంది అనటం, యింకా యింకా ఎన్నెన్నో! మాధవ్ అప్పుడే ఎందుకు చెప్పలేదు? నమ్మనని భయపడ్డాడా? సిస్టర్ని తీసుకువచ్చి ఎందుకు రుజువు చేయలేదు? అంతా నాటకం అని

పిస్తారేస్తుందని అనుకున్నాడా! అసలు విషయం! ఇప్పుడు అనుకోకుండా సిస్టర్ చెప్పబట్టిగాని. లేకపోతే తను నమ్మేదా? ఏమో! అంతా పెద్ద వలయం. ఇందులో చిక్కడిపోయి తను గిరగిరా తిరుగుతోంది. ఏది నిజమో, ఏది అబద్ధమో గ్రహించే శక్తిని మనసు ఎప్పుడో పోగొట్టుకుంది.

"షాకనిపిస్తోందా?—" సిస్టర్ బాయిని దింపి లేచి వచ్చి సంధ్య చేతిని తీసుకుని నాడి చూస్తూ అంది.

సంధ్య ఆవిడనేది ఏమిటో అర్థంగానిదానిలా తలెత్తి అయోమయంగా చూస్తోంది. సిస్టర్ దయగా నవ్వింది.

"సిస్టర్!" సంధ్య ఆవిడ నడుం చుట్టూ చేతులు పెనవేసి డ్రెస్‌లో ముఖం దాచుకుంది.

"ధైర్యం తెచ్చుకో! నాకేంతెలుసు చెప్పు! నిన్నిక్కడ చూసి గుర్తుపట్టగానే మీ యిద్దరూ మేనేజ్ చేసుకున్నారేమో అనుకున్నాను." సంధ్య తల విదురుస్తూ అంది.

సంధ్య ఒక్కసారిగా చిన్నపిల్లలా ఆవిడని కరుచుకుపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. ఎన్ని సంవత్సరాలనుంచి మౌనంగా అనుభవిస్తున్నబాధ. ఈమధ్య మరీ మరీ పడుతున్న ఆవేదన ఒక్కసారిగా కరిగి కన్నీళ్ళయి ప్రవహించసాగినాయి.

★ ★ ★

డ్యూటీ సేపు అయింతర్వాత సంధ్య వంటింటివైపు వచ్చింది. ఆయా సంధ్య రాకని గుర్తించని దానిలా అటుయిటు తిరుగుతూ పనులు చక్కబెట్టుకుంటోంది. ఊపిరి సలపనట్టు చేస్తున్న ఆ వాలకం చూస్తుంటే అది కావాలని పెట్టుకున్న పని అని సంధ్య గ్రహించింది.

పది నిముషాలు గడిచాయి.

చివరికి తనే పిల్చింది.

"ఆయా!"

కడిగిన బియ్యం తీసుకెళ్ళి మసలుతున్న గిన్నెలో వేస్తున్న ఆయా పలకలేదు. కనీసం వెనక్కి తిరిగి చూడనైనా చూడలేదు.

"ఆయా!" మరికొస్త దగ్గరగా పిల్చింది.

నిదానంగా బియ్యం వేయటం పూర్తిచేసి, గరిట కలియతిప్పి, మూతపెట్టి కొంగుతో చేతులు తుడుచుకుంటూ వెనక్కి తిరిగి "ఏమిటి?" అంది. ఆవిడ ఎంత సహజంగా వుండాలని ప్రయత్నిస్తున్నా మనసులో చెలరేగిన కల్లోలం ముడతలు పడిన ముఖంలో తొంగిచూస్తూనే వుంది. బలవంతాన తీరని వ్యధని దిగమింగటానికి ప్రయత్నిస్తున్నట్టుగా వున్న చిన్న చిన్న కళ్ళు కుచించుకుపోయి మరీ చింతాకంతగా అయినాయి.

"ఆయా! ఇది — యిది నిజమేనా?—"

"ఏదీ?—"

సంధ్య ముఖం ఎర్రబడింది. అయినా నిగ్రహించుకుంటూ "బాబు—" అన్నీ పూర్తి చేయలేక పోయింది.



"వాడి సంగతి ఎందుకు చెప్పలేదు అని నన్ను ఇప్పుడు నిలదీస్తున్నావు. అంతేనా ? యిన్ని సంవత్సరాల తర్వాత నీ ముందు నిలబడి జవాబు చెప్పాల్సి వస్తుందని నాకు జోస్యం తెలియలేదు. మీ నాన్నగారు చెప్పొద్దన్నారు. చెప్పలేదు. ఆయన ఒకసారి ఆజ్ఞాపించటం జరిగితే అది కల్లోకూడా వుల్లంఘించకూడదు అన్న సంగతి నీక్కూడా తెలుసు."

"కానీ-ఆయా." సంధ్య వాదనకి దిగబోతుంటే ఆయా మధ్యలోనే వారించేసింది. "అయినా నాకెలా తెలుస్తుంది ? సన్నగా పుల్లల్లా వున్న కాళ్ళు చేతులతో, చూసేవాళ్ళ ఒళ్ళు జలదరించేలా రక్తపు గుడ్డులా వున్న ఆ మాంసపు ముద్ద యీ బంగారు బాబేనని నేనేం కలగన్నానా ! అప్పట్లో ఆ నర్సులు వాళ్ళు ఆ ప్రాణి ఒకటి రెండు రోజులుకంటె ఎక్కువ బ్రతకదని ఖచ్చితంగా చెప్పారు. అయినా అప్పుడు మా దృష్టి అంతా నీ ఆరోగ్యం మీదనే వుంది " అనేసి మళ్ళీ తనపని చూసుకోసాగింది ఆయా. ఎప్పుడూ యింతనిక్కచ్చిగా, విసురుగా మాట్లాడటం చూడని సంధ్య తెల్లబోయి చూడసాగింది.

మళ్ళీ నిశ్శబ్దం ఏర్పడింది.

చివరికి సంధ్య మళ్ళీ తనే అడగలేక అడిగింది. "ఆయా ! పోనీ మాధవ్ నీకెప్పుడైనా ——"

"చెప్పలేదు. కనీసం బాబు ఎవరో అనుమానం కలిగేలా కూడా ప్రవర్తించలేదు. అతని సంగతి వదిలేయ్, మగవాడు. ఏం ? నువ్వుమాత్రం ? మాధవ్ ఎవరో చూచాయగానైనా ఎప్పుడైనా మాటలమధ్య సూచనగానైనా తెలియజేశావా ? చిన్నప్పటినుంచి కన్నతల్లి కంటే ఎక్కువగా పెంచిపెద్దచేశావే ! నా ఆలోచన్లు, నా జీవితం నీ చుట్టు అల్లుకుని బ్రతుకుతున్నానే ! ఈ ప్రపంచంలో అన్నింటికంటె నీ క్షేమం, నీ సుఖం నాకు ముఖ్యం అని నేను కోరుకునే సంగతి నీకు తెలియదా ? అలాంటిది—— ఒక్కరోజు —— ఒక్కసారయినా నీ బాధ ఏమిటో నాకు చెప్పావా ? ఎన్ని రాత్రుళ్ళు, అర్థరాత్రి వేళ ప్రక్కనున్న నాకు ఎక్కడ మెలకువ

వస్తుందోనని, బోర్లాపడుకుని, దిండులో ముఖం దించుకుని ప్రక్కలదిరిపోయేట్టు నువ్వు వెక్కి వెక్కి ఏడవటం నేను చూడలేదు? ఎన్నిసార్లు నన్ను మభ్యపరచటానికి ఏదో పుస్తకం చదివే నెపంతో మారుమూలపోయి కూర్చుని, శూన్యంగా చూస్తూ, అశాంతిగా, నిర్జీవంగా కూర్చుని గంటలు గడపటం నేను గ్రహించలేదు? అయినా నేనేం చేయగలను? చూస్తూ వూరుకోలేక, నిన్ను పెద్దరికంతో ఆజ్ఞాపించలేక నేనెంత క్షోభకి గురి అయ్యానో, అవుతున్నానో నీకెలా తెలుస్తుంది? నేనసలు నీకంటికి సాటి మనిషిగా కన్పిస్తేగా! మాటామంతి లేకుండా పనీ పాటా చేసుకుపోయే ఒక మరగా తప్పితే?—"

"ఆయా!" బొమ్మలా నిలబడి కళ్ళప్పగించి చూస్తున్న సంధ్య హఠాత్తుగా అరిచింది.

సంధ్యవైపు వీపు పెట్టి నిలబడిన ఆయా ఆ కేకని లక్ష్యపెట్టలేదు. చీర చెంగుతో కళ్ళు గట్టిగా ఒత్తుకుంటూ - నువ్వు వర్షంలో తడిసినప్పుడు వచ్చిన జ్వరంలో నీ మాటల ధోరణి, నేను, వాసు ఎక్కడ వింటామోనని మమ్మల్ని దూరంగా పెట్టి అహర్నిశలూ ఆయనే వుండాలని ప్రయత్నించటం, ఆయన నీడని చూసినా నువ్వు అసహ్యించుకుని, ద్వేషించటం ఇదంతా చూస్తే నాకప్పుడే అనుమానం వచ్చింది. నా చూపుల్లో సందేహం ఆయన పసిగట్టారు. అయినా ఒక్క మాట మాట్లాడలేదు. నన్ను మాట్లాడనివ్వలేదు."

సంధ్య వూపిరి బిగపట్టి వింటోంది.

"బాబు ఎవరో అప్పుడు నాకు తెలియకపోయినా, అతని ఉనికి మాధవ్ జీవితంలో అంతగా స్థానం లేదని, అతని ధ్యాసంతా నీ మీదనే వుందని, నువ్వే అందరికంటే ఆయనకి ఎక్కువ అని గ్రహించడం ప్రారంభించిన తర్వాత అతన్ని ఇలా కర్కశంగా తిరస్కరించవద్దని నిన్ను ఎన్నోసార్లు హెచ్చరించాలనిపించింది. కానీ నాలిక చివరిదాకా వచ్చిన మాటలు పెదవులుదాటే ధైర్యం లేకపోయింది. ఎందుకని? నువ్వెంత చనువు యిచ్చినా, ఎంత ఆప్యాయంగా చూసినా అప్పుడప్పుడు యజమానిని అనే స్వభావం మాటల్లోనో, చేతల్లోనో ప్రదర్శిస్తూనే వుంటావు. అందుకే సాహసించలేక పోయాను."

"ఆయా!" సంధ్య పిలవలేక పిలిచింది.

"ఎప్పటికైనా నీ అంతట నువ్వే ఆయన్ని గుర్తిస్తావని మీ యిద్దరూ జీవితాలు కలుపుకుని ఒక కుటుంబంగా బ్రతుకుతుంటే - మిమ్మల్ని చూచుకుంటూ, మీ నీడలో బ్రతుకుతూ, బాబుని పెంచుతూ నా చివరి దినాలయినా నిశ్చింతగా వెళ్ళదీసుకోవచ్చని ఏవేవో అనుకునేదాన్ని. అదికూడా యీ మధ్య అడియాసేనని తేలిపోయింది. బాబు నీకు పుట్టిన బిడ్డేనని సిస్టర్ చెబుతుంటే నీ సంగతేమోగాని. నా మతి ముందే పోయింది. ఆనందం, ఆశ్చర్యం

యింకా ఎన్నెన్నో అన్పిస్తున్నాయి. నేనింకా అది నిజమేనని నమ్మలేక పోతున్నాను. అప్పుడే ఆ శిశువు ఏమయిందో తెలుసుకోవాలని నాకు ఆరాటంగానే వుంది. మీదానిని హాస్పిటల్‌కి వెళ్ళి కనుక్కురమ్మనమని పోరు తూనేవున్నా. కాని వ్యవధానం ఏది? అప్పుడె ఆ కొల్పులు, ఆ చావులు—" మండుతున్న పొయిమీద దృష్టి నిలిపి నిలబడిన ఆయా కంఠంఅప్పటికే బాగా తగ్గి గద్గదికమై మాటలు పెగలలేదు. చటుక్కున వెనక్కు తిరిగి సంధ్య వైపు చూస్తూ రెండు చేతులు జోడించి ఏడుస్తూ "సంధ్యా! నీకు పుణ్యం వుంటుంది. నీ కాళ్ళు పట్టుకుంటాను. అవన్నీ మళ్ళీ నాకు గుర్తుచేసి నన్ను చంపకు. నేను భరించలేను. నాకు శక్తి లేదు" అంది.

సంధ్య నిద్రలో లేచి నడుస్తున్న దానిలా తడబడుతున్న అడుగులతో మెల్లగా ఆయా దగ్గరగా వచ్చింది. ఆయా జీర్ణించివున్న చేతుల్ని రెండు చేతుల్తో పట్టుకుంటూ 'నన్ను - నన్ను క్షమించు' అంది. "వద్దులే. అంతలేసి మాటలనకు." సంధ్య చేతుల్ని విడిపించుకుని కళ్ళు తుడుచుకుంటూఅంది.

పాలిపోయిన ముఖంతో ఆయా చేతిని గట్టిగా తనరెండు చేతులమధ్య పట్టుకుని అంది సంధ్య: "నేను పాషాణంలా ఎందుకు మారిపోయానో నీకుతప్ప యింకెవరికీ తెలియదు. ఆయా! నేను నిజంగా స్వార్థపరురాలినే! ఆ బాధలో, ఆ వ్యధలో నా కోసం బాధపడుతున్న ఒక జీవి మూగగా నావెంటేవుందని గ్రహించలేని గుడ్డిదాన్ని అయ్యాను. అదినా పొరపాటే. ఆ మూర్ఖత్వానికి మన్నించు. నా ఆవేదన ఏదీ నీకు చెప్పక పోవటానికి కారణం నువ్వు పరాయి వ్యక్తివి, పనిమనిషివి అన్న నీచభావం కానేకాదు. ఇప్పటికీ నా గొడవలతో, మా యిద్దరి భారంతో నీ మెడలు క్రుంగదీస్తున్నాము. వాసు, నేను నీ మెడకి గుదిబండలుగా లేకపోతే, యీ యింటి పనికి యింకెక్కడైనా నీ తనువు హాయిగా సుఖంగా వెళ్ళిపోయేది. కన్నతల్లి ఎలాటిదో నాకు తెలియదు. ఒకవేళ వున్నా నువ్విచ్చిన ఆప్యాయత కంటే ఎక్కువ యిచ్చేదికాదు. ఆసంగతి నాకుతెలుసు. మాకోసం ఇంత చేస్తున్న నీకు ఈ వృద్ధాప్యంలో కాస్త సుఖాన్ని కలిగించే యేపనీ చేయలేక పోతున్నానే అని నేను పడిన బాధ. అంతే. అంత కంటే యింకేంకాదు. నిర్లక్ష్యం అసలేకాదు. నన్ను నమ్ము."

"సంధ్యా!" ఆయా చప్పున సంధ్యని దగ్గరకు లాక్కుని అక్కున చేర్చుకుంది. సంధ్యకి ఏడుపుముంచుకు వచ్చేసింది.

"నువ్వు నన్ను కన్నతల్లిలా చూస్తున్నావు. నిజమే. కానీ కన్నబిడ్డగా నీ పట్ల నా కర్తవ్యం నేను నెరవేర్చుకుంటున్నానా? లేదు. ఆదే నాబాధ. నా యీ అశక్తతకి, దురదృష్టానికి బాధపడని క్షణంగాని, సిగ్గుపడని నిముషంగాని లేదు. అంతే తప్ప—" అప్పటికే ఆయా సంధ్య తలని గుండెలకి

నొక్కుకోవటంవల్ల సంధ్య పూర్తి చేయలేక పోయింది.

"సంధ్యా! నా తల్లీ! నేనే పొరబడ్డాను. యీ ముసలిగాని మాటలు పట్టించుకోకు. దీన్ని గురించి నువ్వింకేమీ మాట్లాడవద్దు. నువ్విది మనసులో వుంచుకున్నావంటే నా మీద ఒట్టే. ఈరోజుతో, ఈక్షణంతో జరిగిందంతా మర్చిపోదాం. మర్చిపోతేనే తప్ప బ్రతకలేనంత భయంకరమైన బాధలకి గురి అయ్యాం. వాటి మూలంగానే ఎవరికి వాళ్ళే వంటరితనపు గోడలు చుట్టూ కట్టుకుని సమాధుల్లో శవాల్లా యిన్నాళ్లా గడిపాం. అవన్నీ యీరోజుతో సరి. లేకపోతే రేపటి రోజుని, రాబోయే భవిష్యత్‌ని కూడా యిలాగే శూన్యం చేసుకోగల ప్రమాదం వుంది."


"ఔను ఔను. నేనుకూడా భరించలేను." వెక్కిళ్ళమధ్య అస్పష్టంగా అంది సంధ్య. మూసుకున్న కళ్ళ ముందు ఆయా గుండెల మీదుగా ఎన్నెన్నో దృశ్యాలు గబగబా తిరుగుతున్నాయి.

అర్థరాత్రి. నిశ్శబ్దం. ఉన్నట్టుండి కేకలు, పరుగులు, తలుపులు విరగదన్నిన చప్పుడు. ఇంట్లో తుపాకులు ధరించిన సిపాయిల బూట్ల శబ్దం. తండ్రి లేచి తుపాకి పుచ్చుకుని ఎదురు వెళ్ళటం. "ఒక్కడుగు ముందుకు వేశారా ఛస్తారు." అయన వుర్దూలో గర్జించడం. అ గర్జన సాంతం ముగియక ముందే తుపాకులు మోగినశబ్దం. వున్నట్టుండి కెవ్వుమన్న కేక. ఆ కేక వేసింది ఎవరో తెలుసుకోలేకుండా చేసే పొగ. పొగ తేలిపోయేసరికి ఛాతీమీద దెబ్బ తగిలినచోట రెండు చేతుల్తో పట్టుకుని బంతిలా దొర్లిపోతున్న తండ్రి. తనలా చూస్తుండగానే ఆయన కనుగుడ్లు రెండు మూడుసార్లు తిరిగి మరు క్షణంలోనే నిర్జీవం అయిపోవడం. కెవ్వుమని అరవబోతే ఆయా చప్పున నోరుమూసి ప్రక్కకు లాగడం, తన నోరు గట్టిగా రెండు చేతుల్తో మూసుకుని బిగ్గరగావచ్చేఏడుపుని నిగ్రహించుకోటానికి ప్రయత్నిస్తుండగా ఇంతలో గదిలోకి దాదా పరుగెత్తుకు వచ్చి ఆయాతో "పిల్లల్ని తీసుకుని తోటలోకి పారిపో! ఉత్తరంవైపు పొండి. నేను వాళ్ళు అటురాకుండా చూస్తుంటాను." అని మెరుపులామళ్ళీ బైటకి పరుగెత్తటం, ఆయా, తను, వాసు ప్రాణాలుఅరచేతుల్లో పెట్టుకుని చీకట్లో తోటలో చెట్లకి అడ్డంపడి పరుగెత్తటం. చివరికి వుత్తరంగావున్న ప్రహరీగోడని చేరుకుని ఎలాగో కష్టపడి దానిమీదకి ఎక్కి అవతలకి జారుతుంటే, చులాగ్గా దూకాలని ప్రయత్నించిన వాసు ఆ భయంలో, ఆ ఖంగారులో కాలు పట్టుదప్పి దభిల్లుమని నేలమీద కుప్పలా కూలబడిపోవటం, ఆ వెంటనే లేవబోయి 'అమ్మో' అని క్రిందకి ఒరిగిపోవటం. ఆయా, తను వాడి నోరుమూసి యిద్దరూ చెరో రెక్క పట్టుకుని, వాడు బాధతో విలవిలలాడ్తూ 'నన్ను ముట్టుకోవద్దు.

నా ప్రాణం పోతోంది' అన్నట్టు గిలగిలా తన్నుకుంటున్నా లక్ష్యపెట్టకుండా తడుపటి చీకటిగావున్న ప్రదేశంలో యిప్పుడో, మరికాసేపటిలోనో మీదబడి కబళించబోయే మృత్యువు కోసం ఎదురుచూస్తూ భయంతో గోడకి బల్లిలా అంటుకునిపోయి, చెమటలు కక్కుతూ నిలబడటం. ఇంతలో అంత దురదృష్టంలోనూ అదృష్ట దేవత ఆప్యాయంగా చిరునవ్వు నవ్వింది అన్నట్టు ఆయాకి తెలిసిన సిపాయే ఒకడు అటువైపు రావటం, అతను గుర్తుపట్టి ఎలాగో అతి ప్రయాసమీద ప్రాణాలకి తెగించి తమకి సాయంచేసి సురక్షితమైన ప్రదేశానికి చేర్చటం, ఆ తెల్లవారుఝామున అతనే మళ్ళా వచ్చి దాదా కూడా చనిపోయాడని చెప్పటం, ఆయా ఒక్కసారి బావురుమంటుంటే తను దగ్గరకు తీసుకుని ఆవిడని సముదాయించటం. యింకా యెన్నెన్నో! సంధ్య అంత ఏడుపులోనూ తల గట్టిగా అటుయిటు తిప్పుతూ "వద్దు. వద్దు. నేను భరించలేను. నాకూడా పిచ్చెక్కేట్టుగా వుంది" అంది.

చాలా రోజుల తర్వాత, అలా పసిపిల్లలావచ్చి తనని పెనవేసుకున్న సంధ్యని చూడగానే క్రమేపి ఆయా హృదయంలో అశాంతి తొలగి కళ్ళలో ఆనందాశ్రువులు నిండుకో సాగినాయి.

(సశేషం)





పాపం రామనాథం

ఎం. వెంకటేశ్వరరావు

"ఏమండీ!—"

ఆఫీసుకు వెళ్ళబోతున్న మూర్తి వీధి గుమ్మంలో ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"ఓ అయిదు రూపాయలు కావాలి—" అని అడిగిన రాధ ముఖంలోకి యెందుకన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూశాడు.

"కావాలి!—" ముసి ముసిగా నవ్వింది. తనూ నవ్వాడు మూర్తి. ఒక్క క్షణ కాలంపాటు వారిపెదాలపై చిరునవ్వు తొణికిసలాడింది.

"ఇంట్లోకి కావలసినవి అవసరమైతే నేనే తెస్తాను. మరి నీకు డబ్బుతో పనేముంది? అడగ్గానే ఇవ్వటానికైనా ఇవాళ తారీఖు ఇరవై యెనిమిది—" అంటూ గుమ్మం దాటాడు మూర్తి.

పక్క వాటాలో అద్దెకున్న — శేఖరంగారి భార్య — రాజ్యం యెదురు పడింది. రాధకోసం వెడుతున్నదని మనసులో అనుకుంటూ మెట్ల దగ్గర ప్రక్కగా తప్పుకొని దారి నిచ్చాడు.

చటుక్కున ఏదో జ్ఞాపకానికి వచ్చిన వాడిలా వెనక్కు తిరిగి, అంతవరకు గుమ్మంలో నిలబడ్డ రాధతో "అంతగా అవసరమైతే సాయంకాలం వచ్చిన తర్వాత ఇస్తాను.... అదైనా ఎందుకో చెప్పాలి—" అని అన్నాడు.

"సార్! అయ్యగారు రమ్మంటున్నారు—" అన్న ప్యూన్ పుల్లారావు మాటలకు అంతవరకు కథ చదవడంలో నిమగ్నుడైన రామనాథం వీక్లీని పక్కన పడేసి "ఇపుడేగా ఆయన దగ్గర్నుంచి వచ్చింది. ఈ లంచ్ టైంలో కూడా ఏమంత అర్జంటొచ్చింది?" అని విసుక్కుంటూ లేచాడు.

ఆ ధోరణికి పుల్లారావాశ్చర్య పోయాడు. ఆయన అలా కబురంపగానే మరుక్షణంలో ఈయన ఆయన ముందు చేతులు కట్టుకొని ప్రత్యక్షం కావడం పరిపాటే! ఒక్కొక్కసారి అర్ధగంటకు లోపుగా ఆఫీసర్ రూమ్‌లోనుంచి బయటకు వచ్చేవాడు కాదు. అంతవరకు బస్సులో ప్రయాణం చేసే స్టాండింగ్ ప్యాసింజెర్‌లా నిలబడే వుండేవాడు. వెడుతున్న బస్సు మధ్యలో బ్రేకు పడినప్పుడల్లా వెనక్కు ముందుకు ఊగులాడే స్థితినికూడా ఆ గదిలో వున్నంతసేపు - ఆఫీసరు ముందున్న ఫైల్సులోకి తొంగిచూస్తూ కొంతసేపు, నిలబడి కొంతసేపు — అనుభవించేవాడు. ఇంతవరకు ఒక్కసారైనా రామనాథం నిరసన భావం ప్రకటించగా ఎవరూ చూడలేదు. అటువంటి రామనాథం అలా విసుక్కోవటం పుల్లారావుకు నిజంగా ఆశ్చర్యమేసింది.

మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంటూ "ఆఁ ఏమీలేదు. వడ్లగింజలో బియ్యపుగింజ. రేపు పబ్లిక్ హాలీడే గనుక ఆఫీసు శెలవని నోటు పంపించమన్నారు—" అని అన్నాడు; వీక్లీని అందుకున్నాడు.

ఇంతకు ముందు రామనాథం విసుక్కున్నందుకు కారణం 'ఇదాఅన్నట్లు' వీక్లీవైపు చూసి వెళ్ళిపోయాడు ప్యూన్.

చదివిందే చదివి మధ్య మధ్యలో ఆలోచిస్తూ పది నిముషాల్లో కథ చదవడం పూర్తిచేశాడు. రచయిత పేరు చూశాడు. 'రమణి' అని వుంది. ఆ పేరుతో ఇంతకు ముందెక్కడా ఏ రచనా ప్రచురించినట్లుగా చూడలేదు. కథలో వ్యక్తులు మూర్తి, రాధ, రాజ్యం.

కథలోని సంఘటనలన్నీ తన స్వానుభవం లోనివి: మూర్తి పాత్ర తనకు ప్రతిబింబం.

కథానాయిక రాధ మాదిరిగానే తనను రాజ్యలక్ష్మి అయిదు రూపాయలు అడిగింది. ఎందుకు కావాలో చెపితేగాని ఇవ్వనని తను వెళ్ళిపోయాడు. ఆనాడే ఆఫీసుకు విశ్వ

నాధంగారి భార్య - ఆయన ఊళ్ళో లేక పోవటంవల్ల - అర్జంటుగా కావాలని పది రూపాయలకు కుర్రాణ్ణి పంపించింది. తనకూ ఆయనవల్ల అటువంటి అవసరాలు వస్తూంటాయి గనుక అడిగిందే తడవుగా ఇచ్చి పంపించాడు. ఆ సాయంత్రం ఆఫీసు నుండి తను ఇంటికి వెళ్ళేసరికి మీ రిచ్చిన పది పంపించారంటూ రాజ్యలక్ష్మి తనకు ఇచ్చింది. తను అడగ్గానే నెల చివరని, ఎందుకొ్కవాలో చెప్పమన్న వారికి అప్పుగా ఇవ్వటానికి ఎక్కడి నుంచి వచ్చిందని రాజ్యలక్ష్మి అడిగింది.

కథలో మూర్తి ఆదర్శవాదిగా చిత్రించబడ్డాడు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చి అనేక వ్యాసాలు వ్రాసిన అభ్యుదయ మూర్తి. కాని తనలో ఆ గుణాలేవీ లేవు. కథలు కల్పితాలే కావచ్చును. ఆ కల్పనకు ఆధారమంటూ యేవో ఒక బలవత్తర సంఘటన వుంటుంది. ఆ సంఘటనల్లోని ఒక అంశానికి జీవంపోసి మెరుగులుదిద్ది కథగా అల్లుకుపోతారు.

ఈ కథ తనను గురించి. తనా విధంగా అనుకోవటానికి వీల్లేదన్న ట్టుగా కథారంభములోనే ఇందలి పాత్రలు - సంఘటనలు కేవలము కల్పితములు అని ఆ రచయిత 'రమణి' ముందుగానే వ్రాయుటం జరిగింది. అంత నిర్భయంగా తనను పత్రికలో యెక్కించిన రచయిత ఎవరా అని యెంతగా ఆలోచించినా అంతు చిక్క లేదు.

అప్రయత్నంగా వెంకట్రావు స్మృతి పథంలో మెదిలాడు. తనున్న ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఆనాడు— విశ్వనాథంగారి భార్య కుర్రాణ్ణి పంపినప్పుడు — వెంకట్రావు కూడా అక్కడే వున్నాడు. మైగాడ్! అప్పుడే కథగా రాశాడా? అతనే వ్రాస్తే తన ఇంట్లో జరిగినవి జరిగినట్లుగా యెలా ఊహించి వ్రాయగల్గాడు?

సంతృప్తినిచ్చే సమాధానం దొరక లేదు. ఆలోచన లన్నిటిని కట్టిపెట్టి ఫైల్ ముందేసుకున్నాడు రామనాథం.


సాయంత్రం ఐదయింది! ఆఫీసులో బయలుదేరి సిటీబస్సు యెక్కాడు. అణగారిపోయిన ఆలోచనలు ఒక్కసారిగా రామనాథం మస్తిష్కంలో అటు - ఇటు పరుగెత్తాయి.

"వెంకట్రావే వ్రాసి వుంటే ఎప్పుడూలేని 'రమణి' అన్న కలం పేరు పెట్టుకోవాల్సిన అగత్యం తన వల్లనేనా?"

ఈ భావం మనసుకు తాకగానే శరీరం ఆవేశంతో గగుర్పొడిచింది. పళ్ళు బిగిపట్టి బరువుగా నిట్టూర్చాడు.

"ఫూల్—" అప్రయత్నంగా పెదవులు విడివడ్డాయి. ప్రక్కన కూర్చున్న వ్యక్తి విన్నాడేమో నన్నది అనుమానం మాత్రమేనని అతని ముఖం పరిశీలనగా చూసి నిర్ధారణ చేసుకున్నాడు.

బస్సు ఆగింది. దిగి ఇంటి ముఖం



పట్టాడు. ఎదురుగా తనే కథనుగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడో ఆ వీక్లీ టేబిల్ పై కనుపించింది.

భోజనం చేస్తూండగానే రాజ్యలక్ష్మి అడిగింది. 'అయిదు రూపాయల కథ చదివారా?'

మంచినీటి గ్లాసు అందుకొని పెదాల దగ్గరగా తీసుకుంటూ కళ్ళ

తోనే — చదివానన్నట్లుగా — సమాధానం చెప్పాడు.

"ఆ మూర్తి ఆశయాలు, ఆదర్శాలు ఒకరికి చెప్పేటంతవరకేగాని తను ఆచరించడంలో యెటువంటి అభిప్రాయం వున్నదో భార్య రాధ అయిదు రూపాయలు అడగానే తేలిపోయింది. చివరకు ఆమె అడిగింది కూడా అతగాడు ముచ్చటపడిన గాజు బొమ్మలు కొనటానికే! ఎగ్జిబిషన్‌లో వాటిని చూశాడు. పదే పదే మెచ్చుకున్నాడు. కొనమంటే అనవసరం, డబ్బు దండుగ అన్నాడు కాని వాటి పనితనాన్ని గురించి ఇంట్లో మళ్ళీ మెచ్చుకోకుండా మానలేదు. రాధ కొని ఇంట్లో అలంకరించగానే చూసి సంతృప్తిపడ్డాడు. ఆగ్రహపడలేదు. అతడు అనుకొన్నది, మనసుపడినది ఆమె ఆచరణలో పెట్టింది. చూశారా వారి మనస్తత్వాలు."

"ఆమోదించినట్లే వుంది నీవాదం_" అంటూ భోజనం పూర్తిచేసి లేచాడు.

"రాజ్యలక్ష్మికి కూడా ఆ కథ నచ్చింది. దీనికింతకూ ఆ వెంకట్రావే మూలం _" అనుకున్నాడు.

అతని ఆలోచనల్లో పక్కగా వచ్చి చూస్తున్న రాజ్యలక్ష్మిని గమనించలేదు. మృదువైన వేళ్ళతో తాకేంతవరకు ఆలోచనల్లో నుంచి తేరుకోలేదు.

"అది కథ కాదు. మన ఇంట్లో సంఘటనే. నిదానంగా ఆలోచిస్తే నీకే తెలిసేది. ఆ తెలివి నీ కెక్కడ వుంది? చదివి బాగున్నదని సంతోషించావే గాని మనల్ని పత్రికలో ఎక్కించాడన్న ధ్యాస లేదా? అది వ్రాసిందెవరో కూడా గ్రహించాను!—"

ఫక్కున నవ్వింది రాజ్యలక్ష్మి.

"అదా మీ ఆలోచన! నేను మీకన్నా ముందుగానే గ్రహించాను. కాని ఆ కథ మన ఇంట్లో జరిగిన సంఘటనకన్నా ముందుగా వ్రాసి పంపించారు—"

రామనాథం ఆశ్చర్యపోయాడు. సందేహ నివృత్తి కాలేదు.

"అంతా అబద్ధం! జరుగనిది ముందుగా ఊహించుకు వ్రాసిందని చెపితే నమ్మేటంత స్థితి పట్టాలంటే మన ఇంట్లో జరుగకుండా ఉండాల్సింది! నువ్వన్నట్లు గాకుండా కథ తర్వాత వ్రాసి పంపించారని ప్రూవ్ చేస్తాను. కలంపేరు పెట్టుకున్న రచయిత ఎవరో కూడా చెపుతాను."

"ఎవరో ఆ పేరు చెప్పండి! రైటైతే మీ రన్నట్టుగానే మన ఇంట్లో సంఘటనే ఆధారంగా తీసుకొని కథ వ్రాశారని ఒప్పుకుంటా___"

నిగూఢ రహస్యాన్ని ఛేదించిన డిటెక్టివ్‌లా ఫీలవుతూ, ద్విగుణీకృతోత్సాహంతో రామనాథం అడిగాడు:

"మీ ఫ్రెండ్ కమలమ్మ (విశ్వనాథంగారి భార్య) మా ఆఫీసులో పని చేస్తున్న వెంకట్రావుకు దూరపుబంధువులని ఒకసారెప్పుడో చెప్పినట్లున్నావు కదూ?—"

రాజ్యలక్ష్మి ముఖంలోకి సూటిగా చూశాడు. వెన్నెల వెలుగుల్లో ఆమె కళ్ళల్లో తన అపజయాన్ని గుర్తించినట్లుగా పసికట్టాడు. ఆమె పెదవులు దాటి రావలసిన మూడు అక్షరాల కోసం పెదాలవైపు చూశాడు. ఆమె పెదాలు విడివడ్డాయి.

"అ - వు - ను!—"

గగన కుసుమాన్ని సాధించినంత ఉత్సాహంతో పడుకున్నవాడల్లా ఒక్కసారిగా లేచాడు.

"అదీ అసలు రహస్యం! కథలు రాయటం వచ్చినంత మాత్రాన సాటి గుమాస్తానన్న సానుభూతైనా లేకుండా విభూతి రాదామనుకున్నాడు. ఇడియెట్! ఏదైనా ఫైల్స్‌లో ఇరికిస్తే వాడి డొక్కచీలుతుంది. మజా తెలుస్తుంది."

అతని ఆవేశానికి అడ్డేసింది. టక్కున ఆగిపోయాడు. తను ఓడిపోయాడు. పకపక నవ్వుతున్న రాజ్యలక్ష్మి మాటలు చెవుల్లో గింగుర్లెత్తించాయ్!

"మీ ఊహ సరికాదండోయ్! పాపం, ఆ వెంకట్రావుగారిని అనవసరంగా నిందిస్తున్నారు—"

రామనాథం అడక్కుండానే అసలు రహస్యం బైట పెట్టింది రాజ్యలక్ష్మి.

"ఆ కథ రాసిన తర్వాత ఆమె నాకు చూపించి యెలా వున్నదని అడిగారు. బాగానే వున్నది కాని అందులో మాదిరిగా భార్య అడగానే అలా కాదనటం ఏమంత నచ్చలేదు. ఆ అభిప్రాయమే వ్యక్తపరచాను. కాని కొందరి తీరే అంత; నేను చాలా మందిని చూశానన్న విధంగా ఆమె ఇచ్చిన సమాధానం నాకు వూరట కలిగించలేదు. ఆ కథలో మాదిరిగా మిమ్మల్ని అడిగాను. లేదన్నారు. మీ దగ్గర నిజంగా లేక ఇవ్వలేదో, నెల చివర అందులో నేను అనవసరంగా ఖర్చుపెడతానని ఇవ్వలేదో నిర్ధారణ చేసుకోవాలని కమలమ్మగారి అబ్బాయిని వారి ఇంట్లో అడిగారని చెప్పి పది రూపాయలు మీ దగ్గర్నుండి తెప్పించుకున్నాను. ఆ కథ వ్రాసింది కమల—"

పాపం, రామనాధంపచ్చివెలక్కాయ గొంతున పడ్డట్టు, ఒక క్షణకాలంపాటు గుటకలు మింగి "చివరకు మీ రిద్దరూ నామీద ట్రయిల్ వేశారన్నమాట!—" అన్నాడు.

***

చందా దారులకు మనవి

"జ్యోతి" చందాదారులకు నవంబరు సంచిక మామూలుగానే అందుతుంది. దీపావళి ప్రత్యేక సంచికను వారు విడిగా తెప్పించుకోవలసి వుంటుంది. రిజిస్టర్డ్ పోస్టులో తెప్పించుకోగోరేవారు ప్రత్యేక సంచిక వెల (రూ. 4) తో పాటు అరవై పైసలు పోస్టేజి ఖర్చు అదనంగా పంపాలి.

మేనేజరు, జ్యోతి.

నిజమైన రాజకుమారి

రాజకుమార్తెలకేం? మోకాల్లోతున బోలెడుమంది వున్నారు. కాని, అసలైన రాజకుమారి కావాలి; నిజమైన రాజకుమార్తె కావాలి. అప్పటి వరకు తాను పెళ్ళిచేసుకోనంటే చేసుకోను అని యువరాజు పట్టుపట్టి కూర్చున్నాడు.

రాజుగారు, రాణిగారు ఎందరో రాజకుమార్తెల చిత్రపటాలు తెప్పించారు. ఎన్నెన్ని దేశాలనుంచో రాజకుమార్తెలను స్వయంగా రప్పించారు. కాని, యువరాజుకు ఏ ఒక్క పిల్లా నచ్చలేదు.

నచ్చలేదంటే, ఆ రాజకుమార్తెలు అందంగా లేరని కాదు. కాని, ఎక్కడో ఏదో లోపం ప్రతి పిల్లలోను కనిపిస్తోంది. ఒకమ్మాయికి కళ్ళు మరీ పెద్దవి; ఒక అమ్మాయికి మరీ చిన్నవి ఇంకో పిల్లకి జడ మరీ పొడుగు, ఇంకో పిల్లకి మరీ పొట్టి. ఒక రాజకుమారి కొంచెం లావుగావుంది; ఇంకో రాజకుమారి పీలగా వుంది. ఒక రాజపుత్రిక ముక్కు బండగావుంది; ఇంకో రాజపుత్రిక ముక్కు మరీ కొనతేలి వుంది. మామూలుగా చూసేవారికి ఆ కన్యలందరూ అందంగా, అద్భుతంగా మెరిసి పోతూనే వున్నారు. కాని, యువరాజు కళ్ళకి మాత్రం ఈ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపించి పోతున్నాయి. వీళ్ళందరూ నిజమైన రాజకుమార్తెలు, కారనడం. అక్కర్లేదు పొమ్మనడం_ ఇదే అతని పని.

ఒక రాజకుమారి వచ్చింది. ఆమెలో యువరాజుకు కూడా ఎంత వెదికినా వంక కనబడలేదు. కళ్ళు, జడ, ముక్కు, ఒడ్డు, పొడుగు, రంగు అన్నీ సమానంగా వున్నాయి. బ్రహ్మ



దేవుడు మంచి వుషారులో వుంది. ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని, పోతపోసిన బంగారు విగ్రహంలా వుంది. నడిస్తే హంస నడిచినట్టు. పాడితే కోకిల పాడినట్టు. పలికితే చిలక పలికినట్టు. నవ్వితే మల్లెపువ్వు నవ్వినట్టు, కళ్ళెత్తిచూస్తే వెన్నెల కురిసినట్టు, అప్సరసలా వెలిగిపోతోంది. ఆ అదీ సంగతి: ఈ అమ్మాయి ఏ అప్సరసో కావచ్చు. నిజమైన రాజకుమారి ఇంత వెలిగిపోతుందా ? ఇంకానయం, పెళ్లి చేసేసుకుంటా నన్నాను కాదు. ఈమె నిజమైన రాజకుమారికాదు, నా కక్కర్లే దన్నాడు యువరాజు.

తల్లిదండ్రులకు, మంత్రికి, సేనాపతికీ, అందరికీ యువరాజుమీద మహా కోపం వచ్చేసింది. ఛీ, ఇకనీకు పెళ్ళి కాదు, నీ గతి ఇంతే అనేశాడు రాజుగారు. పోనీ, పెళ్ళి కాకపోతే నష్టం లేదు, నాకు నిజమైన రాజకుమారి దొరికేదాకా పెళ్ళే వద్దన్నాడు యువరాజు. ఇలా కొన్నేళ్ళు గడిచిపోయాయి.

చివరికి ఒకరోజున ఏదో దూర దేశంనుంచి ఇంకో రాజకుమారి వచ్చింది. ఆమె మామూలుగానే వుంది.



పెద్ద అందగత్తె కాదు కాని, ఇదివరకు యువరాజు వద్దుపొమ్మన్న కన్య లెవరికీ తీసిపోదు.

ఆమెను చూసి యువరాజు "నువ్వు నిజమైన రాజకుమారివేనా?" అన్నాడు.

"ఆ అక్షరాలా అసలైన రాజకుమారినే," అంది ఆమె.

"నిఝంగా?"

"ఆ నిఝంగా."

"రుజువేమిటి?"

"మీ యిష్టం వచ్చిన పరీక్ష చేసుకోండి."

సరేనని, యువరాజు ఆ రోజంతా ఆలోచించాడు, ఆమెకి ఏం పరీక్ష పెడదామా అని. చివరికి ఓ మంచి ఉపాయం తోచింది.

ఆరాత్రికి ఆ దూరదేశపు రాజకుమారికి ఒక విశాలమైన గదిలో పడక ఏర్పాటు చేయించాడు. ఒక పెద్ద పట్టె మంచం; దాని మీద ఇరవై హంస తూలికా తల్పాలు ఒకదాని మీద ఒకటి వేయించాడు. ఎవరూ చూడకుండా అన్నింటికంటె అట్టడుగు పరుపు మీద ఒక చిన్న బఠానీ గింజ పెట్టాడు. ఇరవై పరుపులు వేసేసరికి, వాటిమీద ఎక్కి పడుకోవడానికి రాజకుమారి నిచ్చెన వేసుకుని ఎక్కవలసి వచ్చింది.

మర్నాడు పొద్దున రాజు, రాణి, యువరాజు, మంత్రి, ఇతర ఉద్యోగులు రాజకుమారిని చూడ్డానికి వచ్చారు.

"రాజకుమారీ! రాత్రి బాగా నిద్ర పట్టిందా?" అని అడిగాడు యువరాజు.

"ఏం నిద్ర? కునుకుపడితే ఒట్టు. రాత్రంతా ఏదో గుచ్చుకుంటూనే వుంది," అంది రాజకుమారి.


రాజుగారు పరుపులన్నీ తీయించి పరీక్షించి చూస్తే, అడుగు పరుపుమీద ఒక చిన్న బఠానీగింజ కనబడింది. అదన్నమాట రాజకుమారికి నిద్రపట్టక పోవడానికి కారణం!


అహా! ఇరవై పరుపులకింద ఒక చిన్న బఠానీ గింజకే ఓర్చుకోలేకపోయిందే, ఈ రాజకుమారి ఎంత సుకుమారి అయివుండాలి. సందేహం లేదు, ఈమె ఉత్తమ వంశంలో పుట్టిన నిజమైన రాజకుమారే. ఈమెనే పెళ్ళి చేసుకుంటానన్నాడు యువరాజు.

అతనికి నచ్చిన రాజకుమారి ఇన్నాళ్ళకైనా దొరికినందుకు అంతా సంతోషించారు. మహా వైభవంగా పెళ్ళి జరిగింది. యువరాజు నిజమైన రాజకుమారితో కలకాలం సుఖంగా కాపరం చేశాడు.

యువరాజు అడుగు పరుపు మీద బఠానీ గింజ పెట్టడం ఆ రాజకుమారి చాటుగా చూసివుంటుందని ఆ రాజ్యంలో ప్రజలు గుసగుసలాడుతూ వుంటారు గాని, అది ఎంతవరకు నిజమో చెప్పలేము. ఇంతకీ యువరాజు, రాజకుమారి సుఖంగా, అన్యోన్యంగా వుండడంకదా మనకి కావలసింది?

***


ఏకేవ్! యివన్నీ మీనాన్న
పంపించాడా!
ఎప్పుడూ?
మానాన్నే పంపించాడు కానీ
మీయిల్లు యిది కాదు
మూడో యిల్లు కోయిల్లుకే


చిట్టీ, వీడు ఈరాత్రి మనింట్లోనే పడుకుంటానంటున్నాడు,
పక్కేస్తున్నావా వీడికి?
సత్యమూర్తి

పిడుగు

కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపు. దాని తరువాత చెవులు దిబ్బెళ్ళు పడేలా హడలగొట్టేస్తూ ఉరుము. పిడుగు తాటిచెట్టు మీద పడింది. ఆ చెట్టు నడిమికి చీలి చురచురా కాలడం మొదలు పెట్టింది. అమ్మయ్యో! వానలో ఆ తాటి చెట్టు కింద నిలుచుంటే ఇంకే మైనా ఉందా?

పిడుగులు పడి పెద్దపెద్ద చెట్లు, గుడులు, గోపురాలు కూలిపోతూ ఉంటాయి. జంతువులు, మనుష్యులు చచ్చిపోతూ ఉంటారు. పిడుగు అంటే ఏమిటో, దాని స్వరూప స్వభావాదులు ఏమిటో తెలియని మానవుడు భయభ్రాంతుడైపోయాడు. దాని బారినుండి తప్పించమని అర్జునుడికి ప్రార్థనలు చేశాడు. పిడుగు ఇంద్రుని ఆయుధం అని వర్ణించారు కవులు. ఇంద్రుడు ఈ వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు తెగ గొట్టేడని పురాణాలు చెప్తాయి. పిడుగుపాటుకి అప్పుడప్పుడు కొండలు పగలడం కద్దు. ఆ వర్ణనకు అర్థం ఇదే కాబోలు.

ఇంతకీ ఈ పిడుగులు అనేవి ఏమిటి? అవి ఎక్కడ ఎల్లా ఏర్పడతాయి?


ఈ ప్రశ్నలకి సమాధానం కావాలంటే అణువుల నిర్మాణం, విద్యుత్తు, దాని స్వభావం దిఙ్మాత్రంగానైనా తెలుసుకోవాలి.

వస్తువులన్నీ అణువుల మయం. అణువు మధ్యలో బరువైన అణుగర్భం ఉంది. దాని చుట్టూ తేలికైన ఎలక్ట్రానులు ప్రచండ వేగంతో తిరుగుతూ ఉంటాయి. విద్యుత్తులో రెండు రకాలున్నాయి. ఒకటి ధన విద్యుత్తు. రెండవది ఋణ విద్యుత్తు. ఎలక్ట్రానులు ఋణవిద్యుత్తును మోసుకుపోతూ ఉంటాయి. అణుగర్భంలో ధన విద్యుత్తు ఉంటుంది. ఈ ధన, ఋణ విద్యుతులు సరి సమానంగా ఉండడం చేత మొత్తం అణువు అంతనూ కలిపి చూస్తే అందులో అసలు విద్యుత్తే కనబడదు. అణువులకు ఒరపిడి తగిలితే అణుగర్భం చుట్టూ నమ్రంగా తిరుగుతూన్న ఎలక్ట్రానులు కొన్ని తప్పించుకుని, మరో అణువు మీదికి చేరుకుని తమాషా చూస్తూ ఉంటాయి. ఎలక్ట్రానును కోల్పోయినా అణువులో ధన ఋణ విద్యుత్తుల మధ్య వెనుకటి సమానత్వం పోయింది. ధన విద్యుత్తు పాలు పెరిగింది. కనుక ఎలక్ట్రానులను పోగొట్టుకున్న అణువు ధన విద్యుత్తును ప్రదర్శిస్తుంది. మరో అణువుమీదికి ఎలక్ట్రాను వచ్చి అదనంగా చేరితే, ఆ అణువులుకూడా ధన ఋణ


డాక్టర్ మహీధర నళినీమోహన్

విద్యుత్తుల సమానత్వం పోయి, ఋణ విద్యుత్తును ప్రదర్శిస్తుంది. ఎలక్ట్రాను లను పోగొట్టుకున్న అణువూ, అధికంగా ఎలక్ట్రాను వచ్చి తగులుకున్న అణువూకూడా ఈ కొత్త పరిస్థితిని జీర్ణించుకోలేక ఆపసోపాలు పడుతూ ఉంటాయి. వీలైతే తమ పూర్వస్థితికి చేరుకోవాలని గట్టిప్రయత్నాలు చేస్తూ

నాలుగు+
నాలుగు-
ఈ అణువులో ధన ఋణ విద్యుత్తులు సమానం.



నాలుగు+
మూడు—



నాలుగు+
ఐదు-

ధన విద్యుత్తు ప్రదర్శిస్తుంది

ఋణ విద్యుత్తు ప్రదర్శిస్తుంది.

ఉంటాయి. ఈ రెండు అణువులూ ఎప్పుడైనా దగ్గరగా రావడం సంభవిస్తే మొదటి అణువు తనదగ్గర తక్కువైన ఎలక్ట్రానును తిరిగి ఇచ్చెయ్యమంటుంది. రెండవ అణువు తనదగ్గర వట్టిమోత దండుగలా ఉన్న అధికపు ఎలక్ట్రానును అడిగిందే తడవుగా ఇచ్చేసి, తల తడివి చూచుకుంటుంది. వైద్యుడూ పాలే ఇమ్మన్నాడు, రోగీ పాలే కోరేను అన్నసామెత ఇక్కడ అక్షరాలా నిజం అవుతుంది. ఒకచోటి నుండి మరో చోటికి ఎలక్ట్రానులు పరుగెత్తడాన్నే విద్యుత్ప్రవాహం అంటారు.

ఈ సంగతులు అర్థం అయితే పిడుగుల రహస్యం తెలిసి పోయినట్లే.

మేఘాలు ఒకదానికొకటి ఒరుసుకున్నప్పుడు ఒక మేఘం ఎలక్ట్రానులను పోగొట్టుకుని ధన విద్యుత్తును పొందుతుంది. రెండవమేఘం ఎలక్ట్రానులను గ్రహించి ఋణ గ్రస్తం అవుతుంది. సముద్రాలలో నీరు ఆవిరి అయిపోయేటప్పుడు కూడా అణువుల పరస్పర ఘర్షణవల్ల విద్యుదావేశిత మవుతాయి. విద్యుత్తును వదిలించు కోవాలని తాపత్రాయ పడతాయి. పొడిగా ఉన్నగాలి విద్యుత్ప్రవాహాన్ని నిరోధిస్తుంది. అంటే గాలి పొడిగా ఉంటే అందులో నుంచి ఎలక్ట్రానులు ప్రయాణం చెయ్యడం చాలాకష్టం. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండి వర్షం కురియడానికి సిద్ధంగా ఉన్నప్పుడుగాని, వర్షం పడుతున్నప్పుడుగాని విద్యుత్తు తనగుండా ప్రవహించడానికి గాలి ఒప్పుకుంటుంది. నీటితో గాలి "తడిసి" సిద్ధంగా ఉన్నప్పుడు ధన. ఋణ విద్యుత్తులుగల మేఘాలు దగ్గర దగ్గరగా వస్తే ఋణ మేఘంలో అధికంగా ఉన్న ఎలక్ట్రానులు ఒక్క గంతువేసి ధన మేఘాన్ని చేరుకుంటాయి. ఆ గంతువల్ల చాలా వేడి పుడుతుంది. ఆ వేడికి గాలిలోని అణువులు వెలుగుతాయి. దానినే మనం మెరుపు అంటున్నాం! ఎలక్ట్రానులు గంతువేసి ప్రయాణం చేసేదారి తిన్నగా రూళ్ళ కర్రతో గీసినట్లు సరళరేఖలా ఉండదు. ఎక్కడ నిరోధం తక్కువగా ఉండి అనుకూలంగా ఉంటే ఆ దారిలో ప్రయాణం చేస్తాయి. (పల్లపునేలలు వెతుక్కుంటూ నడిచేసినట్లే.) ఒక్కొక్కప్పుడు ఆ దారి వంకర టింకరగా, చిలువలుపలవలుగా ఉంటుంది. అదే విద్యుల్లత! ఎలక్ట్రానుల ప్రయాణంవల్ల గాలి వేడెక్కి హఠాత్తుగా వ్యాకోచిస్తుంది. అందువల్ల పేలుడు కలుగుతుంది. అదే ఉరుము! ఒక్కొక్కప్పుడు అనేకసార్లు వరుసగా ఉరిమినట్టు వినబడుతుంది. అది ప్రతిధ్వని.

విద్యుత్తు అధికంగా కలిగిన మేఘాల నుంచి ఒక్కొక్కప్పుడు భూమి మీదికి కూడా విద్యుత్తు ప్రవహిస్తుంది. దానినే "పిడుగు పడింది" అంటున్నాం.

"పిడుగు ఆకాశం మీదినుంచి భూమి మీద పడింది" అనడం శాస్త్రరీత్యా సరియైనది కాదు. ఒక్కొక్కప్పుడు పిడుగు భూమిమీదనుంచి ఆకాశం మీదికి కూడా పడుతుంది. తమాషాగా ఉందే! అదెల్లా సాధ్యం? ఋణ

మేఘంనుంచి ఎలక్ట్రానులు భూమిని చేరుకోవచ్చు. అది ఒక పద్ధతి. లేదా భూమినుంచి ఎలక్ట్రానులు ధన మేఘాన్ని చేరుకోవచ్చు. ఇది రెండవ పద్ధతి. ఈరెండూ పిడుగులే. పిడుగు "పడింది" అన్నమాట వ్యవహారంలోకి అజ్ఞానంవల్ల వచ్చింది.


ఎలక్ట్రానులకు బహుదూర ప్రయాణం చేయడం ఇష్టంగా ఉండదు. అవి చాలా సోమరివి. కనుక సాధ్యమైనంత దగ్గరలో ఉన్న అనువైన స్థలాన్ని వెతుక్కుంటాయి. అందుకనే ఎత్తయిన వస్తువుల మీద (మేఘాలకు దగ్గరగా ఉన్నాయి కనుక) పిడుగులు పడుతూ ఉంటాయి.

పిడుగు ఒకసారి పడిన చోట మళ్ళీ పడదని జనవాక్యం ఉంది. కాని, దానికి శాస్త్రీయమైన ఆధారాలేవీ లేవు.

పిడుగు తాటిచెట్టు మీదపడినప్పుడు కలిగే విపరీతమైన వేడికి చెట్టులోపలి ద్రవాలు ఆవిరై హఠాత్తుగా వ్యాకోచించి, చెట్టును చీల్చివేస్తాయి. కొండ పగుళ్ళలో నిలిచిన నీళ్ళు పిడుగు పాటుకి ఆవిరై, వ్యాకోచించి, డైనమైటుతో పేల్చినట్లు పగిలిపోవచ్చు.

ఈ పిడుగులను సాధువులుగా చేసే పద్ధతి ఒకటిఉంది. "అర్జునః ఫల్గుణః పార్థః" అనిమంత్రం చదవడం కాదు. (పిడుగుకి సంస్కృతంవచ్చునో రాదో మరి) ఇళ్ళమీద ఎత్తుగా కట్టిన రాగిముల్లే ఈ సాధనం. ఆ ముల్లు దళసరిపాటి రాగి తీగల ద్వారా భూమిలోకి కలుపబడి ఉంటుంది. పిడుగు ఆ ముల్లు మీదికి ఆకర్షింపబడి, రాగి తీగల ద్వారా నిరపాయంగా భూమిలోకి పోతుంది.

***



నా కలలూ, భూమికలూ

అక్కినేని నాగేశ్వరరావుతో ప్రత్యేక గోష్ఠి

సినిమా

ఆరోజు అక్కినేని అదోలా వున్నారు. గోష్ఠికి మూడ్ లేనట్లుంది. గట్టిగా "మూవ్" చేసేమాటలు వదిలితే కాని మన మనిషి అయ్యేటట్లు లేరు.

చూసి....స్థిరపడ్డాక .... యింకా ఆనాటి షూటింగ్ మూడ్‌లోనే మునిగి



తేలుతున్న నాగేశ్వరరావుతో "జ్యోతి" మద్రాసు ప్రతినిధిని అన్నాను.

"మిమ్మల్నిమధ్య చూడాలనిపించ లేదు !"

"సంతోషం" అన్నారు అక్కినేని గభిక్కున ఇటు తిరిగి...."

"గతరాత్రే మిమ్మల్ని చూడాలనిపించింది" అన్నాను.

దిగ్భ్రాంతి చెందారు.

"ఒక్కమాట అడుగుతాను. ఏమీ అనుకోరు కదా ?" అని అడిగాను.

హీరో మూడ్ అలానే వుంది.

"మీరు పోతన వేయాలి" అన్నాను.

'మూడ్' మారి 'మూవ్' అయ్యారు. ఆశ్చర్యంగా చూశారు. సమయంచూసి ఇక సాగించాను....

నేను : "పోతన" చూశాక, గత రాత్రే మీరు జ్ఞాపకానికి వచ్చారు. మీరు పోతన వేషం వేస్తే ఎలా వుంటుంది ?

నాగేశ్వరరావు ఎదురు ప్రశ్న : మీరు అడుగుదా మనుకొన్న ఒక్కమాట అదేనా ?

ఆ తర్వాత మా యిద్దరి మధ్య రేస్ కోర్సు వేగంతో సాగిన ప్రశ్నోత్తర "గాలి వాన" యిది.

నేను : ప్రస్తుతానికదే....

నాగేశ్వరరావు : అయితే వినండి. పోతనే కాదు, వేమన, త్యాగయ్య, బుద్ధుడు,

నే : ఇప్పుడే వేస్తారా ?

నా : ఇంకా హైముంది.

నే : మరెప్పుడు.

నా : ఇంకో రెండేళ్ళకు రిటైర్ కావాలని అనుకొన్నప్పుడు ఆ పాత్రలే వేస్తాను. అవి ధరించాక రెండేళ్ళు మించినన్ను సినిమారంగంలో వుంచరు!

నే : అంతమాటే .... పోతన, వేమన, త్యాగయ్య, బుద్ధుడుభూమికలు ధరించలేరనేనా అర్థం.

నా : అర్థమో, పెడర్థమో. నేనా వేషాలు వేశానూ అంటే మరి రెండేళ్ళలో రిటైర్ అయ్యాను అని అనుకోవలసిందే.

నే : విప్రనారాయణ, "రెండు" దేవదాసులూ వేసి నిలవలేదా ?

నా : ఒక దేవదాసు విషయంలో నా అభిప్రాయం వేరొకటి !

నే : అదేమిటి, బిమల్‌రాయ్ దేవదాసు దిలీప్‌కుమారే మిమ్మల్ని మెచ్చుకొంటే !

నా : నే ననుకోవడం బిమల్ "దేవదాసు" నిజమైన శరత్ దేవదాసు" మూలానికి మూసపోశారు. మేము తెలుగు సినిమా కోసమని శరత్ బాబునే తిప్పేశాము,

నే : రెండో దేవదాసు !

నా : "నవరాత్రి"లో ఆ పాత్ర సృష్టి బాగుంది. సహజంగావుంది. వాదనకు నిలుస్తుంది. ఆ దేవదాసు తను కదులుతాడు. తనతో ఇతరులను కదిలిస్తాడు. ఆ ఒక్క భూమికనే పెద్ద సినిమా కథగా విస్తరించవచ్చు.

నే : అయితే మీరే ఓ కథ వ్రాసేసి పిక్చర్ తీసేయ కూడదూ !

నా : అది నా పనికాదు. నిర్మాత పని. కథకుని పని.

నే : ఒక్కమాట అడుగుతాను. ఏమీ అనుకోరుకదా !

నా : మళ్ళీ వేమన. త్యాగన

నే : కాదు, అంతకంటే చిక్కైనది.

నా : ....!?

నే : కథ నా పని కాదు అని అన్నారుకాని ప్రతి నిర్మాతతెచ్చేకథనూ మీరు యాసిడ్ టెస్ట్ చేసి వేస్తారుటగా.


నా : సర్వ సాధారణంగా నేనే కథనూ కాదనను. నాకు వినిపించే షేప్‌కు కథ వచ్చేసరికి కనీసం 40-50 వేల రూపాయల ఖర్చు అవుతుంది. ఆ పెట్టుబడి రావాలి అంటేనే లక్షన్నర రెండు లక్షల గ్రాస్ కలక్షన్‌లు రావాలి. అంతా మార్చెయ్యమంటె మళ్ళీ అనేక వేల ఖర్చు అవుతుంది. నిర్మాత క్షేమం కోరి కుడిఎడమల పోతూ వుంటాను.

ప్రశ్న : ఎడమకు ఎప్పుడు వెళ్ళారు లెఫ్టిస్టుగారూ !

జవాబు : నేనూ, జమునా, రంగారావు వుండీ 1964 లో ఫెయిల్ అయిన సాంఘికం తెలుసుకోండి.

ప్ర : కథ బాగా లేకపోయినా, భూమిక మంచిదైతే నటిస్తారా ?

జ : కథ, భూమిక, సంస్థమూడూ మంచివి కావాలి.



“మనసే మందిరం”లో ప్రధాన పాత్రధారులు
నాగేశ్వరరావు, జగ్గయ్య, సావిత్రి

ప్ర : భూమికకు మీ స్కేలు ఏమిటి?

జ : కొత్తదనం. నేను ధరించే ప్రతి భూమికలో ఏదో ఒక కొత్తదనం వుండాలని కలలు గంటున్నాను.

ప్ర : ఒక్కమాట అడుగుతాను ఏమీ అనుకోరుకదా!

జ : మళ్ళీ వేమన, త్యాగయ వంటి దేనా?

ప్ర : అంతకంటె చిక్కైనది?

జ : ....!?

ప్ర : ఒక్క సినిమాలో తొమ్మిది రకాల వేషాలు వేసినా ఇంకా కుతి తీర లేదా? నైన్ హీరోస్‌గారూ!

జ : నిజానికి నాకు అందులో నచ్చింది ఒక్కటే పాత్ర.

ప్ర : దేవదాసు?

జ : కాదు.

ప్ర: పల్లెటూరు బైతు?

జ : కాదు. హంతకుడు గోపన్న.

ప్ర : ఎందుకని?

జ : ఒక వ్యక్తి తన నిజమైన శక్తిని ప్రదర్శిస్తే అది నటన ఎందు కౌతుంది ? తనలో లేనిది తెచ్చిపెట్టు కొని నటించడమే నటన. ప్రతీకారాగ్నితో దహించుకుపోతున్న ఆ గొపన్న గొంతుకా నాకు — అనగా అసలు నాగేశ్వరరావుకు లేదు. బీభత్సమా లేదు. కారిన్యమా లేదు. భీకరాకారమా లేదు. చిన్న ఒళ్ళుతో సన్న గొంతుకతో ఒళ్ళు మిన్నగా జలదరింపజేయడమే నటన. నా తాహతుకు రవ్వంత చేసినా గ డు తాను. అదే నా స్కేలు.

ప్ర : ఇప్పుడు చాలా చిత్రాలలో నటిస్తున్నారుకదా. మీ స్కేలు బాగా ఉపయోగపడిందా ?

జ : భిన్న భూమికలు లభించడమే నా భాగ్యం. చాలాకాలానికి (కలర్ రహస్యం) జానపదంలో నటిస్తున్నాను. "రహస్యం"లో పదిపదకొండు రూపాలలో కన్పిస్తాను. నటిస్తాను.... అలానే చాలా కాలానికి మన చారిత్రకం "ఖడ్గతిక్కన"లో దేశోపయోగ కరమైన ఉత్తేజకరమైన భూమిక ధరిస్తున్నాను.

ప్ర : ఏమైనా పాతవే కదా....

జ : కాదు. పాతలోనూ క్రొత్త వుంది. "వసంతసేన"లో చారుదత్తుడు చూడండి, ఈ కాలపు సామ్యవాదం ఆనాడు అక్షరాలా పాటించిన మహా మనిషి. ఆ కథలో "ట్విస్ట్" నాకెంతో నచ్చింది. ఈరోజు చారుదత్తులెందరో కావాలి. తన సర్వస్వమూ ఇతరులకిచ్చిన ధన్యులు కావాలి.

ప్ర : తెలియక అడుగుతాను.ఒక్క ప్రశ్న. మరేమీ అనుకోరు కదా!

జ : మళ్ళీ వేమన, త్యాగనవంటి దేనా ??

ప్ర : అంతకంటె చిక్కైనది !!

జ : ....!!??

ప్ర : ఎవడో చారుదత్తుడు తన సర్వస్వమూ ఇతరులకిచ్చిన ధన్యుడయ్యా డంటారు ? సినిమాలమీద మీరు ఇంత సంపాదించి సినిమా కళకు మీరు ఇచ్చింది ఏమిటంట ? నటచక్రవర్తి బిరుదు సంపాదించి ఊరుకోడమేనా ?

జ : బాగా అడిగారు. బాగా వినాలి కూడా. బాగా తెలుసుకోవాలికూడా, బాగా చదవాలికూడా....

ప్ర : ....!!??

జ : .... "చక్రవర్తి చిత్ర" సంస్థను నేనూ, అదుర్తిగారూ కలసి స్థాపించడంలో ఉద్దేశమే కళను పంచిపెట్టడం. 'కళ కళ కోసమే' అన్న లక్ష్యంతో 'న్యూవేవ్' వంటి చిత్రాలను తీస్తాము. ధనాపేక్ష లేదు. పైగా మేము ఇంతకాలంగా సంపాదించింది సినీ కళా వికాసానికి వినియోగిస్తాము. బాక్స్ ఆఫీస్ మాకు బాగా దూరం.

ప్ర : భూమికకూడా మీకు దూరమేనా ?

జ : కావచ్చు. పాత్రలనుబట్టి నటీనటులు నిర్ణయమౌతారు. నాకు తప్పనిసరి అయిన భూమికఉంటే చిన్నది పెద్దది, ప్రధానమైనది, అప్రధానమైనది అనే మీమాంస లేకుండా ధరిస్తాను.



శ్రీ కృష్ణసాయి ఫిలిమ్స్‌వారి "మనసే మందిరం"లో

నాగేశ్వరరావు

అసలు డైరీలో ఉన్న విషయానికి, పరిశోధనకీ సంబంధం వుందా ?

విజయ్‌ని దోషిగా నిర్ణయించిన కమిటీ నిర్ణయాన్ని పద్మశ్రీ ప్రసాద్ వహిస్తాడా ?

శేఖరే విజయ్ అని పార్వతి తెలుసుకొంటుందా ?

పై ఆసక్తిదాయకమైన ప్రశ్నలకు జవాబులు నిత్యనూతనంగా రూపొందించ బడిన "అడుగు జాడలు" చిత్రంలో దొరుకుతాయి.

కొంగ్రొత్త పద్ధతులలో చాణక్య తీసిన ఈ చిత్రం సెప్టెంబర్ మొదటి వారంలో షూటింగ్ పూర్తిచేసుకుంది. రామారావు, జమున, రంగారావు ముగ్గురూ డాక్టర్ల పాత్ర ధరిస్తు న్నారు.

"పిడుగు రాముడు"

గ్రామవీరుల కథలలో సరికొత్తది "పిడుగు రాముడు" పేరుకు తగ్గ రాముడే.

ప్రతాపరౌద్ర మహారాజు (రేలంగి) "రాణీ తమ్ముడు" గజేంద్రుడు (రాజనాల) కామోద్రేకంలో పల్లెపిల్లల వెంట బడతాడు. హేమను (మణిమాల) బలాత్కరించి తీసుకొని పోతూవుంటే ఆమెను చెల్లెలుగా చూసుకొనే పిడుగు రాముడు (రామారావు) చూచి గజేంద్ర దుష్టత్రయాన్ని ఓడించి ప్రజల సమక్షంలో పరాభవించుతాడు. మారువేషంలో వున్న రాకుమార్తె మధుమతి (రాజశ్రీ) గ్రామవీరుని సాహసానికి మెచ్చి రుమాలు బహూకరిస్తుంది. రుమాలు ప్రేమకు ఆనవాలు అవుతుంది. గజేంద్రుడు మరింత మండిపడతాడు. పిడుగురాముని అంతమొందించేందుకు ప్రయత్నంపై ప్రయత్నం జరిపి, తుదకు కృతకృత్యుడై మధుమతిని తన సతిగా చేసుకొనేందుకు సర్వ సన్నాహాలూ చేస్తాడు బాకు దెబ్బతో నదిలోపడ్డ రాముని ఛాయ (విజయలక్ష్మి) బ్రతికిస్తుంది. మోహిస్తుంది. పెళ్ళిపీటలపైవున్న మధుమతి, గజేంద్రుడు తమవద్దకు రాముడు సజీవుడై రావడం చూచి దిగ్భ్రాంతి చెందుతారు. మధుమతి గజేంద్రుల వివాహకాండ ఆగిపోయింది. మధుమతి రాముని మది సతి అయింది. అనంతరం గజేంద్రుడు ద్విగుణీకృతంగా సాగించిన ఘోర కృత్యాలవల్ల ప్రతాపరౌద్రరాజు బందీ అయినాడు. రాముడు చక్రబంధ శిక్షకు గురైనాడు. తాను వలచి తాను వలపింపబడనందున ప్రతీకారం తలపెట్టిన ఛాయ రాము కళ్ళను అగ్నితో భస్మం చేసింది. మధుమతి గజేంద్రుడి అర్ధాంగికాక తప్పలేదు. పెళ్ళికి అంతా సిద్ధం.


ఎవరి పెళ్ళి? ఎందరి పెళ్ళి? ఒక్క వరుడు ఇద్దరు వధువులు? వారు ఎవరెవరు? రాముడు, మధుమతి, ఛాయల వీర ప్రణయగాథ "పిడుగురాముడు"లో విచిత్రాంతమౌతుంది.

జానపదమూస కథ అయినా ప్రతాపరౌద్ర మహారాజుకు "ఈ ప్రసంగం ఇంతటితో సమాప్తం" అనే ఊత వాక్యం పెట్టి, పూసల వాళ్ళపై పద్మనాభం, రాజబాబు, వాణిశ్రీలతో హాస్య కథ నడిపి, గగనమర శతఘ్నితో పతాక సన్నివేశం సృష్టించి, వీరోచిత వివాహ ద్వయం జరిపి కొంతకు కొంత కొత్తదనం తెచ్చారు.

అభినయ ప్రమాణం ఉన్నతం. కథలోనే కొత్తదనం లేదనిపిస్తుంది: డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ ముఖ్యులు, డి. వి. ఎస్. రాజు, విఠలాచార్య, టి. వి. రాజు, సముద్రాల జూనియర్, నారాయణరెడ్డి, కొసరాజు.

* * *

శ్రీ రామిరెడ్డి నిర్మాతగా భానూ పిక్చర్స్ ఒక సాంఘికం తీయడానికి సమకట్టారు. ముద్దిపట్ల సూరి కథ, సంభాషణలు సమకూర్చుతున్నారు. దర్శకుడు కె. ప్రత్యగాత్మ.



సిటడల్ వారి "ప్రేమలో ప్రమాదం" చిత్రంలో
తల్లీ కూతుళ్ళుగా సూర్యకాంతం, కృష్ణకుమారి

"పదండి ముందుకు" రష్యన్ కలం

జాగృతి చిత్రావారి "పదండి ముందుకు" తెలుగు చిత్రాన్ని సోవియెట్ రష్యాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం సందర్భంగా ప్రదర్శించే నిమిత్తం తయారుచేసిన 9800 అడుగుల కుదింపు ప్రతిని మద్రాసులో పత్రికా ప్రతినిధులకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. చిత్రారంభంలో టైటిల్ కార్డులవంటి అక్షర వ్యాఖ్యానం వుంది. రష్యన్ భాషలో రచించి, టైప్‌చేసి, ఫొటోగ్రాఫ్‌చేసి చిత్రానిక్కి జోడించారు. మద్రాసులోని సోవియెట్ సమాచార శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జీయెంకో ఆ రష్యన్ వ్యాఖ్యానం రచించారు. చిత్ర ఇతివృత్తంగురించి ఆ వ్యాఖ్యానం కాని సబ్ టైటిల్సు కాని లేవు. అంచేత సంభాషణలను, పాత్రల మధ్యకల బాంధవ్య రహస్యాన్ని రష్యనులు ఎంతవరకు గ్రహించ కలుగుతారనేది సందేహమే. ప్రేమీ ప్రేమికుల మధ్య ప్రేమగీతం లేకుండా, నేపథ్య గానం కూడా లేకుండా, నేపథ్య సంగీ

తంతో, భావంతో ప్రేమ ప్రకటన చెయ్యడం ఈ చిత్రం విశేషాలలో ఒకటి. చిత్రం చివరిలో రఫీ పాడిన పాట ఎక్కువగా శవపాత్ర పై సాగింది. అది తగ్గించి జి. వరలక్ష్మి పాత్రవంటి దేశనాయకురాలు దుర్మరణం చెందితే ప్రజలలో రేగిన భావాలను చిత్రీకరిస్తే, విడిగా చిత్రీకరించి జోడించినా, రష్యా స్టాండర్డుకు తగినట్లుండేది. పొట్టి చిత్రమైనా గట్టిగా వుంది. కృష్ణమూర్తి, వి. మధుసూదనరావు, జగ్గయ్య, జమున చిత్ర ముఖ్యులు.



హైదరాబాద్ మూవీస్‌వారి
"అర్ధరాత్రి"లో నిర్మల

చలన చిత్ర వార్తలు

రామారావు స్వంత చిత్రం

ఎన్. ఏ. టి రామకృష్ణ కంబైన్స్ వారి "ఉమ్మడి కుటుంబం" సెప్టెంబర్ ఒకటవ తేదీనుంచి 10 వ తేదీ వరకు ఒక షెడ్యూల్ షూటింగ్ సాగింది. వీధిభాగవత ఘట్టాలను వాహినీలో చిత్రీకరించారు. రామారావు, రాజబాబు, వాణిశ్రీలపై చిత్రీకరణ జరిగింది. యూనిట్ వివరమిది: తారాగణం : రామారావు, రేలంగి, ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, రాజబాబు, బాలకృష్ణ, సావిత్రి, కృష్ణకుమారి, ఎస్. వరలక్ష్మి, ఎల్. విజయలక్ష్మి, వాణిశ్రీ, సి. హేమలత. సాంకేతికవర్గం : నందమూరి త్రివిక్రమ రామారావు, యోగానంద్, సముద్రాల జూనియర్, సి. నారాయణరెడ్డి, కొసరాజు, టి. వి. రాజు, ఎస్. కృష్ణారావు, రవికాంత్.

దసరాకు "వీరపూజ"

జానపద చిత్రం "వీరపూజ" దసరాకు విడుదల కానున్నది. సెప్టెంబర్ మొదటి వారంలో మద్రాసు శివారులో కొంత ఔట్‌డోర్ షూటింగ్ జరిగింది. కాంచన, కాంతారావు, గోపాలకృష్ణ, జి. వరలక్ష్మి ముఖ్య భూమికలు వహిస్తున్న ఈ చిత్రం దర్శకుడు: అమంచర్ల శేషగిరిరావు.



శ్రీ కృష్ణసాయి ఫిలిమ్స్‌వారి "మనసే మందిరం" చిత్రంలో
జగ్గయ్య, సావిత్రి

రామ్స్ ఆర్ట్స్

రామ్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు సెప్టెంబర్ ఆరంభంలో ఒక సాంఘిక చిత్ర నిర్మాణానికి పేపర్‌వర్క్ ప్రారంభించారు. నిర్మాత రామమూర్తి, దర్శకుడు గిడుతూరి సూర్యం.

మద్రాసులో నాగేశ్వరరావు చిత్రాలు

అక్కినేని నాగేశ్వరరావు సెప్టెంబర్ మధ్యలో మద్రాసువచ్చి విక్రమ్ వారి "వసంతసేన" షూటింగ్‌లలో పాల్గొన్నారు.

ఆస్తిపరులు

జగపతివారి "ఆస్తిపరులు" సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోలో జగ్గయ్యపై ఒక బిట్, కామెడీబిట్‌ల మూడింటి చిత్రీకరణ జరగవలసింది కాని కుంభవృష్టివల్ల సాగలేదు. అనంతరం సేలంలోను అవాంతరం వచ్చింది. ఆ పనులు పూర్తయితే సెప్టెంబర్‌లోనే చిత్రం షూటింగ్ దశ ముగియగలదు. యూనిట్ ముఖ్యులు : తారాగణం : నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, జయలలిత, జి. వరలక్ష్మి, సూర్యకాంతం. సాంకేతికవర్గం : ఆత్రేయ, కొసరాజు, మహాదేవన్, సి. నాగేశ్వరరావు, జి.వి. సుబ్బారావు, నిర్మాత: రాజేంద్రప్రసాద్, దర్శకుడు : వి. మధుసూదనరావు.

పూల రంగడు

నాగేశ్వరరావు, జమున, గీతాంజలి మొదలైనవారితో అన్నపూర్ణా పిక్చర్స్ వారు "పూల రంగడు" చిత్రం నిర్మించడానికి సెప్టెంబర్ 12 వరకు మరికొంత కృషి సాగించారు. మద్రాసులో నిర్మాత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు, దర్శకుడు ఆదుర్తి, కథకుడు ముళ్ళపూడి వెంకటరమణ కొత్త నిడివి దృష్ట్యా కథకు తుది రూపం తీర్చి దిద్దారు. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమౌతుంది.

క్విక్ "మనసే మందిరం"

హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోస్‌లో తయారైన మొట్టమొదటి క్విక్ కృష్ణసాయీ ఫిలిమ్స్ వారి "మనసే మందిరం" ఈ సంచిక వెలువడడానికి ఒకటి రెండు రోజులముందే ప్రజాభిమానం పొందివుంటుంది. తమిళ "నెంజిల్ ఊరే ఆలయం" హిందీ "దిల్ ఏక్ మందిర్"ల కంటె నటనకు సంబంధించినంత వరకు తెలుగు చిత్రానికే గణ్య స్థానమని అభిజ్ఞులు అంటున్నారు. యర్రా అప్పారావు, శ్రీధర్, ఆత్రేయ, నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, చలం, సావిత్రి, శాంతకుమారి ముఖ్యులు.

సత్యమే జయం

శ్రీ ఇందిరా రమణా పిక్చర్స్‌వారి "సత్యమే జయం" చిత్తూరు జిల్లాలోని కైలాసనాధ కోనవద్ద ఔట్‌డోర్ షూటింగ్ ముగించుకొన్న మీద సెప్టెంబర్ 12 నుంచి తిరిగి షూటింగు జరుగుతుంది. దాదాపు 14 రీళ్ళు తయారైంది. దసరా ప్రాంతాల విడుదలయ్యే ఈ జానపద చిత్రం యూనిట్ ముఖ్యులు: శోభన్‌బాబు, గుమ్మడి, రామకృష్ణ, ముక్కామల, రమణారెడ్డి, లంక సత్యం, టి. సి. సుబ్బన్న (నిర్మాత), పి. వి. రామారావు, (దర్శకుడు) కన్నప్ప (ఛాయాగ్రహణం), జి. కె. మూర్తి (మాటలు), సి. నారాయణ రెడ్డి, శ్రీశ్రీ (పాటలు).

"విజయ రాముడు"

స్క్రిప్టు పూర్తి

కొత్త తరహా పాత్రలతో, కొంగ్రొత్త ప్రద్ధతి సినీ కథా సంవిధానంతో జయా ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ "విజయ రాముడు" అనే జానపదం నిర్మించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. సెప్టెంబర్ మధ్యకు స్క్రిప్టు సిద్ధమైంది. ముడిఫిల్ము పరిస్థితి బట్టి అక్టోబర్-నవంబర్‌లలో షూటింగ్ ప్రారంభించి రెండు మూడు నెలల్లో చిత్రం సిద్ధంచేస్తారు. నిర్మాత: డాక్టర్ ఇ. అప్పారావు, దర్శకుడు: ఆమంచర్ల శేషగిరిరావు, సంగీత దర్శకుడు: టి. వి. చలపతిరావు, కథ సంభాషణలు వేటూరి సుందర రామమూర్తి, కెమెరా రామచంద్రయ్య. కళ: సోమనాథ్, దుస్తులు, నారాయణరావు, నృత్యములు, కె. ఎస్. రెడ్డి, తారాగణం: రాజశ్రీ, కాంతారావు, రాజనాల, హేమలత, మిక్కిలినేని, బాలకృష్ణ.

కొత్త చిత్రాలు

"పోతులూరి వీరబ్రహ్మం"

"కాలజ్ఞానం" అనే పోతులూరి వీరబ్రహ్మం జీవిత చరిత్రను కొందరు భక్తులు వెండితెర కెక్కిస్తున్నారు. శ్రీ పింగళి నాగేంద్రరావు స్క్రిప్టు పని పూర్తి చేస్తున్నారు. సంస్థపేరు ఎస్. బి. ఫిలిమ్స్.

శ్రీ సాయిబాబా మహాత్మ్యం

మద్రాసులో శ్రీ సాయీరామ్ ఫిలిమ్స్ అనే సంస్థ "శ్రీ సాయిబాబా మహాత్మ్యం" చిత్రం తీయబోతున్నది. పరిశోధనలు తీవ్రంగా జరుగుతున్నాయి

పార్వతీ పరమేశ్వరులు

శ్రీరామా పిక్చర్స్‌వారు "పార్వతీ పరమేశ్వరులు" చిత్రానికి సెప్టెంబర్ ఆరంభంలో పాటలు రికార్డు చేశారు. రచన: సాయిరామ్, శ్రీ గిరిరాజు రామారావు, దర్శక నిర్మాత బోళ్ళ సుబ్బారావు, సంగీతం: మల్లేశ్వరరావు.

పార్వతీ శపథం

సందేష్ పిక్చర్స్‌వారు "పార్వతీ శపథం" స్క్రిప్టును సెప్టెంబర్ మొదటి వారంలో సిద్ధ పరిచారు. రాజశ్రీ, కాంతారావు ప్రధాన పాత్రధారులు, దర్శకుడు, నిర్మాత: ఆమర్తి నరసింహ మూర్తి.

వీరాంజనేయ

అంజలి సీతగా, రంగారావు రావణాసురుడుగా 'భారత్‌శ్రీ' అర్జా జనార్దనరావు ఆంజనేయులుగా మహిజావారి "వీరాంజనేయ" నిర్మాణం ప్రారంభమైంది. రచన: కీర్తిశేషులు మల్లాది రామకృష్ణ శాస్త్రి. దర్శకత్వం: కమలాకర కామేశ్వరరావు.

"లేత మనసులు"

అమ్మకూతురు (లల్లి) నాన్న కూతురు (పప్పి) కవలపిల్లలు. అమ్మమ్మ (జి. వరలక్ష్మి) అహంవల్ల తల్లిదండ్రులు (జమున, హరనాథ్) వేరు పడ్డారు. లల్లి అమ్మవద్ద, పప్పి నాన్న వద్ద పెరిగారు. ఒకే బడిలో చదువుకొంటూ ఒకతల్లి బిడ్డలమని తెలియక తెగ పోరాడుకున్నారు. లల్లికి అమ్మమ్మ అహం వారసత్వమైంది. నాన్న ఉదారత, విజ్ఞానం. పప్పి వారసత్వమైనాయి. పిక్నిక్‌లో కలియబడ్డ లల్లి, పప్పిలు దేవుడూ పిల్లలూ సమానమని సత్యం తెలుసుకొని ఏకమౌతారు.

పిక్నిక్‌నుంచి మద్రాసుకు తిరిగి వచ్చి, స్థానాలు మార్చుకొంటారు. లల్లి నాన్నవద్దకు, పప్పి అమ్మవద్దకు వెళ్తారు. కొత్త సమస్యలు ఎదుర్కొంటారు. కాని తిరుపతి కొండపై ప్రాణాపాయానికి గురి అవుతారు. ఆ వేంకటేశ్వరుని దయవల్ల అపాయంలో నుంచి తప్పించుకొని తాము ఏకం కావడమేకాక తల్లిదండ్రులలో కూడా భావైక్యత సాధిస్తారు.

"పేరెంట్ ట్రాప్" అనే వాల్ట్ డిస్నీ చిత్రం పోలికలుకల ఈచిత్రంలో కథ కొత్తది. విశ్వనాథన్ సంగీతం సామాన్యం. నిడివి మరీ దీర్ఘం. బాలనటి (పద్మిని) ద్విపాత్రాభినయం కొత్తది. అభినయ ప్రమాణం, సంభాషణోచ్ఛారణ ఉత్తమం. విన్సెంట్, సుందరం ఛాయాగ్రయాణం వారి ప్రమాణంలో లేదు. దర్శకులు కృష్ణన్ పంజూలు ఎమోషన్ సీన్సు బాగా తీశారు. నరసరాజు సంభాషణలు హాయిగానే వున్నాయి. కవలపిల్లలు కలసి నటించిన భాగాలు బాగా తీశారు. బేబి పద్మిని, జి. వరలక్ష్మి నటన మెచ్చదగింది. దాశరథి, ఆరుద్ర పాటలు వ్రాశారు. నిర్మాత: ఏ. వి. మెయ్యప్పన్.

సెప్టెంబర్ సెట్‌లలో కొత్త చిత్రాలు

గౌతమ రామబ్రహ్మంగారు క్రైమ్ సాంఘికం ప్రారంభించారు. దర్శకుడు దాదా మిరాశి. రచన: డి. వి. నరసరాజు. రామారావు, సావిత్రి, ముక్కామల తారాగణంలో కలరు.

విశ్వశాంతివారి జానపదం సెప్టెంబర్‌లో రెండవ షెడ్యూలు చూసింది. రచన: మహారథి, రామారావు, సావిత్రి ప్రధాన పాత్రధారులు. దర్శకుడు: సి. ఎస్. రావు.

డి. బి. ఎన్. కొత్త కెమెరామన్

డి. బి. ఎన్. సాంఘికానికి కొమ్మారెడ్డి రామకృష్ణారావు (తాయ్ ముఖ్య సహాయకుడు) ఛాయాగ్రహణ దర్శకుడుగా ఎన్నికైనారు. రచన ముళ్ళపూడి, దర్శకుడు విశ్వనాథ్.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers
Congress Office Road, Governorpet, Vijayawada